అనుదినం... జనస్వరం

www.navatelangana.com

# నవతెలంగాణ

శనివారం 31-08-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 196

Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam

12 పేజీలు వెల : 6.50

## సింగరేణిలో 2364 మంది బదిలీ వర్కర్ల క్రమబద్ధీకరణ

వారిలో 243 మంది మహిళలు : సీఎండీ ఎన్ బలరామ్

11లో..





## పారాలో పతక మోత

అవని లేఖర పసిడి గురి

మనీశ్ నర్వాల్‌కు సిల్వర్

వివరాలు 12లో

## హైడ్రాను ఆహ్వానిస్తున్నాం

### భావితరాల కోసం చెరువులు, నాలాల పరిరక్షణ అవసరమే

ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇండ్లు కూల్చొద్దు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

వివరాలు 3లో..



## అసమానతలు లేని రాజ్యం కోసం పోరాడాలి

### ప్రభుత్వాలు విద్య, వైద్యం ఉచితంగా అందించాలి

ఎక్కడ ప్రభుత్వ భూములున్నా రక్షించి పేదలకు పంచాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

పిలాయిపల్లిలో కళ్లెం వీరారెడ్డి స్మారక భవనం ప్రారంభం

**నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి**

కమ్యూనిస్టు కార్యాలయాలు రైతుల, వ్యవసాయ కూలీల, కార్మికుల, పేదల బతుకుల మార్పు కోసం, వారి హక్కుల కోసం పోరాడే కేంద్రాలుగా పనిచేస్తాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. దేశంలో, రాష్ట్రంలో సామాజిక అసమానతలు, దాడులు, దౌర్జన్యాలు కొనసాగుతున్నాయన్నారు. అసమానతలు లేని రాజ్యం కోసం మనమందరం పాటుపడాలని పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం ...11లో

## ఉమ్మడి నల్లగొండ సస్యశ్యామలమే నా ధ్యేయం

### నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్



భవిష్యత్‌లో ఉత్తమ్ సీఎం : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్

**నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్**

ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేయడమనే తన ధ్యేయమని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరిలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నీటి వనరులు, సాగునీటి లభ్యత, నీటిపారుదల శాఖపై ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖ ప్రాజెక్టులు, చిన్ననీటి కాలువలు, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై చర్చించారు. ప్రాజెక్టులన్నింటికీ నిధులు కేటాయించి పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఈ సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటూ సంబోధించారు. ముఖ్యమంత్రి అనే పదాన్ని వాడుతూ.. కాబోయే ముఖ్యమంత్రి అంటూ ...11లో

# పర్యాటకంలో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయంచేస్తాం సీఎం రేవంత్‌రెడ్డి హామీ

వివరాలు 10లో

### ఆ మేరకు నూతన విధానాలు

### హైదరాబాద్‌లో మరో జూ పార్క్

అనంతగిరిలో నేచర్ వెల్‌నెస్ సెంటర్

ఫోర్త్ సిటీలో వెయ్యి ఎకరాల్లో హెల్త్ హబ్

టీటీడీ తరహాలో యాదగిరి గుట్ట ఆలయ బోర్డు

రామప్పగుడి ఆకృతిలో కీసరగుట్ట పునర్ నిర్మాణం

హెల్త్, ఎకో, టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి : 'స్పీడ్'పై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్

వివరాలు 3లో



స్పీడ్‌పై సమీక్షలో అధికారులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

### న్యాయవ్యవస్థపై అత్యంత విశ్వాసం

నా వ్యాఖ్యలను కొంత మంది వక్రీకరించారు : సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో ట్వీట్ 11లో..

## మరో బుల్డోజర్‌రాజ్ కానీయొద్దు

### పేదల ఇండ్లను కూల్చటమే మీ న్యాయమా..?

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు కేటీఆర్ సూటి ప్రశ్న



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

తెలంగాణను మరో బుల్డోజర్‌రాజ్ కానీయొద్దని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్... కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. ఆ మేరకు ఇక్కడి రేవంత్ ప్రభుత్వానికి సూచించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు న్యాయాన్ని, చట్టాన్ని ఉల్లంఘిస్తూ పేదలకు గూడు లేకుండా చేస్తోందని వాపోయారు. 'ఒకరి ఇంటిని కూల్చివేసి వారి కుటుంబాన్ని నిరాశ్రయులుగా మార్చటం అమానవీయం, అన్యాయమంటూ గతంలో మీరే వ్యాఖ్యానించారు. ఇప్పుడు తెలంగాణలో అదే జరుగుతోంది. దీనికి మీ సమాధానమేంటి?' అని ఖర్గేను ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌లోని 75 మంది పేదల ఇండ్లను తెల్లవారుజామున 3 గంటలకు ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చివేసిన సంఘటనను కేటీఆర్ ట్విట్టర్ ద్వారా ఆయన దష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి చర్యలను ఆపాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించాలంటూ విజ్ఞప్తి చేశారు.

## జీడీపీ మందగమనమే

### జూన్ త్రైమాసికంలో 6.7 శాతమే

- 15 నెలల కనిష్టానికి పతనం
- వ్యవసాయం డీలా : ఎన్ఎస్ఓ



**న్యూఢిల్లీ :** భారత ఆర్థిక వ్యవస్థ మందగించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి 6.7 శాతానికి పడిపోయింది. దీంతో 15 నెలల కనిష్టానికి క్షీణించిందని శుక్రవారం స్వయంగా కేంద్ర ప్రభుత్వ గణంకాల మంత్రిత్వ శాఖనే వెల్లడించింది. 2022-23 ఇదే త్రైమాసికంలో 8.2 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ఇంతక్రితం 2023 మార్చి త్రైమాసికంలో అత్యల్పంగా 6.2 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ఆ తర్వాత ఎక్కువగా పడిపోవడం ఇదే తొలిసారి. ఆర్‌బీఐ అంచనాలకు మించి జీడీపీ పతనం కావడం ఆర్థిక వ్యవస్థ పట్ల ఆందోళన ...11లో

### కీలక రంగాల పడక

దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత ముఖ్యమైన ఎనిమిది కీలక రంగాలు డిమాండ్ లేక పడకేశాయి. ప్రస్తుత ఏడాది జులైలో కీలక రంగాల వృద్ధి 6.1 శాతానికి పరిమితమయ్యింది. 2023 ఇదే మాసంలో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ లాంటి ఎనిమిది కీలక రంగాలు 8.5 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జులై కాలంలో ఈ రంగాలు 6.1 శాతం మాత్రమే పెరిగాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో 6.6 శాతం వృద్ధిని కనబర్చాయి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో ఈ రంగాలు ఏకంగా 40.27 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత గల రంగాల వృద్ధి పడిపోవడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపనుంది.



## రాంనగర్‌లో హైడ్రా కూల్చివేతలు

### అక్రమ నిర్మాణాలను కూల్చిన జీహెచ్‌ఎంసీ అధికారులు

పోలీసు బందోబస్తు

స్థానికుల్లో ఆనందం

వివరాలు 11లో

### ఆధారాలు చూశాకే కూల్చివేత చర్యలు

హైడ్రాకు హైకోర్టు ఆదేశం



## నైట్ షిఫ్టా..వామ్మో..

### వైద్యుల్లో అభద్రతా భావం

45 శాతం మంది డాక్టర్లది ఇదే పరిస్థితి

ప్రభుత్వాస్పత్రుల్లో భద్రతా చర్యలు అధ్వాన్నం

ఐఎంఏ సర్వేలో వెల్లడి




**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా ప్రభుత్వ ప్రయివేటు ఆస్పత్రుల్లో రాత్రి షిఫ్టుల్లో పని చేసే వైద్యులు, వైద్య సిబ్బంది అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దాదాపు మూడో వంతు మంది వైద్యులు అభద్రతా భావంలో ఉన్నారు. తమకు డ్యూటీ రూమ్‌లు లేవని 45 శాతం మంది వైద్యులు తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జరిపిన సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.కోల్‌కతాలోని ఆర్జీకార్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య ఘటన తర్వాత దేశవ్యాప్తంగా వైద్యులు నిరసనలు చేస్తూ విధులు బహిష్కరించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఐఎంఏ సర్వే వచ్చింది. ఐఎంఏ కేరళ విభాగం ఈ సర్వేను నిర్వహించింది. ఇందులో భాగంగా 3,885 మంది వైద్యుల నుంచి స్పందనలను తీసుకున్నారు. 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ప్రభుత్వ ప్రయివేటు ఆస్పత్రుల్లో ఈ సర్వే నిర్వహించారు. సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు 80 శాతం మంది జూనియర్ డాక్టర్లే. వీరిలో అధికం నైట్ డ్యూటీల్లో ఉండేవారే. ఈ సర్వే ప్రకారం.. 24.1 శాతం మంది డాక్టర్లు అభద్రతగా ఉన్నామని చెప్పారు. మరో 11.4 శాతం మంది 'చాలా వరకు సురక్షితంగా' లేమని అన్నారు. అయితే, ఈ అభద్రత భావన మహిళా వైద్యుల్లో ఎక్కువగా ఉన్నది. 36.7 శాతం మంది అభద్రత భావనలో ఉన్నామనీ, 32.5 శాతం మంది చాలా అభద్రత భావనలో ఉన్నామని చెప్పారు. నైట్ షిఫ్టుల్లో డ్యూటీ రూమ్‌లు లేవని 45 శాతం మంది తెలిపారు. డ్యూటీ రూమ్‌లు లేకపోవటంతో వైద్యులు ప్రత్యామ్నాయాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రతి ఒక్క ఆరోగ్య సంరక్షణ సంస్థ డాక్టర్లు, వైద్య సిబ్బందికి సురక్షితమైన, సౌకర్యవంతమైన పని బాధ్యతను అందించే బాధ్యతను తీసుకోవాలని కేరళ ఐఎంఏ రీసెర్చ్ సెల్ చైర్మెన్, నివేదిక ప్రధాన రచయిత డాక్టర్ రాజీవ్ జయదేవన్ సూచించారు.ఇక ప్రభుత్వాస్పత్రుల్లో పని చేసే వైద్యులు, సిబ్బంది ఎక్కువ స్థాయిలో అభద్రతను కలిగి ఉన్నట్టు ...11లో

## బీజేపీకి జేడీయూ షాక్

కులగణన నిర్వహించాల్సిందేనంటూ పట్టు

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో ప్రతిపక్షానికి మద్దతు

వివరాలు 10లో

## ఓపీఎస్‌ను అమలు చేయాల్సిందే

ఎన్‌పీఎస్, యూపీఎస్ రెండింటితో ఉద్యోగులకు ఒరిగేదేమీ లేదు : సెంట్రల్ సెక్రెటేరియట్ ఉద్యోగుల సంఘం స్పష్టం

వివరాలు 12లో



# శిఖం..ఖతం

### రాష్ట్రవ్యాప్తంగా 31వేల ఎకరాల చెరువు శిఖాలు కబ్జా

నీటి పారుదలశాఖ సేకరించిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో చెరువుల భూములు పెద్ద ఎత్తున కబ్జాకు గురవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 31వేల ఎకరాల పట్టా భూమి.. చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని ప్రాథమిక అంచనా. రెవిన్యూ, నీటిపారుదల శాఖలు సంయుక్త సర్వేలు నిర్వహిస్తే ఇంకా పెద్ద ఎత్తున ఆక్రమణలు బయటకు వచ్చే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో 'హైడ్రా' ఆపరేషన్ మొదలయ్యాక చెరువు శిఖాలు, ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లపై పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. కబ్జా చెర నుంచి చెరువులు బయటపడాలంటే హైడ్రా తరహా కార్యాచరణ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాలనే డిమాండ్ పెద్ద ఎత్తున వినిపిస్తోంది.



ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సంయుక్త సర్వేతో ఫలితాలు

విచ్చలవిడి ఆక్రమణలు..అడ్డగోలు ఎన్‌వోసీలు

ఆక్రమణలపై నీటిపారుదలశాఖ రిపోర్టుల్లో కొరవడిన స్పష్టత

ఖమ్మంలోని కొన్ని చెరువుల్లో కబ్జాలున్నా.. లేనట్లు రిపోర్టు

సర్వే చేయాల్సిన రెవెన్యూ అధికారుల్లో నిర్లిప్తత

ధరణి నిషేధిత జాబితాలో కానరాని ఆక్రమిత భూములు



**నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి**

హైదరాబాద్‌లో హైడ్రా కదలికలు తీవ్రరూపం దాల్చిన నాటి నుంచి జిల్లాల్లో.. ముఖ్యంగా జిల్లా కేంద్రాల్లో చెరువుల ఆక్రమణలపై చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖ కూడా ఎప్పటికప్పుడు నివేదికలను పై అధికారులకు పంపుతోంది. కానీ ఆ నివేదికల్లో ఆక్రమణలు అంతంతమాత్రంగానే పేర్కొంటోంది. ఏ చెరువుకు ఏ సర్వే నంబర్లలో ఎంతెంత భూమి ఉంది.. వాటి వాస్తవ విస్తీర్ణం ఎంత? అనే అంశాన్ని ఇరిగేషన్ అధికారులు వెల్లడిస్తున్నా...అవి ఎంతమేరకు ఆక్రమణలకు గురయ్యాయని ప్రశ్నిస్తే సరైన సమాధానం ఉండటం లేదు. దాన్ని నిర్ధారణ చేయాల్సింది రెవెన్యూ అధికారులని దాటవేస్తున్నారు. ఉదాహరణకు ఖమ్మం ఇరిగేషన్ డివిజన్ నంబర్ -2 పరిధిలో 14 చెరువులు ఉండగా వీటిలో మూడు చెరువుల్లోనే ఆక్రమణలున్నాయని పేర్కొనడం ఆశ్చర్యం గొల్పుతోంది. వీటిలో లకారం చెరువును ప్రభుత్వమే ట్యాంక్‌బండ్ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసిందని నివేదికలో ఉంది. మొత్తం 326.66 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువు ఆయకట్టు 126 ఎకరాలని పేర్కొంది. పట్టణీకరణ ప్రభావంతో దీని ఆయకట్టు ఇండ్లు, ఇండ్లస్థలాలుగా మార్పిడి చెందిందని పేర్కొంది. కానీ బడాబాబులు ఈ చెరువు భూములను వందల ఎకరాల్లో ఆక్రమించిన విషయాన్ని మాత్రం స్పష్టం చేయలేదు. ఖానాపురం ఊరచెరువు సర్వేనంబర్ 13కు ఆనుకొని ప్రయివేటు పట్టా భూములున్నాయి. బల్లేపల్లి రెవెన్యూ సర్వే నెం.202 ఊరచెరువులోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న భూమికి నీటి పారుదల శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కన్వర్షన్, భవన నిర్మాణ అనుమతులు జారీ అయ్యాయి. వెలుగుమట్ల రెవెన్యూలోని పెద్దచెరువు సర్వే నెం.565లో ఓ రెండు ఎకరాల భూమిని ఓ జర్నలిస్టు ఆక్రమించారు. ఆ స్థలంలో బోరు కూడా వేశారు. వెలుగుమట్ల రెవెన్యూలో భద్రాచలానికి చెందిన ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మరో ...11లో

# తాళం వేసిన ఇంటికి కన్నం

- 20 తులాల బంగారం, పది తులాల వెండి అపహరణ
- వికారాబాద్ జిల్లాలో భారీ చోరీ



**నవతెలంగాణ-పెద్దేముల్**

తాళం వేసిన ఇంటికి దొంగలు కన్నం వేసిన ఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం రుద్రారం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో సుమారు 20 తులాల బంగారం, 10తులాల వెండిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఇంటి యజమాని దైవదర్శనానికి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రారం గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 28న ఉదయం యాదగిరిగుట్టకి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటి ప్రధాన ద్వారం చిలుకుని తొలగించేందుకు ప్రయత్నించగా.. సాధ్యం కాకపోవడంతో తాళాన్ని విరగొట్టారు. అనంతరం లోపలి నుంచి తలుపు పెట్టుకున్నారు. ఇంటి పై అంతస్తులో ఉండే గదిలోకి వెళ్లి బీరువా పగలగొట్టి బంగారం, వెండి వస్తువులు దొంగలించారు. గురువారం రాత్రి 12 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చిన గోపాల్ రెడ్డి దంపతులు ప్రధాన ద్వారానికి తాళం లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. తలుపు తెరిచేందుకు ప్రయత్నం చేసినా తలుపు రాలేదు. దాంతో వారి కారు డ్రైవర్ నరసింహులును మెట్లపై నుంచి వెళ్లి చూడమని చెప్పడంతో అతడు పైకి వెళ్లి చూడగా తలుపులు తెరిచి పెట్టి ఉన్నాయి. దాంతో ఇది దొంగల పనేనని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ గిరి పోలీస్ సిబ్బందితో అదే రాత్రి ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. ఉదయం తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తాండూర్ రూరల్ సీఐ అశోక్‌కుమార్, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి విచారణ జరిపారు. బాధితుల నుంచి వివరాలను సేకరించారు. సుమారు 20 తులాల బంగారం, 10 తులాల వెండి చోరీ జరిగినట్టు గోపాల్‌రెడ్డి దంపతులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.



# పురుగుల అన్నం పెడుతుండ్రు

- జాతీయ రహదారిపై పాలమాకుల కేజీబీవీ విద్యార్థినుల ఆందోళన
- సీఎం స్పందించి పరిష్కరించాలని నినాదాలు
- వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తాం : డీఈఓ
- వెంటనే పరిష్కారించాలి : ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రణయ్



**నవతెలంగాణ- శంషాబాద్**

పురుగుల అన్నం పెడుతున్నారని, తాగునీటి సౌకర్యం కల్పించడం లేదని ఆరోపిస్తూ శుక్రవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని పాలమాకుల కేజీబీవీ విద్యార్థినులు జాతీయ రహదారిపై బైటాయించి ధర్నా నిర్వహించారు. సీఎం రావాలి-న్యాయం చేయాలి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హాస్టల్‌లో నిర్వహణ లేక దారుణ పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ.. పురుగుల అన్నం పెడుతున్నారని, అడిగిన వారిపై కారంతో దాడి చేస్తున్నారని, టీచర్ల వేధింపులు తట్టుకోలేకపోతున్నామని తెలిపారు. మినరల్ వాటర్‌కు బదులు బోరు వాటర్ ఇస్తున్నారన్నారు. విషయం తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా డీఈఓ సుషీందర్ రావు, శంషాబాద్ ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థులను సముదాయించే ప్రయత్నం చేశారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల్లో సమస్యలు తీరుస్తామని డీఈవో సుశింధర్ రావు హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

**సమస్యలు వెంటనే పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవై ప్రణయ్**

కేజీబీవీలో విద్యార్థుల ధర్నా గురించి తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు కేవై ప్రణయ్.. అక్కడికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో నెలకొన్న పరిస్థితుల గురించి విద్యార్థులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కస్తూర్బా బాలికల వసతి గృహంలో విద్యార్థినులు సమస్యలతో సతమతమవుతున్నారని, ఉద్దేశపూర్వకంగానే టీచర్లు విద్యార్థినులను వేధిస్తున్నారని అన్నారు. కేజీబీవీలో టీచర్ల మధ్య ఆధిపత్య పోరు సమస్యలకు కారణమని, పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో సమస్య ముదిరి విద్యార్థుల ప్రాణాల మీదికి వస్తున్నదన్నారు. కుల వివక్ష పాటిస్తున్నట్టు విద్యార్థినులు తమతో చెప్పారని, సమస్యలు అడిగితే బూతులు తిడుతున్నారని తెలిపారు. తల్లిదండ్రులను, కుటుంబాన్ని వదిలి టీచర్లే తల్లిదండ్రులుగా భావించి ఉంటున్న విద్యార్థినులను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# సీపీఎస్, యూపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

- 1న పెన్షన్ విద్రోహ దినం కార్యక్రమాలకు టాప్ర మద్దతు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్), ఏకీకృత పెన్షన్ స్కీం (యూపీఎస్)ను రద్దు చేయాలనీ, పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్లు, రిటైర్డ్ పర్సన్ల సంఘం (టాప్ర) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సీపీఎస్‌లో కొన్ని మార్పులు చేసిందనీ, దానివల్ల ఉద్యోగులకు ఒరిగేదేమీ లేదని విమర్శించారు. వచ్చేనెల ఒకటిన తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో జరిగే పెన్షన్ విద్రోహ దినం కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగే కార్యక్రమాల్లో తాము పాల్గొంటామనీ, హైదరాబాద్‌లోని అమర వీరుల స్థూపం వద్ద నిరసనలో భాగస్వామ్యం అవుతామని తెలిపారు.

# సెప్టెంబర్ 1న సామ్రాజ్యవాద వ్యతిరేక నిరసనలు

- కార్మికులంతా జయప్రదం చేయండి : కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ఉక్రెయిన్, పాలస్తీనాపై అమెరికా సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న అమానుష దమనకాండను, యుద్ధోన్మాద వైఖరిని నిరసిస్తూ సెప్టెంబర్ ఒకటో తేదీన దేశవ్యాప్తంగా అంతర్జాతీయ యాక్షన్ డేను నిర్వహిస్తున్నట్టు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నేతలు ప్రకటించారు. శుక్రవారం ఈ మేరకు ఈ మేరకు ఆర్‌డీ చంద్రశేఖర్(ఐఎన్‌టీయూసీ), ఎన్.బాలరాజు(ఏఐటీయూసీ), పాలడుగు భాస్కర్(సీఐటీయూ), రెబ్బారామారావు(హెచ్ఎంఎస్), కె.సూర్యం(ఐఎఫ్‌టీయూ), ఎంకే.బోస్(టీఎన్‌టీయూసీ),ఎం.శ్రీనివాస్(ఐఎఫ్‌టీయూ), జి.రాంబాబు యాదవ (బీఆర్‌టీయూ), భరత్(ఏఐయూటీయూసీ), ఆర్.జనార్ధన్(ఐఎఫ్‌టీయూ) సంయుక్త ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లోని నారాయణగూడ చౌరస్తా లో ఒకటో తేదీ ఉదయం 11 గంటలకు నిరసన కార్యక్రమం ఉంటుందని తెలిపా రు. ఈ పిలుపులో కార్మికులు అత్యధికంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# ఇంటర్ ప్రవేశాల గడువు 7 వరకు పొడిగింపు

- ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల గడువును వచ్చేనెల ఏడో తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 31 వరకు ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు గడువున్నది. దాన్ని వచ్చేనెల ఏడో తేదీ వరకు పొడిగించామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలను పొందాలని విద్యార్థులకు సూచించారు. అనుబంధ గుర్తింపు ఉన్న జూనియర్ కాలేజీల్లోనే చేరాలని విద్యార్థులు, తల్లిదండ్రులను కోరారు. ఆ కాలేజీల జాబితాను acadt-gbie.cgg.gov.in , tgbie.cgg.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని వివరించారు. గుర్తింపు లేని కాలేజీల్లో చేరొద్దని సూచించారు. విద్యార్థులకు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో వచ్చేనెల ఏడో తేదీ వరకు ప్రవేశాలను కల్పించాలని కాలేజీల ప్రిన్సిపాళ్లను ఆమె ఆదేశించారు.



# హెచ్ఏఎల్‌లో బీఎంఎస్‌పై హెచ్ఏడబ్ల్యూ కూటమి గెలుపు

- అభినందనలు తెలిపిన సీఐటీయూ రాష్ట్ర కమిటీ

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

హెచ్ఏఎల్(హిందూస్తాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్)లో జరిగిన గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో బీఎంఎస్‌పై హెచ్ఏడబ్ల్యూయూ కూటమి 17 ఓట్ల మెజారిటీతో గెలవడం పట్ల సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ హర్షం వ్యక్తం చేశారు. కూటమి గెలుపునకు సహకరించిన కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్ఏఎల్‌లో మూడేండ్లుగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేయడం, సంస్థ పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు నిర్వహించడం వల్లనే హెచ్ఏడబ్ల్యూయూ కూటమి విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. హెచ్ఎఎల్ కార్మికుల్ని ఏకతాటిపై నడిపించి హక్కుల సాధన కోసం యాజమాన్యంపై ఐక్యపోరాటాలు నిర్వహించాలని హెచ్ఏడబ్ల్యూయూకు సూచించారు.



# వ్యవసాయ మహిళా డిగ్రీలో చేరేందుకు గడువు పొడిగింపు

- బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి : సైదులు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

బీసీ గురుకుల వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకునే గడువును వచ్చే నెల 15 వరకు పొడిగించి నట్టు మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సైదులు తెలి పారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 31వ తేదీ వరకు ఫైన్ ఆర్ట్స్‌లో చేరొచ్చని తెలిపారు. వ్యవసాయ కోర్సులో చేరే వారు ఇఏపిసెట్-2024 ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థినీలు దరఖాస్తు చేసుకోవాలని సూచిం చారు. ఇంటర్ పూర్తి చేసిన వారు బీ.ఏ (యానిమే షన్ అండ్ వీఎఫ్ఎక్స్) కోర్సును మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో అందుబాటు లో ఉందని తెలిపా రు.మరిన్ని వివరాలకు 9032644463, 9063242329 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

తెలంగాణ ప్రభుత్వము
స్పెషల్ డిప్యూటి కలెక్టర్ వారి కార్యాలయము
(భూసేకరణ) గద్వాల

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1) ప్రకారము

**ఫారం - 6**

**ప్రాథమిక ప్రకటన**

జిల్లా కలెక్టరు జోగులాంబ గద్వాల ప్రొసీడింగ్స్ నె. జి/457/2024 తేది:23.07.2024
ప్రత్యేక ఉపకలెక్టరు, (భూసేకరణ) జె.యల్.ఐ.పి లేఖ నెం.ఎ2/34/2024 తేది: . 07.2024

జిల్లా రాజ పత్రం నెం. 10/2024

జోగులాంబగద్వాల జిల్లా కె.టి.దొడ్డి మండలము ఇర్కిచేడు గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.1.00 సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా ప్యాకేజి నెం.104 డి9/3ఆర్ మైనర్ కెనాల్ నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ జోగులాంబగద్వాల జిల్లా గారు భావిస్తున్నారు. తెలంగాణ భూసేకరణ సవరణ చట్టము 2016 (యాక్ట్ నెం. 21/2017) సెక్షన్ 10ఎ క్రింద మినహాయింపు ఇచ్చియున్నారు. కావున నీటి పారుదల శాఖ ప్రాజెక్టుకు సామాజిక ప్రభావము అధ్యయన వేదిక అవసరం లేనందున అనుబంధంలో పేర్కొనిన భూముల పై నోటీసు జారీ చేయనైనది.

**షెడ్యూలు**

గ్రామము: ఇర్కిచేడు మండలం:కె.టి.దొడ్డి జిల్లా : జోగులాంబ గద్వాల

| క్ర.సం. | సర్వే నెం./ సబ్ డి.నెం. | పట్టా భూమి వివరము | భూమి స్వభావము | సేకరించు విస్తీర్ణం | పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏదైనా హక్కులు గల ఇతర వ్యక్తులు | సరిహద్దులు | | | | చెట్లు | | నిర్మాణాలు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 153 | ప్రభుత్వ భూమి | మెట్ట | 1.00 | ప్రభుత్వ భూమి అనుభవదారులు: 1) లోక నాయక్ తండ్రి సూర్య నాయక్ 2) లోక 3) మంగ్లీబాయి భర్త గొన్య నాయక్ | - | - | - | - | - | - | - | - |
| మొత్తం విస్తీర్ణము | | | | 1.00 | | | | | | | | | |

భూసేకరణ పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టరు, జోగులాంబగద్వాల జిల్లా గారు, ప్రత్యేక ఉప కలెక్టర్, జె.ఎల్.ఐ.పి గద్వాల, మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4)ను నుసరించి కలెక్టర్ గారి అనుమతి లేకుండా షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయు దమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టర్, జె.ఎల్.ఐ.పి., గద్వాల గారి ఎదుట అభ్యర్థనలు దాఖాలు చేసుకోనవచ్చును.

| సం/- | సం/- | సం/- |
|---|---|---|
| స్పెషల్ డిప్యూటి కలెక్టర్, జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు గద్వాల | అదనపు కలెక్టర్ జోగులాంబ గద్వాల జిల్లా | కలెక్టరు జోగులాంబ గద్వాల జిల్లా |

DIPR Ro.No.220/LA-PP/Advt/Pub/2024-25

నాగర్‌కర్నూల్ జిల్లా గజిట్
ఎక్స్‌ట్రార్డనరీ పబ్లిష్డ్ అథారిటీ

గెజిట్ నెం.31/2024 నాగర్‌కర్నూల్ గురువారం తేది:22.08.2024

**ఫారం. VII**

(యాక్ట్-30/2013 యొక్క రూల్-25 యొక్క సబ్-రూల్ (1) మరియు సెక్షన్-19(1) చూడు)
తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (ఎల్ఏ) డిపార్ట్‌మెంట్
కలెక్టర్ / జాయింట్ కలెక్టర్

**(డిక్లరేషన్)**

నెం.ఉ/1176/2024 తేది:22.06.2024

ఎక్కడైతే, నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట్ మండలం పుల్లగిరి గ్రామంలో మొత్తం 0.30 ఎకరాల భూమి ప్రజా ప్రయోజనం కోసం అవసరమని కలెక్టర్ భావిస్తున్నారు, తిమ్మాజీపేట్ మండలం పుల్లగిరి గ్రామం వద్ద పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం క్రింద కురుమూర్తిరాయ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కొరకు ఎర్త్ బండ్ ఏర్పాటు చేయుటకు.,

అందువల్ల, నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట్ మండలం పుల్లగిరి గ్రామంలో పైన చెప్పబడిన ప్రాజెక్ట్ కొరకు సేకరణ క్రింద ప్రామాణిక కొలత యొక్క ఎక్కువ లేదా తక్కువ 0.30 ఎకరాల భూమికి సంబంధించి డిక్లరేషన్ చేశారు, ఏదైతే క్రింద వివరించిన విధంగా :

కురుమూర్తిరాయ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కొరకు ఎర్త్ బండ్

1. గ్రామం : పుల్లగిరి మండలం : తిమ్మాజీపేట్

| క్ర.స. | సర్వే నెం. | భూమి రకం | మెట్ట / తరి | విస్తీర్ణం ఎక. గుంట లలో | పట్టాదారు పేరు / తండ్రి పేరు | సరిహద్దులు | | | | చెట్లు | నిర్మాణాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 249 /ఆ/1 | పట్టా | మెట్ట | 0.10 | [illegible] | 254 | 245 | 255 | 253 | లేవు | లేవు |
| 2 | 259 /ఆ4 | పట్టా | మెట్ట | 0.20 | [illegible] | [illegible] | 261 | 257 | 260 | లేవు | లేవు |
| మొత్తం | | | | 0.30 | | | | | | | |

ఆసక్తిగల వ్యక్తుల యొక్క అభ్యంతరాలు విన్న తర్వాతే ఈ ప్రకటన చేయబడినది మరియు యాక్ట్ నెం.30/2013 యొక్క సెక్షన్ క్రింద విచారణ నిర్వహించనైనది. భూసేకరణ వల్ల పునరావాసం కల్పించాల్సిన కుటుంబాల సంఖ్య ఏమీలేదు. ఎవరికైతే పునరావాసం గుర్తించాల్సి ఉన్నట్లో, వారి యొక్క సంక్షిప్త వివరణ ఈ విధంగా ఉన్నది :-

గ్రామం : నిల్., మండలం : నిల్., జిల్లా : నిల్., ప్రాంతం : నిల్., చెప్పబడిన భూమి లేదా చెప్పబడిన భూమి యొక్క ఏదైనా భాగంలో బొగ్గు గనులు, ఇనుప-ఖనిజం, పలకరాయి లేదా ఇతర ఖనిజాలు, సదరు భాగాల్లో గనులు లేదా ఖనిజాలు ఏదైనా తవ్వడం లేదా తొలగించడం లేదా ప్రాజెక్ట్ నిర్మాణ దశలో వినియోగించడం, ఏదైతే ప్రయోజనం కొరకు భూమిని సేకరిస్తున్నామో, అవసరం రాదు.

భూమి యొక్క ప్రణాళికను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్ఏ పిఆర్ఎల్ఐఎస్ యూనిట్-II, నాగర్ కర్నూల్ ఆఫీసులో ఏదైనా పనిదినంలో తనిఖీ చేయును.

ప్రతిపాదిత భూసేకరణ వల్ల ఏ ఒక్క కుటుంబం కూడా స్థానభ్రంశం చెందదు. అందువల్ల, పునరావాసం మరియు రీసెటిల్‌మెంట్ స్కీం అనేది ఉత్పన్నం కాదు.

| సం./- | సం./- | సం./- |
|---|---|---|
| ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, ఎల్ఏ పిఆర్ఎల్ఐఎస్ యూనిట్-II నాగర్‌కర్నూల్ | అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) నాగర్‌కర్నూల్ | జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ |

DIPR Ro.No.227/LA-PP/Advt/Pub/2024-25

తెలంగాణ ప్రభుత్వం
**అటవీ శాఖ**
అటవీ మండలాధికారి కార్యాలయము, కొమ్రంభీం ఆసిఫాబాద్

లేఖ సంఖ్య: 5324/2017/ఎస్4 **ప్రకటన** తేది: 29-08-2024

ఈ క్రింద చూపబడిన వాహనములు అక్రమముగా కలపను (చట్ట విరుద్ధముగా) రవాణా చేయుచున్నందున అటవీ శాఖ అధికారులు స్వాధీనపరుచుకొని ఉన్నారని ఇందు మూలముగా తెలియచేయడమైనది. అటవీ చట్టము 1967 సెక్షన్ 44 క్రింద చర్య తీసుకోబడుటకు నిర్ణయించడమైనది.

| Sl. No. | Range | Description of the Vehicle | Vehicle No. | Sl. No. | Range | Description of the Vehicle | Vehicle No. |
|---|---|---|---|---|---|---|---|
| 1 | Jodeghat | Passion Plus | AP01K8575 | 33 | Kerameri | Swift Car | TS20A 4805 |
| 2 | Jodeghat | Bajaj Auto | AP01X9760 | 34 | Kerameri | Indica Car | AP01Q6465 |
| 3 | Jodeghat | Eicher Van | AP01V6625 | 35 | Rebbena | Bajaj Auto | TS19T2862 |
| 4 | Jodeghat | Bullero | AP 16TT7696 | 36 | Rebbena | TATA Magic | TS04UA5245 |
| 5 | Ginndhory | Suzuki | AP15 4020 | 37 | Rebbena | Fore wheeler | AP02x1662 |
| 6 | Ginndhory | Suzuki Max 100 | AP15J 2106 | 38 | Rebbena | TATA Indica | AP15BM6848 |
| 7 | Ginndhory | Suzuki Max 100 | AP37AA7388 | 39 | Rebbena | Toyota Qualis | AP15L 9228 |
| 8 | Ginndhory | Suzuki Max | No Number | 40 | Rebbena | Auto | AP15V 6800 |
| 9 | Ginndhory | Hero Honda Splender | AP01K9577 | 41 | Rebbena | Eicher Van | AP15U 5410 |
| 10 | Ginndhory | Splendor | No Number | 42 | Rebbena | Auto | AP1U 4873 |
| 11 | Ginndhory | Suzuki | No Number | 43 | Asifabad | Toyota Qualis | AP15Y2590 |
| 12 | Ginndhory | Hero Splender | AP24AM 0220 | 44 | Asifabad | Eicher Van | AP01 W 6957 |
| 13 | Ginndhory | Suzuki Bike | No Number | 45 | Asifabad | TATA Xenon Pickup | AP01 Y 7440 |
| 14 | Tiryani | Maruthi Omini Van | AP12C0993 | 46 | Asifabad | TATA Lorry | AP04U8909 |
| 15 | Tiryani | Inidica Car | AP01K3495 | 47 | Asifabad | Hero Honda | Chasis No:MBLHA10 |
| 16 | Tiryani | Auto | AP01U 9881 | 48 | Asifabad | Motor cycle | EG8JO28 |
| 17 | Tiryani | Tata Van | AP29T806 | 49 | Asifabad | Eixher VAN | AP01U 0551 |
| 18 | Tiryani | Maruthi 800 Car | AP 10 R 3405 | 50 | Asifabad | 1. Toofan | AP24N 8210 |
| 19 | Tiryani | Eicher Van | AP 27 W 8185 | 51 | Asifabad | 2. TATA Zest Car | |
| 20 | Tiryani | TVS Suzuki | No Number | 52 | Asifabad | | TS19D 1213 |
| 21 | Tiryani | TVS Suzuki | AP01E7713 | 53 | Asifabad | Bolero Max Pickup | AP01Y 5907 |
| 22 | Tiryani | Tata Indigo Car | AP28AP 4374 | 54 | Asifabad | TATA SUMO | AP15W 5351 |
| 23 | Tiryani | Toyota Qualis | AP12 M 4359 | 55 | Asifabad | AUTO | AP01W 5322 |
| 24 | Tiryani | Bajaj Pulsar | TS19C2895 | 56 | Asifabad | AUTO | AP01W4148 |
| 25 | Tiryani | Tata Indigo Car | AP09BA1524 | 57 | Asifabad | Toyota Qualis | AP25AQ 8419 |
| 26 | Tiryani | TVS Suzuki | AP15K411 | 58 | Asifabad | TATA Winger | AP36W 5775 |
| 27 | Kerameri | Auto | AP01Y1080 | 59 | Asifabad | TATA Magic | Chasis No MAT445112AVK79508 |
| 28 | Kerameri | Apachi Bike | AP01AD7404 | 60 | Asifabad | TATA Indica Vista | AP01R 4251 |
| 29 | Kerameri | Mahendra Bolero (Jeep) | AP22U5964 | 61 | Asifabad | BAJAJCT100 BIKE | CH.NO MD2A18A20GWBO307 8 |
| 30 | Kerameri | Four Wheeler (Car) | AP01AB1897 | 62 | Asifabad | TATA Indica Vista | TS08UB 3974 |
| 31 | Kerameri | Auto | TS19T4390 | 63 | Asifabad | Tata Magic | AP22TV 1202 |
| 32 | Kerameri | TATA ACE | AP01X6279 | 64 | Asifabad | TATA Indigo XL | Chasis No.MAT609112AWJ397 52 |
| | | | | 65 | Asifabad | AUTO | AP01W 3768 |

కనుక పైన చూపబడిన వాహనముల యజమానులు సదరు వాహనములను రాష్ట్ర ప్రభుత్వానికి శాశ్వతముగా స్వాధీనపరచుకోవాలనే ప్రతిపాదనకు సంబంధించి ఏదైనా ఆక్షేపణలు ఉన్నట్లో, సదరు యజమానులు అట్టి ఆక్షేపణలను ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి (07) రోజులలోగా తెలియపర్చుకోవచ్చునని ఇందుమూలముగా తెలియచేయడమైనది. ఆక్షేపణలు అందని మరియు లేని వాహనములను ప్రభుత్వమునకు శాశ్వతముగా స్వాధీనం చేయబడును అని తెలియజేయడమైనది.

సం/- అధరైజ్డ్ అధికారి,
అటవీ మండలాధికారి, ఆసిఫాబాద్

DIPR R.O.No.3477-PP/CL/ADVT/1/2024-25

# మందులపై కానరాని బ్రెయిలీ లిపి

## దృష్టి లోప బాధితుల ఇబ్బందులు | చికిత్సలో సమస్యలు | ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి

**న్యూఢిల్లీ :** 2011లో సేకరించిన జనగణన ప్రకారం దేశంలో 2.28 కోట్ల మంది వివిధ వైకల్యాలతో బాధపడుతున్నారు. వీరిలో 77 లక్షల మందికి దృష్టి లోపం ఉంది. వీరికి అవసరమైన మందుల ఉత్పత్తిలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల భాగస్వామ్యం తగ్గిపోతోంది. ముఖ్యంగా మందులపై బ్రెయిలీ లిపితో కూడిన అక్షరాలు లేకపోవడంతో దృష్టి లోపం కలిగిన వారు వైద్య సాయం కోసం ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. అంధులు, దృష్టి లోపం కలిగిన వారు బ్రెయిలీ లిపి సాయంతో చదవగలుగుతారు. మందుల ప్యాకేజీలపై ఆ లిపిని ముద్రించకపోవడంతో సరైన వైద్య చికిత్స పొందడం వారికి సవాలుగా మారింది.

దేశంలోని ఔషధ ఉత్పత్తి సంస్థలు ఇప్పటికీ మందులపై బ్రెయిలీ లిపిని ముద్రించడం లేదు. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ టీఆర్. అలమేలు కనీసం 40 శాతం దృష్టి లోపంతో ఇబ్బంది పడుతున్నారు. మందులు కొనుగోలు చేయడం, వాటిని వాడడం తనకు చాలా సమస్యగా ఉన్నదని ఆమె వాపోయారు. మందులు కొనుగోలు చేసేటప్పుడు ఆమె దుకాణం యజమాని చెప్పిన సమాచారం పైనే ఆధారపడాల్సి వస్తోంది. మందుల ప్యాకేజీపై బ్రెయిలీ లిపి లేకపోవడమే దీనికి కారణం.




### ప్రత్యామ్నాయం లేదు

ప్రభుత్వ ఉద్యోగి అయిన ధీరా రాజోసర 2008లో పూర్తిగా కంటి చూపు కోల్పోయారు. ఇతర విషయాలలో చురుకుగానే ఉంటున్నప్పటికీ తన మందుల కోసం ఆయన ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. అమెరికా, యూరప్‌లో మందులపై బ్రెయిలీ లిపి ఉంటుందని, ఇక్కడ అది లేదని ఆయన వాపోయారు. బ్రెయిలీ ప్యాకేజింగ్‌పై ఔషధ కంపెనీలు పెద్దగా దృష్టి సారించడం లేదని ఫిర్యాదు చేశారు. అత్యవసర సందర్భాలలో సాయం చేసేందుకు పక్కన ఎవరూ ఉండరు. అలాంటప్పుడు సమస్యలు మరీ ఎక్కువగా ఉంటాయి.కోవిడ్ సమయంలో విధించిన లాక్‌డౌన్ కారణంగా చాలా ఇబ్బందులు పడ్డామని అలమేలు గుర్తు చేసుకున్నారు. మందులపై బ్రెయిలీ ప్యాకేజింగ్ అవసరమని అంటూ దృష్టి దోషంతో బాధపడే వారిలో అనేక మంది ఒంటరిగానే ఉంటారని, సమయానికి మందులు ఇస్తూ సాయం చేసే వారు ఎవరూ ఉండరని ఆవేదనతో చెప్పారు. ఎవరికైనా ఫోన్ చేద్దామని అనుకున్నా అది కూడా కష్టంగానే ఉంటుందని అన్నారు. బ్రెయిలీ లిపికి ప్రత్యామ్నాయమే లేదని ఆమె స్పష్టం చేశారు.

### టెక్నాలజీ సాయంతో...

జర్నలిజంలో మాస్టర్స్ డిగ్రీ చేస్తున్న జుహైబ్ ఖాన్ పూర్తి అంధుడు. మందుల ప్యాకేజీలపై బ్రెయిలీ లిపి లేకపోవడంతో టెక్నాలజీని ఆశ్రయించాల్సి వస్తోందని ఆయన తెలిపారు. టెక్ ఫ్రీడమ్, టెక్ బ్యాక్ వంటి యాప్స్‌ను ఉపయోగిస్తూ మందుల పేర్లతో పాటు వాటి తయారీలో వాడిన రసాయనాలను గురించి కూడా తెలుసుకుం టున్నారు. అయితే బ్రెయిలీ ప్యాకేజింగ్‌కు కృత్రిమ మేథ ప్రత్యామ్నాయం కాబోదని, మందును స్కానింగ్ చేసి ఆడియో నోట్‌ను వినడానికి ఎక్కువ సమయం పడుతుందని ఆయన చెప్పారు. పైగా టెక్నాలజీని ఉపయోగించడం అందరికీ తెలియదని, యాప్‌ల వాడకంలో ఇబ్బంది పడతాయని తెలిపారు. సిరప్ బాటిల్స్ అన్నీ ఒకేలా ఉంటాయని, అలాంటప్పుడు షాపులోని సిబ్బందిపై ఆధారపడాల్సి వస్తుందని ఓ హాస్టల్‌లో ఉంటున్న యువకుడు చెప్పాడు.

### ఎగుమతులకే పరిమితం

కొన్ని కంపెనీలు విదేశాలకు మందులు ఎగుమతి చేసేటప్పుడు ప్యాకేజీలపై విధిగా బ్రెయిలీ లిపిని ముద్రిస్తున్నాయి. ఉదాహరణకు యామిర్ ప్యాకేజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ మందులను ప్యాక్ చేస్తుంది. యూరప్‌లో మందులపై తప్పనిసరిగా బ్రెయిలీ లిపిని ముద్రించాలి కాబట్టి అక్కడికి పంపే మందులపై ఆ లిపిని ముద్రిస్తుంది. కానీ మన దేశంలో అలాంటి నిబంధనలేవీ లేవు. ముందుగా బ్రెయిలీ ముద్రణాలయాలను నెలకొల్పి, ఆ తర్వాత వాటిని ఔషధ కంపెనీలకు సరఫరా చేయా లని కేంద్రం భావించింది. అయితే ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. 1940వ సంవత్సరపు డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ చట్టం దిగుమతులు, తయారీ, పంపిణీ, విక్రయానికి సంబంధించి నిబంధనలు నిర్దేశించింది. కానీ బ్రెయిలీ లిపి ముద్రణను తప్పనిసరి చేయలేదు.

### న్యాయస్థానాలు తీర్పులు ఇచ్చినా...

మందులపై బ్రెయిలీ లిపి ముద్రణకు సంబంధించి సుప్రీంకోర్టు సహా పలు న్యాయస్థానాలు స్పష్టమైన తీర్పులు ఇచ్చినప్పటికీ ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ కూడా ప్రభుత్వం తరఫున న్యాయస్థానానికి తన స్పందనను తెలియజేయలేదు. సీసాలు సహా మందుల ప్యాకేజీలపై విధిగా బ్రెయిలీ లిపిని ముద్రించేలా సంబంధిత మంత్రిత్వ శాఖలు చర్యలు చేపట్టాలని ఢిల్లీ హైకోర్టు న్యాయవాది పీయుష్ కుమార్ కోరారు. ఔషధ తయారీ కంపెనీల్లో తరచుగా తనిఖీలు చేయాలని, నిబంధనలు పాటించని సంస్థలపై జరిమానాలు విధించాలని సూచించారు.



# హైడ్రాను ఆహ్వానిస్తున్నాం

## భావితరాల కోసం చెరువులు, నాలాల పరిరక్షణ అవసరమే

- ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇండ్లు కూల్చొద్దు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

హైడ్రా పేరుతో చెరువులు, నాలాలలో ఉన్న నిర్మాణాలను తొలగిస్తున్న సందర్భంగా పేదలు, మధ్యతరగతి ప్రజానీకం దీనికి సమిధలు కాకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చెరువులు, నాలాలు, జలవనరుల సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా వ్యవస్థ ఆహ్వానించదగ్గదేనని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. అయినప్పటికీ చెరువులు, నాలాల పక్కన ఏండ్లుగా నివసిస్తున్న పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా వారి ఇండ్లను కూల్చొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 12 ఏండ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 78 మంది వికలాంగులకు ఇండ్లపట్టాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ ఇండ్లను ఆక్రమణల పేరుతో గురువారం తెల్లవారుజామున బుల్డోజర్లతో కూల్చివేశారని తెలిపారు. ఏండ్ల తరబడి అక్కడే నివాసముంటూ కాయకష్టం చేసుకుంటూ బతుకుతున్న పేదలు బజారున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. వారిని తక్షణం ఆదుకోవాలని కోరారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లోని హస్మత్‌పేట్, అల్వాల్ తదితర బస్తీల్లో కూడా పేదల ఇండ్లను నేలమట్టం చేశారని పేర్కొన్నారు. చెరువులు, నాలాల పక్కన ఆక్రమణలు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల పేరుతో ప్రత్యామ్నాయం చూపకుండా పేదలు, మధ్యతరగతి వారిని బజారుపాలు చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పర్యాటకంలో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం




**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో నూతన విధానాలను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి టూరిజంలో ముందంజలో ఉన్న ఇతర రాష్ట్రాల విధానాలపై అధ్యయనం చేయాలని ఆయన వారికి సూచించారు. ఆయా పాలసీల్లో మెరుగైనవి, మన రాష్ట్రానికి అనువుగా ఉన్న వాటిని అనుసరించాలని కోరారు. స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ)పై సమీక్షలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్... టూరిజం అభివృద్ధి ప్రాజెక్టులపై అధికారులతో సమావేశమయ్యారు.

టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హెల్త్ టూరిజం అభివృద్ధి కోసం విడివిడిగా పాలసీలను రూపొందించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. తెలంగాణలో ఉన్న ప్రాచీన ఆలయాలు, చారిత్రక స్థలాలతోపాటు అటవీ ప్రాంతాలు, వైద్య సదుపాయాలన్నింటినీ పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు. రవాణాతోపాటు వసతి, పర్యాటకులకు అవసరమైన అన్ని సదుపాయలు ఉండేలా కొత్త టూరిజం ప్యాకేజీలను రూపొందించాలని సూచించారు. కవ్వాల్, అమ్రాబాద్ అటవీ ప్రాంతాల్లో సఫారీలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. రాత్రి విడిది చేసేందుకు వీలుగా కొన్ని చోట్ల కాటేజీలను నిర్మించాలని చెప్పారు. పర్యాటకానికి అనువైన ప్రాంతాలన్నింటినీ గుర్తించటంతోపాటు వాటిలో ఏయే ప్రాంతాలను ముందుగా అభివృద్ధి చేయాలనే విషయమై టూరిజం, దేవాదాయ, అటవీ శాఖ అధికారులు చర్చించి, నిర్ణయించాలని ఆదేశించారు.

కేవలం మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి, హరిత హోటళ్లు, వసతి గృహాలను నిర్మించి వదిలేస్తే సరిపోదని సీఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. వాటి నిర్వహణను నిరంతరం పర్యవేక్షించి, మెరుగ్గా ఉండేట్టు చూడాలని అన్నారు. అప్పుడే అవి పర్యాటకులను ఆకర్షిస్తాయని తెలిపారు. అందుకే కొత్తగా చేపట్టబోయే ప్రాజెక్టులన్నింటినీ ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంలో చేపట్టాలని సూచించారు. తద్వారా ఉద్యోగాల కల్పనతోపాటు రాష్ట్రాభివృద్ధికి ఉపయోగపడేలా టూరిజాన్ని అభివృద్ధి పరచాలని కోరారు.

హైదరాబాద్ బయట దాదాపు వెయ్యెకరాల విస్తీర్ణంలో కొత్త జూ పార్క్‌ను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి జంతువులు, పక్షులను తీసుకొచ్చి కొత్త జూ పార్క్‌లో ఉంచాలని సీఎం సూచించారు. దీంతోపాటు అర్బన్ ఫారెస్ట్‌ని అభివద్ధి చేయాలని ఆదేశించారు. జామ్‌నగర్‌లో అనంత్ అంబానీ మూడువేల ఎకరాల్లో వనతార వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని నెలకొల్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. అలా ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలు, సంస్థలను కూడా ఆహ్వానించాలని ముఖ్యమంత్రి సూచించారు.

అనంతగిరి ప్రాంతంలో అద్భుతమైన ప్రకృతి అటవీ సంపద ఉందని సీఎం తెలిపారు. అక్కడున్న 200 ఎకరాల ప్రభుత్వ భూములను హెల్త్ టూరిజం అభివృద్ధికి వినియోగించాలని ఆయన నిర్ణయించారు. బెంగళూరులోని జిందాల్ నేచర్ క్యూర్ ఇన్‌స్టిట్యూట్ తరహాలో అనంతగిరిలో నేచర్ వెల్‌నెస్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ సెంటర్ ఏర్పాటుకు జిందాల్ ప్రతినిధులు ఆసక్తిగా ఉంటే సంప్రదింపులు జరపాలని అన్నారు. ప్రకృతి వైద్య రంగంలో పేరొందిన ప్రముఖ సంస్థలను ఆహ్వానించాలని అధికారులకు సూచించారు.

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డును ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు. అచ్చంగా టీటీడీ అనుసరించిన తరహాలోనే బోర్డుకు స్వయం ప్రతిపత్తి, విధి విధానాలు ఉండేలా అవసరమైతే చట్ట సవరణ చేయాలని ఆదేశించారు. యాదగిరిగుట్ట ఆలయ రాజ గోపురానికి బంగారు తాపడం పనులను కూడా ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. ఆ ఆలయ అభివృద్ధి పనులు చాలావరకు అర్ధంతరంగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. అవి అలా ఆగిపోవడానికి వీల్లేదన్నారు. ఇప్పటివరకు ఏయే పనులు జరిగాయి, ఇంకా ఏయే పనులు అసంపూర్తిగా ఉన్నాయనే వివరాలతో వారం రోజుల్లో సమగ్ర నివేదికను సమర్పించాలంటూ ఆదేశించారు. అక్కడికి వచ్చే భక్తుల సౌకర్యాలు, విడిది చేసేందుకు కాటేజీలు, వాటి నిర్మాణాలకు దాతలు, కార్పొరేట్ సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు.

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అద్భుతంగా యాదగిరిగుట్టను తీర్చిదిద్దాలని చెప్పారు. ప్రస్తుతం కీసర గుట్టపై ఉన్న రామలింగేశ్వర ఆలయాన్ని అద్భుతంగా పునర్ నిర్మించేందుకు ముఖ్యమంత్రి నిర్ణయించారు. ములుగు జిల్లాలోని రామప్ప ఆలయానికి ప్రతిరూపంగా.. అచ్చం అదే నమూనాతో కీసరగుట్ట ఆలయాన్ని నిర్మించాలని చెప్పారు. అక్కడ ఉపయోగించిన శ్యాండ్ బాక్స్ టెక్నాలజీ జోలికి పోవద్దనీ, ఇప్పుడున్న అధునాతన టెక్నాలజీతో రామప్ప ఆలయ ఆకృతిలో యథాతథంగా కీసర ఆలయ పునర్ నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు.

హైదరాబాద్ ఫోర్త్ సిటీలో వెయ్యెకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న హెల్త్ సిటీలో హెల్త్ టూరిజాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇక్కడ తమ తమ సెంటర్లను నెలకొల్పేందుకు ముందుకొచ్చే సంస్థలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు ఇచ్చేలా కొత్త పాలసీ తయారు చేయాలని చెప్పారు. వివిధ దేశాల నుంచి వచ్చే వారికి వైద్య సేవలందించే 'వన్ స్టాప్ సొల్యూషన్ ప్యాకేజీ'లను రూపొందించాలని చెప్పారు. ఆన్‌లైన్‌లోనే అన్ని సేవల వివరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎయిర్ పోర్ట్ నుంచి నేరుగా హాస్పిటల్‌కు వెళ్లి, డాక్టర్ల అపాయింట్‌మెంట్, ట్రీట్మెంట్ తీసుకునేలా సదుపాయాలన్నీ ఉండాలని సూచించారు. దేశంలోనే అందరి దృష్టిని ఆకర్షించేలా హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని దిశా నిర్దేశం చేశారు. సమీక్షా సమావేశంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, ఆ శాఖ కమిషనర్ హనుమంతరావు, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిష్టియానా, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియల్‌తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భారతీయుల్లో సూక్ష్మపోషకాల లోపం

## స్త్రీ, పురుషులు.. ఇద్దరిలోనూ ఇదే పరిస్థితి

- మహిళలు అయొడిన్‌ను.. మగవారు జింక్, మెగ్నీషియంలను సరిపడా తీసుకోవటంలేదు
- లాన్సెట్ అధ్యయనం వెల్లడి




**న్యూఢిల్లీ :** భారతీయుల్లో సూక్ష్మపోషకాల లోపంపై లాన్సెట్ అధ్యయనం హెచ్చరిస్తున్నది. భారత్‌లోని స్త్రీ, పురుషుల్లో అన్ని వయసులవారు ఆరోగ్యానికి ముఖ్యమైన ఐరన్, కాల్షియం, ఫొలేట్ వంటి సూక్ష్మపోషకాలను సరిపడా తీసుకోవటంలేదని అంచనా వేసింది. 'ది లాన్సెట్ గ్లోబల్ హెల్త్ జర్నల్'లో ఈ అధ్యయనాన్ని ప్రచురించింది.

ఈ అధ్యయనం ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 70 శాతం(500 కోట్ల మందికి పైగా) మంది ప్రజలు సరిపడా అయొడిన్, విటమిన్ ఈ, కాల్షియంలను తీసుకోవటంలేదు. ముఖ్యంగా, ఒక దేశంలో, ఒకే వయసువారిలో మహిళలు అయొడిన్, విటమిన్ బీ12, ఐరన్‌ను మగవారితో పోలిస్తే తగినంతగా తీసుకోవటంలేదని పరిశోధకులు గుర్తించారు. ఇక పురుషులు.. మహిళలతో పోలిస్తే మెగ్నీషియం, విటమిన్ బీ6, జింక్, విటమిన్ సీ లను తగిన మొత్తంలో తీసుకోవటం లేదు. భారత్‌లోనూ చాలా మంది మహిళలు పురుషులతో పోలిస్తే తగినంత మొత్తంలో అయోడిన్‌ను పొందటంలేదు. ఇక మహిళలతో పోలిస్తే పురుషులు సరిపోని మొత్తంలో జింక్, మెగ్నీషియంలను తీసుకుంటున్నారు. 10 నుంచి 30 ఏండ్ల వయసు మధ్య ఉన్న పురుషులు, మహిళల్లో చాలా మంది తక్కువ స్థాయిలో కాల్షియం తీసుకుంటున్న అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా, దక్షిణాసియా, ఈశాన్య ఆసియా, ఉప సహారా ఆఫ్రికాలో ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని పరిశోధన బృందం తెలిపింది.

# పాక్‌తో చర్చల శకం ముగిసినట్లే !

## విదేశాంగ మంత్రి జై శంకర్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** పాకిస్తాన్‌తో చర్చలు జరిపే శకం ఇక ముగిసి పోయిందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వ్యాఖ్యానించారు. రాయబారి రాజీవ్ సిక్రి రాసిన కొత్త పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పాక్‌తో భారత్ సంబంధాలపై ఆయన వివరంగా మాట్లాడారు. "పాక్‌తో నిరంతరంగా చర్చలు జరిపే శకం ముగిసినట్లేనని నేను భావిస్తున్నా. చర్యల వల్ల పర్యవసానాలు వుంటాయి. జమ్మూ కాశ్మీర్‌కు సంబంధించినంతవరకు, చేయాల్సింది 370వ అధికరణ చేసిందనుకుంటున్నాను. ఇక పాకిస్తాన్‌తో ఎటువంటి సంబంధాలు పెట్టుకోవాలని మనం ఆలోచిస్తాం. ప్రస్తుతమున్న సంబంధాలతో భారత్ సంతృప్తిగా వుండి వుంటుందని రాజీవ్ సిక్రి తన పుస్తకంలో పేర్కొన్నారు. అది నిజమో కాదో...మేం నిష్క్రియాపరులం కాదు, సానుకూల దిశలో లేదా ప్రతికూల దిశలో ఏ సంఘటనలు చోటు చేసుకున్నా కచ్చితంగా మేం స్పందిస్తాం." అని జై శంకర్ పేర్కొన్నారు. ఆఫ్ఘనిస్తాన్, భారత్ ప్రజల మధ్య పటిష్టమైన సంబంధాలున్నాయని చెప్పారు. ఆఫ్ఘనిస్తాన్ గురించి ఆందోళనలు వున్నా, ప్రజల మధ్య సంబంధాలు బలంగా వున్నాయి. ఆఫ్ఘన్ సమాజంలో భారత్ పట్ల సుహృద్భావన వుంది. అమెరికా బలగాలు వున్న ఆఫ్ఘనిస్తాన్‌కు, అమెరికా ఉనికే లేని ఆఫ్ఘనిస్తాన్‌కు చాలా తేడా వుందని చెప్పారు. బంగ్లాదేశ్‌తో పరస్పర ప్రయోజనాలను కనుగొనాల్సి వుందని అన్నారు. బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి భారత్‌తో సంబంధాలు ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. అయితే అది సహజమేనని అన్నారు. అక్కడ జరుగుతున్న రాజకీయ మార్పులను మనం గుర్తించాల్సి వుందని, పరస్పర ప్రయోజనాలను చూసుకోవాల్సి వుందని అన్నారు.

# సంకట స్థితిలో కేంద్రం



## ఎస్సీ-ఎస్టీ వర్గీకరణ విషయంలో అనిశ్చితి

- సుప్రీంతీర్పుపై ఎటూ తేల్చుకోలేక సతమతం
- రాష్ట్రాలకు అధికారాన్ని కట్టబెట్టే విషయమై స్పందించని బీజేపీ
- కాషాయపార్టీలోనూ అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు
- ఎన్డీఏ కూటమిలోనూ అదే తీరు.. ఒక్కోపార్టీది ఒక్కో వైఖరి
- టీడీపీ, జేడీ(యూ) సై.. ఎల్జేపీ(పాశ్వాన్) నై
- సర్వోన్నత న్యాయస్థానం తీర్పును వ్యతిరేకిస్తున్న పలు దళిత సంఘాలు
- ఇటీవలే దేశవ్యాప్త ఆందోళనలు
- తీర్పును మోడీ సర్కారు వ్యతిరేకించాలంటూ డిమాండ్

**న్యూఢిల్లీ :** ఎస్సీ-ఎస్టీ ఉప వర్గీకరణ అధికారాన్ని రాష్ట్రాలకు కట్టబెడుతూ ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలన తీర్పు కేంద్రాన్ని, బీజేపీని సందిగ్ధంలో పడేసింది. ఈ తీర్పును సమర్థించాలా లేక వ్యతిరేకించాలా అన్న స్పష్టత లేని అయోమయ స్థితిలో ఇప్పుడు కాషాయ నేతృత్వంలోని సర్కారు ఉన్నది. కేంద్రంతో పాటు పలు రాష్ట్రాల్లో బీజేపీ, దాని నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. అయితే, ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణ విషయంలో రాష్ట్రాలకు అధికారాన్ని కట్టబెట్టే విషయంలో ఆ పార్టీ ఇప్పటి వరకూ మాట్లాడలేదు.

దీంతో ఈ విషయంలో తొందరపడొద్దనీ, ఆచితూచి వ్యవహరించాలనే విధానంలో బీజేపీ ఉన్నట్టు కనిపిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై ప్రభుత్వం సంబంధిత వ్యక్తులు, సంస్థలతో మాట్లాడుతున్నదనీ, తగిన సమయంలో దీనిపై స్పందిస్తుందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, దళిత నాయకుడు గురు ప్రకాశ్ పాశ్వాన్ అన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు చెందిన క్రీమీలేయర్‌ను గుర్తించి మినహాయించేందుకు రాష్ట్రాలు ఒక విధానాన్ని రూపొందించాలని సుప్రీంకోర్టు తన తీర్పులో చెప్పింది. అయితే, ఎన్డీఏలోని జేడీ(యూ), టీడీపీ వంటి పలు కీలక మిత్రపక్షాల నుంచి వచ్చిన ఒత్తిడితో క్రీమీలేయర్ విషయంలో కేంద్రం వెనకడుగు వేసింది. క్రీమీలేయర్‌ను అమలు చేయబోమని స్పష్టతనిచ్చింది.

### ఎన్డీఏలోనే లేని ఏకాభిప్రాయం

ఎస్సీ, ఎస్టీల ఉపవర్గీకరణ విషయంలో రాష్ట్రాలకు అధికారాన్ని కట్టబెట్టే విషయంపై కేంద్రం ఇప్పటి వరకూ తన వైఖరిని తెలియజేయలేదు. అయితే, ఈ విషయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమిలోని పార్టీలు మాత్రం భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పును టీడీపీ, జేడీ(యూ)లు సమర్థించగా.. ఎల్జేపీ(పాశ్వాన్) పార్టీ మాత్రం దానిని వ్యతిరేకిస్తున్నది. ఇటు మోడీ 2.ఓ సర్కారు కూడా ఎస్సీలలో అసమానతల విషయమై క్యాబినెట్ సెక్రెటరీ నేతృత్వంలో ఒక ఉన్నతస్థాయి కమిటీని ఈ ఏడాది జనవరిలో ఏర్పాటు చేసింది. అయితే, తెలంగాణతో పాటు ఏపీలో గణనీయమైన సంఖ్యలో ఉన్న మాదిగ ఓటు బ్యాంకును ప్రసన్నం చేసుకోవటానికే బీజేపీ ఈ ఎత్తుగడను వేసిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఇటు బీజేపీలోనే ఏకాభిప్రాయం లేదనీ, పలువురు నేతలు భిన్నాభిప్రాయాలు వెల్లడిస్తున్నారని విశ్వసనీయంగా తెలుస్తున్నది.

### రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభావం

హర్యానా, జమ్మూకాశ్మీర్‌లలో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాదిలోనే మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం జరగాల్సి ఉన్నాయి. హర్యానా రాష్ట్ర జనాభాలో 20 శాతం దళిత జనాభానే ఉన్నది. ఇటు మహారాష్ట్ర, జార్ఖండ్‌లలోనూ గణనీయమైన సంఖ్యలో దళితులు, ఆదివాసీలు ఉన్నారు. దీంతో సుప్రీంతీర్పుపై ఎటూ తేల్చుకోలేని సంకట స్థితి బీజేపీకి నెలకొన్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

### దళిత సంఘాల ఆగ్రహం

సుప్రీంకోర్టు తీర్పుపై దేశవ్యాప్తంగా పలు దళిత సంఘాలు ఆగ్రహంతో ఉన్నాయి. తీర్పును పున:పరిశీలించాలంటూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాలనే ఆలోచనలు సదరు సంఘాలు చేస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పును కేంద్రం తప్పక తిరస్కరించాలనీ జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మెన్ డిమాండ్ అశోక్ భారతి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని అన్నారు. "హర్యానా, ఇతర రాష్ట్రాల్లో బీజేపీకి ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తగులుతాయి. ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)కు మెమోరాండంను అందించాం. త్వరలోనే మేము సుప్రీంకోర్టును ఆశ్రయించి రివ్యూ పిటిషన్ వేస్తాం" అని ఆయన అన్నారు. కాగా, ఇటీవల దళిత, ఆదివాసీ సంస్థలు పిలుపునిచ్చిన దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్, ఆర్జేడీ, బీఎస్పీ, ఎన్డీఏ మిత్రపక్షం ఎజేపీ(ఆర్‌వీ) వంటి ప్రతిపక్షాలు, పార్టీలు మద్దతునిచ్చాయి.

సంపాదకీయం

# కేరళ ముందడుగు



మలయాళ చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపులపై జస్టిస్ హేమా కమిటీ ఇచ్చిన నివేదిక నేపథ్యంలో- సినిమా రంగంలోని మహిళలకు గౌరవమూ, రక్షణ చేకూర్చే చర్యలపై మరొకసారి చర్చ జరుగుతోంది. అవకాశాల కోసం పోటీపడే ఈ రంగంలో ఆ అభిలాషనే ఆసరాగా తీసుకొని కాస్టింగ్ కౌచ్‌కు పాల్పడుతున్న సంఘటనలపై చాలాకాలంగా నిరసన వ్యక్తమవుతోంది. 2006లో బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్.. ఇలా అన్ని చోట్లా పెద్దఎత్తున మీటూ ఉద్యమం జరిగింది. తమకు ఎదురైన లైంగిక వేధింపులపై ఎందరో బాధిత మహిళలు గొంతెత్తారు. ఆ తరువాత, అంతర్గత ఫిర్యాదుల కమిటీల ఏర్పాటు వంటివి తప్ప దాదాపుగా ఏ పరిశ్రమలోనూ విచారణ జరపలేదు, ఎలాంటి నిర్దిష్ట చర్యలూ చేపట్టలేదు.

> కేరళ సమాజంలో నెలకొని ఉన్న చైతన్యపూరిత వాతావరణం సినీ పరిశ్రమలోనూ ప్రతిబింబిస్తూ ఉంటుంది. హక్కుల పట్ల, ఆత్మగౌరవం పట్ల తగినంత ఎరుకను అక్కడి నటీనటులు ప్రదర్శిస్తారు. మీటూ ఉద్యమం జరిగినా దేశవ్యాప్తంగా ఎక్కడా ఏ ప్రభుత్వమూ ఎలాంటి కమిటీలను వేసి, విచారణ జరపలేదు. కేరళలో మాత్రమే అలాంటి ప్రయత్నం జరిగింది. జస్టిస్ హేమా కమిటీ నివేదికలో పేర్కొన్న పరిస్థితులు అన్ని సినీ పరిశ్రమల్లోనూ నెలకొని ఉన్నాయి. నటీనటులకు సమాన గౌరవం, జూనియర్ నటులకు తగు సదుపాయాల కల్పన, పారితోషికాల్లో తీవ్ర వ్యత్యాసాల నివారణ వంటివి ప్రయత్నపూర్వకంగా అన్ని సినీ పరిశ్రమల్లోనూ కల్పించాల్సి ఉంది.

కేరళలో 2017 ఫిబ్రవరిలో భావన అనే నటిపై కారులోనే కొందరు లైంగిక దాడికి ప్రయత్నించటం, ఆమె తప్పించుకొని రెండోరోజు పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిన నేపథ్యంలో- చిత్ర పరిశ్రమలో జరుగుతున్న లైంగిక వేధింపులపై పలువురు స్పందించారు. విమెన్ వింగ్ ఇన్ సినిమా కలెక్టివ్ (డబ్ల్యుసిసి) ఏర్పడి, ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు వినతిపత్రం ఇచ్చారు. వామపక్ష ప్రభుత్వం వెంటనే స్పందించి, హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ కె.హేమ నేతృత్వాన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ముందుకు నేరుగా వచ్చి మాట్లాడటానికి కొంతమంది వెనకాడుతున్నారని తెలిశాక- ఫిర్యాదుదారుల వివరాలు, విషయాలూ ఎట్టి పరిస్థితుల్లోనూ బయటపెట్టబోమని, ఏ రూపంలోనైనా తమకు వాంగ్మూలాలు అందజేయవచ్చునని జస్టిస్ హేమా కమిటీ ప్రకటించింది. ఎక్కువమందిని కలవటానికి, వారి ఫిర్యాదులు నమోదు చేయటానికి ప్రాధాన్యం ఇచ్చింది. రెండేళ్ల పాటు విచారణ జరిపి, 2019 డిసెంబరు 31న రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఆ నివేదికను బయటపెట్టమని కొందరు డిమాండు చేయగా- అంశాల్లోని సున్నితత్వం, ఫిర్యాదుదారుల గోప్యత తదితర కారణాల వల్ల నివేదిక బహిరంగ వెల్లడికి జస్టిస్ హేమ కమిటీ ఒప్పుకోలేదు. సున్నిత అంశాలను మినహాయించి, మిగతా అంశాలను వెల్లడించాల్సిందిగా ఇటీవల హైకోర్టు ఆదేశించటంతో ఆగస్టు 17న ఈ నివేదిక బహిర్గతమైంది.

జస్టిస్ హేమా కమిటీ ఈ నివేదికలో అనేక అంశాలను ప్రస్తావించింది. మలయాళ సినిమా పరిశ్రమలో కొంతమంది మగ దర్శకుల, నటుల పెత్తనం సాగుతోందనీ ప్రశ్నించేవారిపై అనధికార నిషేధం కొనసాగుతోందనీ మహిళా నటులపై లైంగిక వేధింపులు సాగుతున్నాయనీ సర్దుకుపోవడం, రాజీపడడం అనేది ఒక సూత్రంగా అమలు చేయబడుతోందని వివరించింది. జూనియర్ నటుల పట్ల తీవ్రమైన వివక్ష ఉందని, పని ప్రదేశాల్లో బట్టలు మార్చుకోవటానికి కానీ, కాలకృత్యాలు తీర్చుకోవటానికి కానీ తగిన ఏర్పాట్లు ఉండడం లేదని పేర్కొంది.

చిన్న నటులతో రాతపూర్వక ఒప్పందాలు ఉండడం లేదని, ఎక్కువ పని చేయించుకొని తక్కువ వేతనాలు ఇస్తున్నారని తెలిపింది. ఈ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించింది. నాలుగేళ్ల క్రితం నివేదిక తనకు అందిన నాటి నుంచి సినీ పరిశ్రమలో మహిళలకు రక్షణ చర్యలను ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చేపట్టింది. నిర్మాతల మండలితో, దర్శకులతో సంప్రదింపులు జరిపి, షూటింగ్ ప్రదేశాల్లో మహిళలకు తగు సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకొంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టడమే ప్రధాన ఉద్దేశంగా ఉన్న కొన్ని శక్తులు ఈ నివేదికలోని సున్నితాంశాలపై రచ్చ చేస్తున్నాయి. పరిస్థితిని చక్కదిద్దటానికి, మహిళల ఆత్మగౌరవం కాపాడ్డానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే కమిటీ వేసి విచారణ జరిపించామని ముఖ్యమంత్రి పినరన్ విజయన్ మరోసారి స్పష్టం చేశారు.

కేరళ సమాజంలో నెలకొని ఉన్న చైతన్యపూరిత వాతావరణం సినీ పరిశ్రమలోనూ ప్రతిబింబిస్తూ ఉంటుంది. హక్కుల పట్ల, ఆత్మగౌరవం పట్ల తగినంత ఎరుకను అక్కడి నటీనటులు ప్రదర్శిస్తారు. మీటూ ఉద్యమం జరిగినా దేశవ్యాప్తంగా ఎక్కడా ఏ ప్రభుత్వమూ ఎలాంటి కమిటీలను వేసి, విచారణ జరపలేదు. కేరళలో మాత్రమే అలాంటి ప్రయత్నం జరిగింది. జస్టిస్ హేమా కమిటీ నివేదికలో పేర్కొన్న పరిస్థితులు అన్ని సినీ పరిశ్రమల్లోనూ నెలకొని ఉన్నాయి. నటీనటులకు సమాన గౌరవం, జూనియర్ నటులకు తగు సదుపాయాల కల్పన, పారితోషికాల్లో తీవ్ర వ్యత్యాసాల నివారణ వంటివి ప్రయత్నపూర్వకంగా అన్ని సినీ పరిశ్రమల్లోనూ కల్పించాల్సి ఉంది. కేరళ వలె ప్రభుత్వాలు అన్నిచోట్లా విచారణ, అధ్యయనం జరిపించి, తగు చర్యలు తీసుకోవాలి.

---

# సాహిత్యా'రుద్రుడు'

భాగవతుల సదాశివ శంకర శాస్త్రి అంటే చాలామందికి తెలియదు. ఆరుద్ర అనగానే 'ఆహా' అనుకుంటారు. అవును. వారే వీరు. ఆ (రుద్ర) మూర్తి 'ముద్ర' తెలుగు సాహిత్యంలో తిరుగులేనిది, చెరపలేనిదీనూ! ఆరుద్ర ఒక సంచలనం. ఆయన కవి, గేయకర్త, నాటకకర్త, నటుడు, సినిమా రచయిత, నవలాకారుడు, కథకుడు, అనువాదకుడు, పరిశోధకుడు. ఇలా ఆయన సాహిత్య కృషి ఒక చిత్ర వర్ణ పట్టకం.

'త్వమేవాహమ్' నిజాం నిరంకుశ పరిపాలనపై ధిక్కార స్వరానికి నగారా! అందులో ఆరుద్ర వాడిన ప్రతీకలు, పదబంధాలు, నూతన అభివ్యక్తి... కవిత్వ ప్రియుల్ని విశేషంగా ఆకర్షించాయి. ఆ కవిత్వానికి వ్యాఖ్యానాలూ, భాష్యాలు చాలానే వచ్చినై. ఆరుద్ర శ్రీమతి కె రామలక్ష్మిగారు 1999లో త్వమేవాహమ్ స్వర్ణోత్సవ ముద్రణకు ముందు మాట రాస్తూ 'ఈనాటికీ నేను 'త్వమేవాహమ్' ఆవాహన చదువుతుంటే ఆ వాక్యాల్లోని తాత్వికత – చెప్పిన విధానంలోని తూగు, లయ, ఊపు, ఉద్వేగం – బుర్రని గిరికీలు కొట్టిస్తా యి. కాలం గురించి అందులో వచ్చే దంతా కవిత్వంలో ఒక 'మాస్టర్ పీస్' దాన్ని గురించి చెప్పి చెప్పి, అంటారు.



"కాలం ఒక తేలని ప్రశ్న, కాలం ఒక తీరని తృష్ణ, విరామం లేదు, విజ్ఞానానికి సందేహం తీరదు వేదాంతికి..."అని.

సినారె విశ్లేషణలో ఒక్క మాటంటారు "ఇలియట్ ప్రభావంతో ప్రతీకలను వాడుట నేర్చుకొని, స్వోపజ్ఞతతో ఛందస్సు చేత చాకిరీ చేయించుకొని తెలుగు కవితలో అపూర్వ సంవిధానమునకు బాటలు తీసిన అతి నవ్యుడు ఆరుద్ర" అని. 'త్వమేవాహమ్' మన మేధో పరిధిని విస్తృతం చేసే కవిత్వ వృత్తలేఖిని!

ఆరుద్ర కథలు వ్రాయటం ఎలాగో చెప్పాడు. చదరంగం ఆడటమెలాగో నేర్పాడు. డిటెక్టివ్ నవల ఎలా ఉండాలో రాసి చూపాడు. పదబంధాలు కూర్చాడు. తెలుగు సాహిత్యంలో ఎవ్వరూ ఊహించలేని సాహం – సమగ్ర ఆంధ్ర సాహిత్యం. సంపుటాల ఆరుద్ర దీక్షకే గాదు, నిబద్ధతకీ, దక్షతకీ కూడా శాశ్వత నిదర్శనం.

సినీ పాటల రచయితగా ఆరుద్ర పోకడ దానికదే సాటి. ఆ మెరుపూ ఝళిపింపూ దేనికదే సాటి. 'గాంధీ పుట్టిన దేశమా?' ఇపుడు వినండి. సార్వకాలీనమైన సత్యదర్శనం కనిపిస్తుంది. 'ఇండియాకు రాజధాని ఢిల్లీ. నా హృదయంలో ప్రేమరాణి లిల్లీ' వంటి గమ్మత్తులూ, చెమక్కులూ కోకొల్లలు. 'చుట్టూ చెంగావిచీరె' పల్లవి పాడుతుంటే ఆ నులివెచ్చని భావన రసహృదయాల్ని తడితడిగా తాకుతుంది. 'నేనొక ప్రేమ పిపాసిని' అని ఎత్తుకోగానే నిజంగానే మానసాకాశం మీద 'ఇంద్రధనుస్సు' విరుస్తుంది (అదే సినిమా పేరు). శ్రీరస్తు శుభమస్తు అనుకోగానే పెళ్లి పుస్తకం తెరుచుకుంటుంది. ఇక పాటల్లో ఇంగ్లీష్ పదాల ప్రయోగం సరేసరి. ఆయన ముద్ర, కొత్త ఒరవడి 'పడుచుదనపు రైలు బండిపోతున్నది' 'రాయినైనా కాపోతిని' 'ఊహలు గుసగుసలాడే' 'వేదంలా ఘోషించే గోదావరి' వంటి పాటల్లో చిరస్థాయిగా ఉంటాయి. 'నీలీల పాడెదు దేవా' వంటి డబ్బింగ్ పాటలు ఎంత ప్రాచుర్యాన్ని పొందాయో మనందరికీ తెలుసు.

...ఇన్ని ఇన్ని విశేషల వ్యక్తిత్వం కలిగి సాహిత్య గరివృక్షం వంటి ఆరుద్రని ఎన్నుకుంటే 'ఏరిన ముత్యాలు' ఉన్నాయి. జలజలా రాలుతాయి. అయితే 'మానవుడే మహనీయుడు' ఒక్కదాన్ని ఇపుడు స్మరిద్దాం. వర్తమానత, సామాజికత, అభ్యుదయాకాంక్ష, 'మనిషి' మనిషే. తిరుగులేదు వాడికి అదే ప్రబోధం – ఇవాళ ఏ.ఐలు, ఎంఎల్‌లు, రోబోటెక్స్ విస్తరిస్తున్నా కూడా ఎంతటి సంభావ్యత, ప్రాసంగికత ఉన్న సందేశమో తలుచుకుంటే – ఆరుద్ర ఎంత గొప్ప ద్రష్టో అర్థమవుతుంది. ఆరుద్ర అంటే – సంతకం లేకున్నా వాఙ్మయాన్ని తరచి, గెలిచి, తలెత్తి నిలిచిన వ్యాసమూర్తి కండ్ల ముందు ప్రత్యక్షమవుతాడు.

(నేడు ఆరుద్ర 99వ జయంతి)

-విహారి

---

# దక్షిణాసియాలో నిశ్శబ్ద ప్రజాస్వామిక ప్రతిఘటన



ఫర్హాన్ హనీఫ్ సిద్ధిఖీ    అజయ్ గుడవర్తి

ఇటీవలి బంగ్లాదేశ్ పరిణామాలు, అంతకుముందు శ్రీలంక, పాకిస్థాన్‌లో జరిగిన సంఘటనలతో పాటుగా తాజాగా భారతదేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు, దక్షిణాసియాలో నిశ్శబ్ద ప్రజాస్వామిక ప్రతిఘటనను స్పష్టంగా తెలియ జేస్తున్నాయి. వలసపాలన అనంతర ప్రజాస్వామ్య దేశాలలో భిన్నమైన చారిత్రక ప్రక్షేపమార్గాలు ఉంటుండగా,భారతదేశ ప్రస్తుత పరిస్థితిని పాకిస్థాన్‌తో పోల్చడం ద్వారా ఈ ప్రతిఘటనను మనం అర్థం చేసుకుంటాం.

రెండు దేశాలు ఒకే విధమైన వలస వారసత్వాన్ని కలిగి ఉన్నప్పటికీ పాకిస్థాన్, హద్దులు దాటి నిరంకుశత్వం వైపు పయ నించగా భారతదేశంలో సుదీర్ఘ కాలంపాటు ప్రజాస్వామ్యం ఎందుకు కొనసాగిందనే కారణాలపై వలసపాలన అనంతర కాలాల్లోని భారతదేశం, పాకిస్థాన్‌లోని రాజకీయ వ్యవస్థల మధ్య పోలికలు ప్రధానంగా కేంద్రీకరించాయి. అనేకమంది మేధావులు, పాకిస్థాన్‌తో పోల్చితే భారతదేశంలో ప్రజాస్వామ్యానికి దోహదం చేసిన కారణాలను వివరించారు. ఈ కారణాలు భారతదేశంలో ప్రజాపునాది గల రాజకీయ పార్టీ వ్యవస్థకు ఎదురుగా సంస్థాగతంగా బలహీనంగా ఉన్న ముస్లింలీగ్‌ల ఉనికి దగ్గర్నుండి కాంగ్రెస్‌ను స్థాపించిన నిర్దిష్టమైన (మధ్య తరగతి) సామాజిక వర్గాలు, ముస్లింలీగ్‌ల ఆధిపత్యం వరకూ ఉన్నాయి.

అలాంటి వివరణల విలువ స్పష్టంగా ఉంది. అది భారతదేశం, పాకిస్థాన్‌ల రాజకీయ ప్రక్షేపమార్గల గురించి మన అవగాహనను పెంచుతుండగా, సాంప్రదాయమైన పోలిక అదే రీతిలో పాకిస్థాన్‌లోని ప్రజాస్వామిక స్థలాన్ని అవగాహన చేసుకోవడానికి చేసిన ప్రయత్నాలను బలహీనపరిచింది. ఇది, ప్రజాస్వామిక ఆధారాలు ఉన్నప్పటికీ భారతదేశ రాజకీయ వ్యవస్థలోని నిరంకుశ ధోరణి విశ్లేషణను మసక బరిచింది. ఈ నిర్దిష్టమైన తర్కం ద్వారా మనం అవగాహన చేసుకొని, సూచించిన వాటిని వివరించి, సామా జిక శక్తులు ప్రజాస్వామిక స్థలాన్ని తిరిగి పొందడానికి ప్రయత్నించే భారతదేశం, పాకిస్థాన్‌లు నిశ్శబ్ద ప్రజాస్వామిక ప్రతిఘటనల మధ్య ఉన్నాయని వాదిస్తాము.

క్రియాత్మక ప్రజాస్వామ్యం, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతమైన ఎన్నికల చరిత్ర, అధికారాల విభజన అంగీకార యోగ్యమైన ఆలోచనతో భారతదేశం అసాధారణవాదానికి ప్రతీకగా నిలిచింది. 1975లో విధించబడిన (నియమాల్ని ఉల్లంఘించే) ఎమర్జెన్సీని నిరోధించి, భారతదేశం ఒక బాధ్యతాయుతమైన ప్రజాస్వామ్య దేశంగా మిగిలిపోయింది. సైనిక పాలనపై పౌర పాలన ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు రాజ్యాంగపరమైన దృష్టి, వలసవాద వారసత్వ వ్యతిరేకత భారతదేశం విషయంలో బాగా పని చేసింది. జవహర్ లాల్ నెహ్రూ మంత్రివర్గంలో (1957-62) రక్షణ మంత్రిగా పనిచేసిన కృష్ణ మీనన్ సాయుధ బలగాలను బలహీనపర్చడంలో చాలా కీలకమైన పాత్రను పోషించాడు. ఈ విషయాన్ని ఇటీవలి కాలంలో జైరామ్ రమేష్, కృష్ణ మీనన్ జీవిత చరిత్రలో పేర్కొన్నాడు. భారత దేశం ఏనాడూ ఇంతవరకు సైనిక నియంతృత్వ ముప్పును ఎదుర్కోలేదు.

అయితే 2014లో మొదలైన నరేంద్రమోడీ పాలన అన్నిటినీ మార్చేయడం జరిగింది. అవసరానికి మించి నిరంకుశ పాలనా నమూనా దిశలో వేగంగా వెళ్లడంలో భారత దేశం కూడా పోటీపడుతుంది. భారతీయ ప్రజాస్వామిక కసరత్తు అధ్యక్ష తరహా రూపాన్ని తీసుకోవడమే కాకుండా ప్రతిపక్షం లేని ప్రజాస్వామ్యం కోసం కూడా ప్రచారం చేయడం బహుశా ఇది మొదటిసారి. భారతీయ జనతా పార్టీ 'కాంగ్రెస్ ముక్త భారత్' అనే ప్రచారాన్ని చేపట్టింది. ప్రస్తుత పాలక ప్రభుత్వం భద్రత, సాయుధ బలగాలకు సంబంధించిన సమస్యల్ని రాజకీయం చేస్తోంది. విద్యార్థులు, యువకులు చేపట్టే ప్రజాస్వామిక నిరసన రాజకీయాలను ఎదుర్కొనేందుకు భారత దేశంలోని యూనివర్సిటీలను



మతపరమైన శరణాలయాలుగా, సాయుధ బలగాలకు ప్రతీకలుగా మార్చాలని కోరుతున్నారు.

## పాకిస్థాన్‌లో

మరోవైపు పాకిస్థాన్, బ్యూరోక్రసీ (ఉద్యోగస్వామ్యం), మిలిటరీతో రాజకీయ ప్రక్రియను నాశనం చేసి, నిరంకుశత్వం వైపు నడిపించే దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. ఉన్నత వర్గం స్థానంలో నిరంకుశత్వం బాగా లోతుగా పాతుకుపోయినప్పటికీ 1958 నుండి అన్ని మిలిటరీ నియంతృత్వాలు, మిలిటరీ పాలన పట్ల ప్రజలు పెద్ద ఎత్తున చేసిన నిరసనల ద్వారా వారి మరణాన్ని చూశాయి. ఒక సందర్భంలో ప్రజల నిరసనలతోనే పాకిస్థాన్ మొదటి సార్వత్రిక ఎన్నికలు ప్రారంభమయ్యాయి. పాకిస్థాన్ తూర్పు భాగంలో మిలిటరీ అణిచివేత, 1971లో ఆ రాజ్య విచ్ఛిన్నం, అంటే మిలిటరీ అనుకున్న దానికి పూర్తిగా వ్యతిరేకంగా జరిగింది. జనరల్ ముషారఫ్ పాలన ప్రజల్ని, రాజకీయ ఉన్నత వర్గాల వారిని ఒకే విధంగా దూరంలో ఉంచడం వల్ల రాజకీయ వ్యవస్థను అదుపు చేసి, ఆధిపత్యం చెలాయించే ఉద్దేశ్యం మళ్లీ ఒక న్యాయవాదుల ఉద్యమంతో, చట్టబద్ధత కోల్పోయి కుప్పకూలిపోయింది. 2008 నుండి పాకిస్థాన్‌లో నాలుగుసార్వత్రిక ఎన్నికలు జరిగాయి, సాపేక్షంగా చూస్తే ప్రజాస్వామ్య వ్యవస్థకు పరివర్తన జరిగింది. అయితే ఈ పరివర్తనకు వ్యతిరేకంగా మిలిటరీ తీవ్ర ప్రతిఘటనను తెలిపింది. ఈ కాలంలోనే పాకిస్థాన్ రాజకీయాలకు ప్రజాస్వామిక మార్గాన్ని కొనసాగించాలని రాజకీయ ఉన్నత వర్గాలకు చెందిన వారి ఏకాభిప్రాయం కూడా తెలుసు. కానీ గడిచిన రెండు ఎన్నికలు (2018, 2024), రాజకీయ ప్రత్యర్థులను ఎంతకైనా కొనడమేకాక మరీ ముఖ్యంగా వారిని అంతమొందించి, తుడిచిపెట్టడానికి మిలిటరీతో ఏకాభిప్రాయాన్ని కోరుకునే రాజకీయ ఉన్నత వర్గాలకు చెందిన వారి ఆందోళనకర వైఖరిని సూచిస్తున్నాయి.

అయితే రాజకీయ ఉనికికోసం మిలిటరీతో ఎత్తుగడల పొత్తుల్ని చేపట్టిన రాజకీయ ఉన్నత వర్గీయులకు, మిలిటరీకి కూడా ఫలితం చాలా ప్రతికూలంగా వచ్చింది. ప్రజాస్వామ్యానికి అనుకూలంగా పౌరుల లోతైన, విస్తృతమైన వాదనలను, అదే విధంగా ఎవరికి పాలించే హక్కు ఉంది అనే దానిపై రోజురోజుకూ రాజకీయ వర్గాలకు, మిలిటరీకి మధ్య పెరుగుతున్న వైరుధ్యాలను 2008 నుండి పాకిస్థాన్ చూస్తూనే ఉంది. పాకిస్థాన్ తెహ్రీక్-ఈ-ఇన్సాఫ్ (పీటీఐ) ప్రభుత్వం మరియు మిలిటరీ కేవలం పాకిస్థాన్ ముస్లింలీగ్ (ఎన్) ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, ప్రదర్శనలు చేపట్టడాన్ని చూసేందుకు 'ఒక పేజీ' మంత్రాన్ని ప్రారంభించాయి. మరీ ముఖ్యంగా మిలిటరీ మాత్రం తన రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ పని చేసింది.

తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత ప్రభుత్వ తొలగింపు కోసం పీటీఐ మిలిటరీని లక్ష్యంగా పెట్టుకోవడం ద్వారా పీఎంఎల్ (ఎన్) చెయ్యాల్సిన పనిని నెత్తికెత్తుకుంది. ఫలితమేమంటే, మొత్తం ప్రభుత్వ యంత్రాంగం దానికి విరుద్ధంగా పని చేసినప్పటికీ పీటీఐ భారీగా ఓట్లు సంపాదించి, పార్లమెంట్‌లో అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించింది. ఎవరైనా తెలుసుకోవాల్సిన విషయమేమంటే, మిలిటరీతో పొత్తు, రాజకీయ ఉన్నత వర్గాలకు అధికారానికి స్వల్పకాలిక మార్గాన్ని ఏర్పరు స్తుంది కానీ రాజకీయ, సామాజిక అవగాహన కలిగిన పౌరులు ఈ కూటమిని, మిలిటరీ రాజకీయ ప్రయోజనాలను ప్రశ్నిస్తారు.

భారతదేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలు, బీజేపీ నిరంకుశ రాజకీయాలకు వ్యతిరేకంగా ఒక ప్రజాస్వామిక ప్రతిఘటనను చూశాయి. పాకిస్థాన్‌లో మిలిటరీ-పార్టీ బంధాన్ని ప్రజలు నిరసించి, ఎన్నికల చట్టబద్ధతను ప్రశ్నించారు. భారతదేశంలో 1975లో ఎమర్జెన్సీ లాంటి కొన్ని చారిత్రక సంఘటనలు జరిగిన సమయంలో మధ్యతరగతి వర్గాలు నియంతృత్వం కోసం పరితపించారు. భారతదేశంలోని వైవిధ్యం, దానితోపాటు వచ్చే సామాజిక గందరగోళాన్ని నిర్వహించడానికి నియంతృత్వం చాలా సమర్థవంతంగా పని చేస్తుందని వారు భావించారు. పాకిస్థాన్‌లో మధ్య తరగతి వర్గం కూడా గజిబిజిగా ఉన్న ప్రజాస్వామ్య రాజకీయాలకు వ్యతిరేకంగా మిలిటరీ పాలనకు అనుకూలంగా సాంప్రదాయ రాజకీయ వైఖరిని ప్రదర్శించింది. కానీ రాజకీయాల్లోకి మిలిటరీ ప్రవేశించడాన్ని అక్కడి యువతరం చాలా తీవ్రంగానే విమర్శిస్తుంది.

> 2014లో మొదలైన నరేంద్రమోడీ పాలన అన్నిటినీ మార్చేయడం జరిగింది. అవసరానికి మించి నిరంకుశపాలనా నమూనా దిశలో వేగంగా వెళ్లడంలో భారతదేశం కూడా పోటీపడుతుంది. భారతీయ ప్రజాస్వామిక కసరత్తు అధ్యక్ష తరహా రూపాన్ని తీసుకోవడమే కాకుండా ప్రతిపక్షం లేని ప్రజాస్వామ్యం కోసం కూడా ప్రచారం చేయడం బహుశా ఇది మొదటిసారి. భారతీయ జనతా పార్టీ 'కాంగ్రెస్ ముక్త భారత్' అనే ప్రచారాన్ని చేపట్టింది. ప్రస్తుత పాలక ప్రభుత్వం భద్రత, సాయుధ బలగాలకు సంబంధించిన సమస్యల్ని రాజకీయం చేస్తోంది. విద్యార్థులు, యువకులు చేపట్టే ప్రజాస్వామిక నిరసన రాజకీయాలను ఎదుర్కొనేందుకు భారత దేశంలోని యూనివర్సిటీలను మతపరమైన శరణాలయాలుగా, సాయుధ బలగాలకు ప్రతీకలుగా మార్చాలని కోరుతున్నారు.

## దృష్టి కోణంలో

ప్రజాస్వామ్యాలు తిరోగమనాన్ని ఎదుర్కొంటున్నందు వల్ల ప్రజాస్వామిక ప్రతిఘటనను ప్రదర్శించడానికి డిజిటలైజ్డ్ స్థలాల్ని ఉపయోగించడంతోపాటు పౌరులు కొత్త విధానాల్ని కనుగొంటున్నారు. వారు భారతదేశంలో స్థిరమైన రాజకీయ మార్పుకు దారితీసే విధంగా ఎన్నికల ఫలితాల ద్వారా తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. పాకిస్థాన్‌లో ఇది ఎలాంటి రూపం తీసుకుంటుందో చూడాలి.

("ద హిందూ" సౌజన్యంతో)

(ఫర్హాన్ హనీఫ్ సిద్ధిఖీ, ఇస్లామాబాద్ (పాకిస్థాన్)లోని ఖాయిద్ ఈ ఆజమ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్)
(అజయ్ గుడవర్తి జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్)
అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

---

# ప్రపంచ యుద్ధాలు - గుణపాఠాలు



డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

ప్రపంచ దేశాలు 'అల్లీస్ (ఫ్రాన్స్, యుకె, యుఎస్, యుఎస్ఎస్ఆర్, చైనా, పోలాండ్)', 'ఆక్సిస్ (జర్మనీ, జపాన్, ఇటలీ)' అనబడే రెండు జట్లుగా ప్రపంచ ముఖ్య దేశాలు విడిపోయి 1939 నుంచి 1945 వరకు జరిగిన భీకర రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొనడం ప్రపంచం మొత్తానికి తెలుసు. ప్రపంచ వ్యాప్తంగా 30 దేశాలకు చెందిన 100 మిలియన్ల జనాభా పాల్గొనడం, 85 మిలియన్ల సైనిక/సామాన్య ప్రజల అపార ప్రాణ నష్టం, తొలి అణుబాంబుల విధ్వంసకర (హిరోషిమా, నాగసాకి) భయానక అనుభవాలు, యుద్ధ అనంతర కరువులు, వ్యాధుల వ్యాప్తి పీడలు, ఆస్తి విధ్వంసాలు, మారణహోమాలు, నరమేధాలు, అపార ఆర్థిక కుదుపులతో ప్రపంచ చరిత్రలోనే అత్యంత చేదు అనుభవాలను చవిచూశాయి. 'ఆక్సిస్' వర్గపు జర్మనీ, జపాన్ తదితర దేశాలు అపార ఆస్తి ప్రాణ నష్టాలను నమోదు చేసుకోవడం, కనీసం 12 మిలియన్ల ప్రాణ నష్టం జరగడం అత్యంత బాధాకరం. విజేతలైన 'అల్లీస్' వర్గంలో కూడా దాదాపు 61 మిలియన్ల ప్రాణ నష్టం జరిగిందని తెలుస్తున్నది. ఒక్క సోవియట్ యూనియన్లోనే 27 మిలియన్లు, జర్మనీ 5.3 మిలియన్లు, చైనా 7.5 మిలియన్ల ప్రాణాలను కోల్పోవలసి వచ్చింది. వరల్డ్ వార్-2లో సహితం దాదాపు 87,000 మంది సైనికులు, లక్షకు పైగా సామాన్య జనం ప్రాణత్యాగం చేశారు.

## రెండో ప్రపంచ యుద్ధం..ప్రజలపై ప్రభావం

01 సెప్టెంబర్ 1939న హిట్లర్ నాజీ జర్మనీ సేనలు పోలాండ్‌పై దండయాత్ర చేయడంతో రెండో ప్రపంచ యుద్ధానికి బీజాలు పడ్డాయి. ఈ దాడిని ఖండించిన యుకె, ఫ్రాన్స్ దేశాలు 03 సెప్టెంబర్‌న జర్మనీపై యుద్ధం ప్రకటించడంతో భీకర ప్రపంచ యుద్ధం విధ్వంసక జడలు విప్పడం, ప్రపంచ దేశాలు రెండు గ్రూపులుగా విడిపోవడంతో యుద్ధ తీవ్రత మానవాళి మనుగడను ప్రశ్నార్థకం చేసింది. హిట్లర్ ఆత్మహత్య చేసుకోవడంతో జర్మనీ దురాక్రమణ చేసిన భూమిని వదిలేయడం, 08 మే 1945న బేషరతుగా జర్మనీ ఓటమిని అంగీకరించడం జరిగింది. ఓటమిని అంగీకరిం చని జపాన్‌లోని హిరోషిమా 06 ఆగష్టు 1945), నాగసాకి (09 ఆగష్టు 1945) నగరాలపై రెండు అణు బాంబులు వేయడంతో జపాన్ ఓటమిని అంగీకరించడం(15 ఆగష్టు)తో రెండో ప్రపంచ యుద్ధం 02 సెప్టెంబర్ 1945న ముగిసినట్లు ప్రకటన వెలువడింది. ప్రపంచ యుద్ధం-2 నేర్పిన గుణపాఠాన్ని గమనించిన ఐరాస సత్వరమే చొరవ తీసుకుంది. ఇలాంటి యుద్ధాలు మానవాళికి శాపాలుగా మారుతాయని అంగీకరించి, ప్రపంచ యుద్ధాలను నిరోధించడంలో భాగంగా నాటి అగ్రరాజ్యాలైన యుఎస్, రష్యా, యుకె, ఫ్రాన్స్, చైనా సభ్యుల శాశ్వత సభ్యత్వంతో కూడిన 'ఐరాస భద్రతా మండలి' ఏర్పడింది. అనంతర అర్థ శతాబ్దకాలం పాటు అమెరికా, సోవియట్ యూనియన్‌ల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరిగిన విషయం కూడా విదితమే.




## మూడో ప్రపంచ యుద్ధం రానుందా?

ఓ వైపు 24 ఫిబ్రవరి 2022 నుంచి ఉక్రెయిన్ – రష్యా యుద్ధం, మరో వైపు 07 అక్టోబర్ 2023 నుంచి ఇజ్రాయిల్‌తో పాలస్తీనా యుద్ధంతో పాటు లెబనాన్/ఇరాన్‌లు కూడా ఇజ్రాయిల్‌పై దాడులకు ఉపక్రమించడం తీవ్ర రూపం దాల్చుతూ నెలలు, సంవత్సరాలు దాటుతూ మరో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తున్నట్లు కనిపిస్తున్నది. గతంలో జరిగిన ఇలాంటి రక్తపాత యుద్ధాలతో పాటు నేటి యుద్ధాలు కూడా ప్రపంచ మానవాళికి అద్వితీయ గుణపాఠాలను నేర్పుతున్నాయి. యుద్ధాలు ఎవరు గెలిచినా మారణహోమం, మానవ వనరుల విధ్వంసం తప్పనిసరి అవుతున్నది. రెండు ప్రపంచ యుద్ధాలు పరిచయం చేసిన లక్షలాది మరణాల నుంచి మనందరిలో ఆత్మ విమర్శలకు దారులు తెరవాలి. శతాబ్దం దాటిన ప్రపంచ యుద్ధం-1, 75 ఏండ్ల దాటిన 2వ ప్రపంచ యుద్ధ క్షేత్రాల్లో కోట్ల ప్రాణాలు గాల్లో కలవడం, అపార ఆస్తినష్టం సంభవించడం మనకు హెచ్చరిక కావాలి. 3వ ప్రపంచ యుద్ధమే జరిగితే అత్యాధునిక ఆయుధాలు, అణుబాంబు విధ్వంసాలతో భూమి క్షణాల్లో బూడిద కావడం ఖాయమని తెలుసు కోవాలి. ఓడిన వారు సర్వస్వాన్ని, గెలిచిన వారు భవిష్యత్తు తరాలను కోల్పోతారు. అమెరికా-ఉత్తర కొరియా, ఇం డియా-పాక్, చైనా-తైవాన్‌ల మధ్య అనాదిగా ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం నెలకొంది. అయితే వీటన్నింటికి ఆజ్యం పోసేది మాత్రం అమెరికా అన్న సంగతి మన గమనంలో ఉండాలి. ఒకవేళ మూడో ప్రపంచ యుద్ధమే జరిగితే శక్తివంతమైన క్షిపణులు (మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్), అణ్వాయుధాల అమ్ముల పొదలు భూగోళం దద్దరిల్లేలా గర్జనలు చేసి మానవాళికి ఎంతో నష్టం చేసే ప్రమాదం పొంచి ఉన్నది. ఇప్పటికే 67 దేశాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం ఉన్నట్టు అంతర్జాతీయ మీడియా ద్వారా తెలుస్తోంది.దీన్ని అరికట్టే దిశగా ప్రపంచ దేశాలు పూనుకోవాలి. పరస్పరం చర్చల ద్వారా అంగీకరానికి రావాలి. ప్రజల్ని కాపాడుకోవాలి.

## రష్యా, ఉక్రెయిన్ యుద్ధం

నేడు ఏ రెండు అతి చిన్న దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైనా, మరో ప్రపంచ యుద్ధానికి కారణం కావచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం 24 ఫిబ్రవరి 2022న ప్రారంభమై నేటికీ కొనసాగుతున్నది. గత 19 నెలలుగా అపార నష్టాలకు కారణమవుతున్నది. ఈ యుద్ధంలో ఇరుపక్షాలకు చెందిన ఐదు లక్షల మంది మరణించడం లేదా గాయపడినట్టు ప్రపంచ మీడియా ద్వారా తెలుస్తున్నది. ఇప్పటికేఉక్రెయిన్‌కు వెన్నుదన్నుగా ఉంటున్న అమెరికా రష్యాను దెబ్బతీసేందుకు నాటోను ప్రవేశపెట్టడం వ్యూహాత్మకంలో ఓ భాగమే. అయితే అమెరికా సహకారంతో యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్‌కు ఇది అపారష్టం కలగజేస్తున్నది. ఉక్రెయిన్, రష్యాల మధ్య శాంతి చర్చలకు చైనా సహకరిస్తున్నది. కానీ ఇది కూడా సహించని అమెరికా ఇరు దేశాలపైనా తన వాణిజ్య ఆంక్షలతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్నది. ప్రపంచంలో నెంబర్‌వన్ స్థానానికి దూసుకెళ్తున్న చైనాను ఎలాగైనా అణగదొక్కాలనే ప్రయత్నం అమెరికా చేస్తోంది. ఇప్పటికే తమ దేశంలో తయారు చేసే ఆయుధ, యుద్ధ సామాగ్రిని ఇతర దేశాలకు అందించడం, సంఘీభావాన్ని వ్యక్తం చేయడం, తమకు లంగని దేశాలపై యుద్ధం ప్రకటించడం అమెరికా కుతంత్రాలను బట్టబయలు చేస్తోంది.

## పాలస్తీనా-ఇజ్రాయిల్ యుద్ధం

పాలస్తీనా దేశంలోకి వలసెళ్లిన యూదులు అక్కడి అరబ్బులను తరిమికొట్టి దేశాన్ని ఆక్రమించిన తీరు జగమెరిగిన సత్యం. ఇజ్రాయిల్‌ను కూడా వెనుకనుండి నడిపిస్తున్నది అమెరికానే. అయితే ఈ యుద్ధంలో గాజాపై జరిగిన బాంబులు, రాకెట్ల వర్షం ఎంతోమంది పసిపిల్లలతో సహా దాదాపు నలభై వేల మందికిపైగా ఇప్పటివరకు హతమార్చింది. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ రక్తహింస ప్రపంచ చరిత్రలోనే ఒక దారుణ మారణహోమం. దీనికి యథేచ్ఛగా సహకరిస్తున్న అమెరికా కూడా ప్రపంచ న్యాయస్థానంలో ముద్దాయే. పాలస్తీనా పౌరులను రక్షించడం కోసం ఏర్పడిన హమాస్ సంస్థను నిర్మూలించే పేరుతో కొనసాగుతున్న ఈ యుద్ధ బీభత్స లక్ష్యం పాలస్తీనాను పూర్తిగా ఆక్రమించడం.దాన్ని తిప్పికొడుతున్న పాలస్తీనా ప్రజల ధైర్య సాహసాలు అభినందించదగినవే. అయితే అన్ని దేశాల్లో యుద్ధాలకు కారణమవుతున్న అమెరికా సామ్రాజ్యవాదాన్ని ముందు బద్దలు కొట్టాలి. అది శాంతియుత ఉద్యమాల ద్వారా మాత్రమే సాధ్యమన్న విషయాన్ని ప్రజలు గుర్తెరగాలి.

యుద్ధం ప్రమాదకరమని, యుద్ధాలతో సమాధానాలు దొరకవని, శాంతియుత వాతావరణంలో చర్చల ద్వారానే శాశ్వత పరిష్కారాలు లభిస్తాయని నమ్మితేనే అది సత్ఫలితాల నిస్తుంది. ఒకవేళ యుద్ధానికే కాలుదువ్వితే ఇరుపక్షాల వైపు ప్రపంచ దేశాలు చేరి మరో ప్రపంచ యుద్ధ వాతావరణం నెలకొనడం, మానవాళి/సకల ప్రాణి కోటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరికలు వినిపిస్తున్నాయి. బాధ్యత గల ప్రపంచ దేశాలు శాంతి పావురాలను ఎగురవేస్తూ, సర్వమానవాళి సంక్షేమ దిశగా అడుగులు వేయాలి. అమెరికా ఏకఛత్రాధిపత్యాన్ని, దేశాలపై పెత్తనాన్ని ఐక్యరాజ్య సమతి కట్టడి చేయాలి.లేదంటే సామ్రాజ్యవాద అరాచకం మరింత మితిమీరి ప్రపంచ దేశాలపై ప్రభావం చూపే అవకాశమున్నది.

(01 సెప్టెంబర్ "ప్రపంచ యుద్ధం-2 ప్రారంభ దినం", 02 సెప్టెంబర్ 'ప్రపంచ యుద్ధం-2 ముగిసిన దినం')

5

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

కరీంనగర్

శనివారం | ఆగస్టు 31, 2024 | www.navatelangana.com

## 'రేపు పెన్షన్ విద్రోహ దినం నిరసన ప్రదర్శన'

నవతెలంగాణ - కరీంనగర్

పెన్షన్ విద్రోహ దినం సెప్టెంబర్ 1న నిరసన ప్రదర్శన విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి అన్నారు. డీటీఎఫ్ సభ్యత్వ ప్రచారంలో భాగంగా శుక్రవారం కరీంనగర్ అర్బన్‌లోని వివిధ పాఠశాలలు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ..ఓ వైపు పాత పెన్షన్ విధానం రద్దు చేయాలని సుదీర్ఘ కాలంగా ఉద్యోగ ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మళ్లీ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ తోనే మరో రూపంలో యుపీఎస్ (యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్) విధానాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తూ రాష్ట్రాలపై కూడా అదే విధానాన్ని రుద్దాలని చూస్తున్నదని, ఈ విధానాన్ని ఏ మాత్రం సమ్మతించేది లేదని అన్నారు. ఆయనవెంట జిల్లా కార్యదర్శి ఎ.దామోదర్, మండల అధ్యక్షుడు ఎస్.లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



# మెట్ట ప్రాంతంలో భారీగా తగ్గిన పత్తి సాగు

- వరిపైనే గురి.. పెరిగిన సాగు విస్తీర్ణం
- కల్పతరువుగా వరద కాల్వలు, ఎత్తిపోతలు



నవతెలంగాణ - గంగాధర

అధికంగా నీటి అవసరం లేని పత్తి సాగుపై రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. గతంలో వర్షాధార పంటలుగా పత్తిని సాగుచేసే మెట్ట ప్రాంత రైతులు ప్రస్తుతం వరిపైనే గురిపెట్టారు. దీంతో వరిసాగు విస్తీర్ణం పెరగగా, గంగాధర మెట్ట ప్రాంతంలో పత్తిసాగు భారీగా తగ్గింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భానికి ముందు గంగాధర మండలంలోని ఏ గ్రామంలో ఎటువైపు చూసిన పత్తి సాగు, చేన్లే కనిపించేవి. పత్తి భారీగా సాగుచేసే ఈ ప్రాంత రైతాంగం మెల్లిమెల్లిగా వరిసాగు వైపు దృష్టి మళ్లించారు. సమైక్యాంధ్ర పాలనలో నీటి సౌలభ్యం కరువై పంటల సాగు లేక కరువు పరిస్థితులతో రైతులు తల్లడిల్లారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వర్షాధారంపైనే ఆధారపడి పెద్దగా నీటి వినియోగం లేని పత్తిని సాగుచేసేవారు. కాని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో అందుకు భిన్నమైన పరిస్థితులు ఏర్పడడం, ఎల్లంపల్లి, కాళేశ్వరం జలాలు వరద కాలువలో ప్రవహిస్తూ జీవనదిగా మారగా, ఎత్తిపోతల జలాలు ఈ ప్రాంత రైతాంగానికి చేరువయ్యాయి. దీనికితోడు ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం కింద గంగాధర మండలం నారాయణపూర్, గంగాధర మినీ ప్రాజెక్టుల్లో నీరు నింపుతూ తద్వారా గ్రామాల్లో చెరువులు, కుంటల్లోకి నీటి మళ్లింపు జరుగుతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లోని చెరువుల్లో నీరు నిండుగా మారగా, సాగునీటి కాలువలు, వరద కాల్వలతో వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు పెరిగాయి. పంటల సాగుకు అనువుగా సాగునీరు పుష్కలంగా మారడంతో రైతులు పత్తి సాగుకు బదులు సాగు భూములను వరి మళ్లుగా మార్చుకుని వరిపైనే గురిపెట్టి అధిక దిగుబడి తీస్తున్నారు. దీంతో మెట్ట ప్రాంతంలో పత్తిసాగు భారీగా తగ్గుముఖం పట్టగా, క్రమక్రమంగా పెరిగిన వరి సాగుతో బీడు భూములు కూడా సాగులోకి వచ్చాయి. దీంతో మెట్ట ప్రాంతమైన గంగాధర మండలంలోని కొండన్నపల్లి, హిమ్మత్‌నగర్, గర్శకుర్తి, వెంకంపల్లి, పోతుగంటిపల్లి, తాడిజెర్రి, రంగారావుపల్లి, గట్టుబూత్కూర్, ఆచంపల్లి, కాసారం, మల్లాపూర్‌తోపాటు పలు గ్రామాల్లోనే పత్తి చేన్లు కనిపిస్తున్నాయి.

మండలంలో 39వేలా 269ఎకరాల భూములు సాగుకు యోగ్యమైనవి ఉండగా, అధిక శాతం భూముల్లో వరి పంటనే సాగు అవుతోంది. ఈ వర్షాకాలంలో గంగాధర మండలంలో 18450 ఎకరాల్లో వరి సాగు చేయగా, కేవలం 3327 ఎకరాల్లో పత్తిసాగు చేస్తున్నారు. 39ఎకరాల్లో మొక్కజొన్న, మక్క సాగుచేయగా, 292 ఎకరాల్లో వేరుశనగ, కొద్ది కొద్దిగా ఆరుతడి పంటలుగా కూరగాయలు సాగు చేసినట్టు వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు.

### పత్తిసాగుకు స్వస్తి చెప్పడానికి కారణాలు అనేకం

గతంలో గంగాధర మెట్ట ప్రాంతంలో విరివిగా సాగుచేసిన పత్తికి స్వస్తి చెప్పడానికి అనేక కారణాలే కనిపిస్తున్నాయి. పత్తి సాగు చేసిన రైతులు గిట్టుబాటు, మద్దతు ధర లేక ఆందోళనలు చేస్తూ రోడ్డెక్కిన సందర్భాలు అనేకంగా ఉన్నాయి. వచ్చే పత్తి దిగుబడిని గ్రామాల్లో దళారీలు తప్ప కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకుండా పోయాయి. దీంతో దళారీలు తక్కువ ధర కొనుగోలు చేస్తూ దోపిడీకి పాల్పడగా, పత్తి దిగుబడి అమ్మేందుకు రైతులు అనేక కష్టాలు పడ్డాల్సిన పరిస్థితులే ఉన్నవి. ఆశించిన మద్దతు ధర లేకపోగా, పత్తిని అమ్మడానికి గంగాధర వ్యవసాయ మార్కెట్ తప్ప మరో కొనుగోలు సెంటరే మండలంలో లేదు. దీంతో ఈ ప్రాంత రైతులు రామడుగు మండలం వెలిచాలతోపాటు పలు ప్రాంతాల్లో జిన్నింగ్ మిల్లుల్లోనే పత్తిని తీసుకెళ్లి వ్యాపారులు నిర్ణయించిన ధరలకే అమ్మే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో పత్తి అమ్మకం రైతులకు భారంగా మారగా, రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. నీటి తడి స్వల్పంగానే ఉండగా పత్తి సాగుపై పెద్దగా పెట్టుబడి లేకపోయినా పంట దిగుబడి వచ్చే చోట కొనుగోళ్లు లేక రైతులు పత్తి సాగును మెల్లిమెల్లిగా తగ్గిస్తూ వచ్చారు. దీంతో గతంలో 20వేల ఎకరాలకు పైనే పత్తి సాగు చేసే మెట్ట ప్రాంతంలో కేవలం 3327 ఎకరాలకు పడిపోయింది.

### ఉన్నచోటే కొనుగోళ్లు.. తగ్గిన వ్యయప్రాయసాలు

ధాన్యం పండించిన ప్రాంతాల్లోనే కొనుగోలు సెంటర్లు ఉండడం, వ్యయప్రాయసాలు తగ్గుతుండడంతో వరిపంట సాగుపైనే రైతులు దృష్టి సారిస్తున్నట్టు తెలుస్తుంది. నీటి సౌలభ్యం పెరగడంతో పాటు ఐకెపి, సింగిల్‌విండో కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యానికి మద్దతు ధర కల్పించడం కూడా వరి పంటల సాగు వైపు రైతులు దృష్టి మళ్లించడానికి మరో కారణమని స్పష్టమవుతుంది. అన్నీ అనుకూలంగా మారడం వల్లే చాలా మంది రైతులు క్రమ క్రమంగా పత్తి సాగును తగ్గిస్తూ వరి సాగు వైపు నజర్ పెట్టినట్టుగా కనిపిస్తుంది. ఈ కారణంగా కొద్ది కాలంలో గంగాధర మెట్ట ప్రాంతంలో పత్తి సాగు కనుమరుగయ్యే పరిస్థితులే కనిపిస్తున్నాయి. ప్రభుత్వం పత్తి సాగుకు అనువుగా కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేయడం, మద్దతు ధర కల్పించడం వంటి చర్యలు చేపడితే తప్ప రైతులు పత్తిసాగు వైపు మొగ్గు చూపే పరిస్థితులు కనిపించడం లేదు.

### అందుబాటులో కొనుగోళ్లు లేకే ఇబ్బంది



పత్తి దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నాం. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల తరహాలో గ్రామాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పండించిన పత్తికి మద్దతు ధర కల్పిస్తూ రైతులు ఇబ్బంది పడకుండా చూడాలి. నేను ఐదేకరాల్లో పత్తిని సాగు చేయగా పెట్టుబడి లక్ష రూపాయలు అయ్యింది. నీటితడి, పెట్టుబడి, శ్రమ తక్కువే. పండిన పత్తి అమ్మడం ఇబ్బందిగా మారే పత్తిసాగును చేయడానికి రైతులు ఇష్టపడడం లేదు.

**- పులి మల్లేశం, పత్తి రైతు, గ్రామం తాడిజెర్రి**

## రోడ్డుపై వృక్షాలు తొలగింపు

నవతెలంగాణ - గంగాధర



వృక్షాన్ని తొలగిస్తున్న గ్రామస్తులు

కరీంనగర్, జగిత్యాల ప్రధాన రహదారి వెంట భారీ వృక్షాలు బస్సులు వాహనాలకు ఆటంకంగా మారాయి. తరచు వృక్షాల వల్ల ప్రమాదాలు చోటు చేసుకోవడంతో ఆర్టీసీ, ప్రైవేట్ వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని గంగాధర మండలం ఇస్లాంపూర్ గ్రామంలో జగిత్యాల, కరీంనగర్ హైవేపై ప్రమాదాలకు నిలయంగా మారిన మర్రి చెట్టును గ్రామస్తుల సహకారంతో ఆ గ్రామ మాజీ సర్పంచ్ వడ్లూరి అనిత-ఆదిమల్లు ఆధ్వర్యంలో తొలగించారు. కరీంనగర్ జగిత్యాల వెళ్లే బస్సులు, లోడ్‌తో వెళ్లే లారీలకు రోడ్డుపైన గల వృక్షాల కొమ్మలు తగులుతూ ఇబ్బందులకు గురయ్యారు. తమ గ్రామం వద్ద ఏపుగా పెరిగిన వృక్షాలను తొలగించే పనిని చేపట్టడం పట్ల ఆర్టీసీ, ప్రైవేటు వాహనదారులు, ప్రయాణికుల సంతోషం వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్ నేత అనిల్ వివాహానికి ఎమ్మెల్యే హాజరు

నవతెలంగాణ - హుజూరాబాద్



బీఆర్ఎస్ నాయకుడు పోతరవేని అనిల్ కుమార్ - తిరుమేశ వివాహం శుక్రవారం హుజురాబాద్ సాయిరూప ఫంక్షన్ హాల్లో జరిగింది. హుజురాబాద్ శాసనసభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డి హాజరై వధూవరులకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## మట్టి వినాయకులు ప్రతిష్ఠించాలి

నవతెలంగాణ - హుజూరాబాద్

రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలలో మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. భక్తిశ్రద్ధలతో జరుపుకునే వినాయక చవితి వేడుకలను పర్యావరణానికి హానికరమైన ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కాకుండా మట్టితో చేసిన గణపతులను పూజించాలని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసిన విగ్రహాల వలన నీటిలో ఉండే చాలా రకాల ప్రాణులకు హాని కలుగుతుందన్నారు. కాబట్టి మట్టితో చేసిన వినాయకులను పూజించి నీటిలో నిమజ్జనం చేయాలని కోరారు.

## కొనసాగిన మండల క్రీడోత్సవాలు



నవతెలంగాణ - హుజూరాబాద్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడోత్సవాలు శుక్రవారం రెండో రోజు కొనసాగాయి. కబడ్డీ అండర్ 14, 17 బాలబాలికలకు నిర్వహించారు. పోటీల ప్రారంభానికి క్రీడాకారులు కొలిపాక శ్రీనివాస్, తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ హాజరైనట్లు మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సొల్లు సారయ్య తెలిపారు. పీఈటీలు భాగ్యలక్ష్మి, శ్రీనివాస్, అనిల్, రేణుక, సత్యం, ఎడ్వర్డ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మానకొండూర్‌లో పౌర హక్కుల దినోత్సవం




నవతెలంగాణ - మానకొండూర్

మానకొండూర్ మండలకేంద్రంలో శుక్రవారం రెవెన్యూ అధికారులు పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆర్ఐ జయలక్ష్మి మాట్లాడుతూ పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజ్యాంగంలో కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ కపాడుకోవాలన్నారు. పౌర హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ఇస్కుల్ల ఆంజనేయులు, హన్మాండ్ల కుమార్, ఆరెపల్లి సుమన్, రామగిరి రాజు, అనిల్, ఎల్లయ్య, పంచాయతీ సెక్రటరీ రేవంత్ కుమార్ పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో ఆరోగ్యం

నవతెలంగాణ - గంగాధర



బాలింతలు, చిన్నారుల తల్లులు, గర్భిణులు పౌష్టికాహారంపై దృష్టి సారిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని గంగాధర సిడిపిఓ కస్తూరి సూచించారు. గంగాధర మండలం కురిక్యాల గ్రామంలో పోషకాహార విలువలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆకుకూరలు, కూరగాయలు, పప్పు దినుసులు, చిరు ధాన్యాలు ప్రతి రోజు తినడం వల్ల పౌష్టికాహారం అందుతుందన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండటమే కాక చిన్నారులకు తగిన పాలు అందించగలరని తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, రక్తహీనత నివారణ తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ రేణుక, హెల్త్ సూపర్వైజర్ ప్రశాంతి, అంగన్వాడీ టీచర్ వెంకటలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ - చొప్పదండి



చొప్పదండి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర క్రీడా మైదానంలో శుక్రవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభం అయినట్లుగా సెక్రెటరీ కృష్ణ తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అండర్ 14 అండర్, 17 బాలురకు పోటీలకు ముగిసాయి. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, చంద్రశేఖర్, రాజ్‌కుమార్, ఆస్మా, స్వప్న, విక్రమ్, వంశీ, సతీష్, మహేష్, రాజు, ఉపాధ్యాయులు జలపతి, వీరేందర్, జలీల్ పాల్గొన్నారు.

## రోడ్డు పనులకు శంకుస్థాపన

### హాజరైన కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి

**నవతెలంగాణ - గన్నేరువరం:** మండల కేంద్రం నుండి మైలారం గ్రామానికి, మైలారం నుండి బేగంపేట వరకు రూ.32కోట్ల వ్యయంతో నిర్మించనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం మండల కేంద్రంలో ప్రారంభించారు. తొలిసారిగా కేంద్ర సహాయ మంత్రి మండల కేంద్రానికి రావడంతో బీజేపీ నాయకులు బండి సంజయ్‌కు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. క్రేన్ సహాయంతో గజమాలవేసి సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ గన్నేరువరం మండల అభివృద్ధిలో భాగంగా రూ.32కోట్ల నిధులు కేటాయించి డబుల్ రోడ్డు నిర్మాణానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రామీణ రోడ్లకు కేంద్ర నిధులతో మహర్దశ రానున్నదని అన్నారు. ఈ సందర్భంగా బ్రిడ్జి జేఏసీ నాయకులు సంపతి ఉదయ్ కుమార్ మానేరు వంతెనపై బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్, నాయకులు తిప్పర్తి నికేష్, మచ్చ మురళి, మచ్చ బాలరాజు, మునిగంటి సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముసుకు ఉపేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, నాయకుడు చింతల శ్రీధర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జితేందర్‌రెడ్డికి మాజీ ఎంపీ పరామర్శ

నవతెలంగాణ - తిమ్మాపూర్



మండలంలోని కొత్తపల్లి గ్రామ మాజీ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు ఇనుకొండ జితేందర్‌రెడ్డి తండ్రి ఇనుకొండ వెంకట్రాంరెడ్డి ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని శనివారం కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి.రామకృష్ణరావు, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, పాశం అశోక్‌రెడ్డి ఉన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీ

నవతెలంగాణ - రామడుగు :



బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంట జితెందర్‌రెడ్డి కూతురు వివాహం ఇటీవల జరుగింది. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆయన నివాసానికి వెళ్లి వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనవెంట బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జివి.రామకృష్ణారావు, మాజీ పౌరసరఫరాలశాఖ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవిందర్‌సింగ్, రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వేంకటేశ్వర్‌రావు, డాక్టర్ చెన్నాడీ అమిత్‌రావు, బాలాగౌడ్, జక్కుల నాగరాజు, సాయికృష్ణ ఉన్నారు.

## పోషకాహారంపై అవగాహన

నవతెలంగాణ - చొప్పదండి :



మండలంలోని రేవెళ్లే గ్రామ అంగన్వాడి సెంటర్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్వాడీ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషకాహారంపై సూపర్వైజర్ రమాదేవి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడి, ఆశ సుమలత, పద్మదేవి, సుశీల పాల్గొన్నారు.

## విలేకరి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**నవతెలంగాణ - వీణవంక :** వీణవంక మండల కేంద్రంలో విలేకరి దాసారపు రాధాకృష్ణ తండ్రి రాజవీరు ఇటీవల మృతిచెందాడు. కుటుంబ సభ్యులను హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయనవెంట మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి, మాజీ ఉపసర్పంచ్ భానుచందర్, తాళ్లపల్లి మహేష్‌గౌడ్, ఓరెం మధు, వోరేమ్ క్రాంతి, యాసిన్ ఉన్నారు.

## ఆలయ 11వ వార్షికోత్సవం

**నవతెలంగాణ - వీణవంక :** వీణవంక మండలం ఎల్బాక గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ 11వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కేసీఆర్‌పై ద్వేషంతో రైతుల నోట్లో మట్టికొడుతున్న కాంగ్రెస్

### మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణ - మానకొండూర్ :



కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం పంపులను ఆన్‌చేస్తే మళ్లీ రైతులకు కేసీఆర్ పేరు గుర్తుకు వస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకుండా వదిలేస్తున్నారని మాజీ ఎంపీ వినోద్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం మండలకేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. జులై, ఆగస్టు మాసాల్లో రోజుకు 10 లక్షల క్యూసెక్కుల నీళ్ల వృథాగాపోయి సముద్రంలో కలిసాయన్నారు. 35వేల క్యూసెక్కుల నీళ్ల ప్రవాహం ఉన్నా మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూయకున్నా కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీళ్లను ఎత్తిపోయవచ్చని నీటిపారుదల అధికారులే చెబుతున్నారని అన్నారు. వర్షాలు లేక కరీంనగర్ మిడ్‌మానేరు డ్యాం ఇప్పటి నిండలేదని వాపోయారు. ప్రభుత్వం కనీసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీళ్లను మధ్యమానేరులోకి ఎత్తిపోసి అక్కడి నుంచి ఎల్‌ఎండీలోకి విడుదల చేస్తే కాకతీయ కెనాల్ ద్వారా తిమ్మాపూర్, మానకొండూర్, శంకరపట్నం, ఎల్కతుర్తి, కమలాపూర్, హుజురాబాద్, వరంగల్, హన్మకొండ, తొర్రూర్ వరకు నీళ్ల ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. నీటి ఎత్తిపోతలపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించాలని డిమాండ్ చేశారు. యాసంగి పంటకు అసలు నీళ్ల వస్తాయో లేదో అని రైతులు అయోమయంలో ఉన్నారని, వెంటనే నీరు విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి.రామకృష్ణారావు, మాజీ మేయర్ రవిందర్‌సింగ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, జక్కుల నాగరాజు యాదవ్, అశోక్‌రెడ్డి, దేవ సతీష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఐటీ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

### జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు

నవతెలంగాణ - తిమ్మాపూర్



సాప్ ల్యాబ్ ప్రారంభిస్తున్న కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు

ఇంజనీరింగ్ విద్యార్థులు ఐటీ పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, పూర్తిచేయడంతో పాటు సులభంగా ఉపాధిని పొందాలని జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అన్నారు. మండలంలోని జ్యోతిష్మతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అటానమస్ కళాశాలలో సాప్ ల్యాబ్స్ ఇండియా ఆధ్వర్యంలో కోడ్ ఉన్నతి ప్రోగ్రాం, ఎడ్యునెట్ ఫౌండేషన్ టాస్క్ మార్గదర్శకత్వంలో విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికలలో శిక్షణ ఇవ్వడానికి పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవడానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ విభాగాన్ని కళాశాల చైర్మన్‌తో పాటు కరస్పాండెంట్ సెక్రటరీ జువ్వాడి సుమిత్‌సాయి, ప్రదీప్‌రెడ్డి, టెక్నాలజీ డెలివరీ, ప్లేస్‌మెంట్, కార్పొరేట్ రిలేషన్స్, టాస్క్, ఐటి, ఇసి డిపార్ట్మెంట్ మహమ్మద్ అఫ్సర్ బాష, ఎడ్ నెట్ ఫౌండేషన్ మేనేజర్, టాస్క్ డిస్ట్రిక్ రిలేషన్షిప్ మేనేజర్ గంగా ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎడ్యునెట్, టాస్క్‌తో కలిసి సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా సాప్ ల్యాబ్‌లు ప్రయోగాత్మకంగా శిక్షణ అందించేందుకు 30 లక్షల రూపాయలతో జ్యోతిష్మతి కళాశాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేశాయన్నారు. విద్యార్థులకు ఉపాధి కల్పించడానికి కోడ్ ఉన్నతి ప్రోగ్రామ్ ద్వారా పరిశ్రమకు సంబంధించిన నైపుణ్యాల ప్రాముఖ్యతను, భవిష్యత్తులో ఉద్యోగాల కోసం విద్యార్థులను సిద్ధం చేయడం, నూతన మార్గాలను సృష్టించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడంతో పాటు సులభంగా ఉపాధిని పొందేందుకు ప్రయత్నం చేయాలన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు శిక్షణ ఇవ్వడం పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలు, ఉపాధిని ప్రోత్సహించడం కోసం అంకితం చేశామన్నారు. కార్యక్రమంలో టాస్క్ క్లస్టర్ మేనేజర్ శుధీర్, జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేస్ రావు, డీన్ అకాడమిక్ డాక్టర్ పీకే వైశాలి, వివిధ విభాగ అధిపతులు జగదీశన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను వినియోగించుకోవాలి

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

నవతెలంగాణ - చొప్పదండి



చొప్పదండిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

పట్టణ ప్రజలు ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను వినియోగించుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. పట్టణంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కె.నాగరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ అధ్యక్షతన ఒకటో వార్డులోని సంతోష్ నగర్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.3లక్షల వ్యయంతో, సైడ్ డ్రైన్ పనుల కు, 15వ ఆర్థిక సంఘం నిధులతో 10 లక్షల వ్యయంతో, మున్సిపల్ కార్యాలయం పక్కన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రూ.57లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను 247 మంది లబ్దిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.నవీన్ కుమార్, మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేష్, వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు అశోక్, మహేష్, భారతి, పెరుమండ్ల గంగయ్య, మునిగాల సుధాకర్, మార్కెట్ డైరెక్టర్ జక్కుల అనిల్ కుమార్, వల్లాల కృష్ణహరి, మహేష్ని మల్లేశం, ఆకుల సురేష్, కోలాపూరి శ్రీకాంత్, కనుమల్ల రాజశేఖర్, నూనె శేఖర్, చిలుముల స్వప్న, గుంటి స్వరూప పాల్గొన్నారు.

## కష్టపడే కార్యకర్తలకు సముచిత స్థానం

### మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

నవతెలంగాణ - మానకొండూర్



కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు స్థానిక శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మానకొండూర్ నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కమిటీ అధ్యక్షుడిగా మర్రి ఓదెలుయాదవ్, ఉపాధ్యక్షుడిగా రామిడి తిరుమల్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రైతు సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ చేశారన్నారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయినా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా మిడ్ మానేరు, అనంతగిరి రిజర్వాయర్, రంగనాయక సాగర్, ఎల్ఎండి ప్రాజెక్టులోకి నెల రోజుల్లో 20 టీఎంసీల నీరు సరఫరా చేసినటు స్పష్టం చేశారు. నూతనంగా కొలువుదీరిన మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, నాయకులు బత్తిని శ్రీనివాస్, తాళ్లపల్లి సంపత్‌గౌడ్, సత్యప్రసన్నరెడ్డి, మార్కెటింగ్ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జగిత్యాల
శనివారం | ఆగస్టు 31, 2024 | www.navatelangana.com

# సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

**నవతెలంగాణ-జగిత్యాల**



సమాన పనికి సమాన ఇవ్వాలని జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. అర్బన్ మండల విద్యా వనరుల కేంద్రం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులకు రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాల న్నారు. అంతేకాక ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలి డిమాండ్ చేశారు. మరణించిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.



## ఆకాశవాణిలో నందగిరి పెద్దమ్మతల్లి జానపద కళాబృందం ప్రదర్శన

**నవతెలంగాణ-పెగడపల్లి**

మండల పరిధిలోని నందగిరి గ్రామానికి చెందిన శ్రీ పెద్దమ్మతల్లి జానపద కళాబృందం ఈనెల 27న ఆకాశవాణి హైదరాబాద్‌లో రేడియో ద్వారా మల్లన్న, ఎల్లమ్మతల్లి జానపద పాటలు, పల్లె పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో ఐతరవేణి సుగుణవ్వ, ఐతరవేణి బక్కవ్వ, ఐలవేణి మల్లవ్వ, ఐలవేణి నర్సవ్వ మాల రాజవ్వ, దావనవేని సత్తెవ్వ ఉన్నారు.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం

**నవతెలంగాణ-కోరుట్ల**

కోరుట్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన శ్రీరాముల అమరేందర్‌ను మున్నూరు కాపు సంఘం నాయకుడు మార్గం నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాయికారి రవీందర్, యతిరాజం నర్సయ్య, ముత్యాల రమేష్, చెట్లపల్లి సాగర్, మార్గం ప్రతాప్, గ్యాండ్ల స్వామి, బెళ్ళం గంగాధర్, ముత్యాల ప్రవీణ్, పుప్పాల నాగరాజ్, నీలి చిన్నవెంకటి, గోనెల భూమేష్, భారత్ అక్షయ్ జీవన్, రవి, మహిపాల్, మహేష్, రాము, రమేష్ పాల్గొన్నారు.

## నేడు ఉచిత ఆయుష్ వైద్య శిబిరం

**నవతెలంగాణ-పెగడపల్లి**

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణంలో నేడు ఉదయం 10 గంటలకు ఉచిత ఆయుష్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు డాక్టర్ మారుతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 50 ఏండ్లు పైబడిన వారికి షుగర్, బీపీ, మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, మూత్ర సంబంధిత తదితర వ్యాధులకు ఉచితంగా పరీక్ష చేసి మందులు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యుత్ షాక్‌తో గొర్రె మృతి

**నవతెలంగాణ-రాయికల్**



గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి విద్యుత్ తీగలు తెగి పడడంతో మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన ద్యాగ నాగరాజుకు చెందిన రూ.12 వేల విలువ గల గొర్రె విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్టు బాధిత పాడి రైతు తెలిపారు. స్థానికులు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పిందని, బాధిత రైతుకు నష్ట పరిహారం అందించాలని అధికారులను కోరారు.

## అర్హులైన రైతులందరికీ రెండు లక్షల లోపు రుణమాఫీ అవుతుంది

**జిల్లా వ్యవసాయ అధికారిని బి.వాణి**



**నవతెలంగాణ-రాయికల్**

పట్టణంలోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో శుక్రవారం రుణమాఫీ కానీ రైతుల వివరాల సేకరణ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారిని బి. వాణి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ కార్డు లేని, అర్హత గల రైతు కుటుంబాల వివరాలు సేకరించి, రైతు రుణమాఫీ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయడం జరుగుతుందని, అర్హులైన రైతులందరికీ రెండు లక్షల లోపు రుణమాఫీ అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముక్తేశ్వర్, ఏఈవోలు నరేష్, పద్మావతి, సృజన, రైతులు పాల్గొన్నారు.

## నేరెళ్ల వారి కళ్యాణ కానుక అందజేత



చెక్కును అందజేస్తున్న మాజీ ఎంపీపీ

**నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం**

మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చేప్యాల బాజన్న ప్రమీల దంపతుల కుమార్తె ఉషారాణి క్రాంతి కిరణ్‌ల వివాహానికి 67వ నేరెళ్ల వారి కళ్యాణ కానుక 5016 రూపాయల చెక్కును మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్ నవ దంపతులకు చెక్కును అందజేశారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

**నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం**



సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో

మండలంలోని గోధుర్, డబ్బా గ్రామాల్లో కొనసాగుతున్న బిఎల్‌వోలు చేస్తున్న సర్వేను కోరుట్ల ఆర్డిఓ ఆనంద్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈనెల 5వ తేదీలోపు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలు నమోదు, సవరణలు చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. వారి వెంట తహసీల్దార్ ప్రసాద్, గిర్ధవర్ రమేష్, బిఎల్‌వోలు విజయలక్ష్మి, గంగమణి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**నవతెలంగాణ - మల్లాపూర్:**



మాట్లాడుతున్న శ్రీనివాస్

గ్రామాలలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ కోరుట్ల నియోజకవర్గ నాయకులు వడ్డేపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక వెంకటేశ్వర కళ్యాణ మండపంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం నర్సరెడ్డి, మల్లాపూర్ మండల ఓబీసీ అధ్యక్షుడు గజ్జి శీను, కార్యవర్గ సభ్యులు కోరుట్ల రాములు, గుగ్లావత్ రాజేందర్, మల్లాపూర్ గ్రామశాఖ అధ్యక్షులు ముష్కిరి రాజ్‌కుమార్, మల్లాపూర్ మండల బిజెపి, బీజేవైఎం జిల్లా పాద అధికారులు పాల్గొన్నారు.

# వైద్యులందరు సమయపాలన పాటించాలి

**జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్**

**నవతెలంగాణ-జగిత్యాల**



వైద్యులందరూ సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నందున శుక్రవారం ధర్మపురి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్యుల హాజరు పట్టికను పరిశీలించి గైర్హాజరైన వైద్యుల వివరాలు సేకరించి వారిపై తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్ పేషంట్, ఔట్ పేషెంట్ విభాగాలను పరిశీలించి అడ్మిట్ అయి ఉన్నటువంటి పేషెంట్లను వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ల పనితీరు బాగుందా అని వైద్య సేవలు సరిగ్గా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తర్వాత డ్రగ్ స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి రిజిస్టర్ ప్రకారం మందులు స్టాక్ నిల్వలు ఉన్నాయా లేవా అని సరి చూశారు. జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యులందరూ, సిబ్బంది సమయపాలన పాటించాలని గైర్హాజ రైనటువంటి వైద్యులపై తగిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసుధన్ మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సమియు ద్దిన్, జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ఆర్ ఎంఓ డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక స్థానం ఉంటుంది

- కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు
- కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

**నవతెలంగాణ-మల్లాపూర్**



మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

కాంగ్రెస్‌లో చేరిన ప్రతి ఒక్క కార్యకర్తకు పార్టీలో ప్రత్యేక స్థానం ఉంటుందని కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కనక సోమేశ్వర కొండ కింద కాంగ్రెస్‌లో మల్లాపూర్ సింగిల్ విండో డైరెక్టర్ నల్ల రాజారెడ్డి, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు అయ్యోరి దశరథం, పద్మశాలి సంఘం మండల గౌరవ అధ్యక్షుడు సిరిపురం రవీందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు క్యాతం సురేష్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కాండవగప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పనిచేసే ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అన్నారు. పార్టీ జెండా మోసిన కార్యకర్తను పార్టీ ఎప్పుడు గుర్తుంచుకుంటుందని అన్నారు. రాబోయే ఎన్నికలలో ప్రతి కార్యకర్తను ప్రజాప్రతినిగా గెలిపించేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని అన్నారు.అనంతరం కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా చిట్టాపూర్ గ్రామానికి చెందిన చిన్నారెడ్డికి, ఉపాధ్యక్షుడిగా కోగురి రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా కొమిరెడ్డి అంజిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా లింగంపల్లి అంజయ్య నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కనక సోమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వీడీసీ చైర్మన్ సంఘ గంగా రాజం యాదవ్ వినతి పత్రాన్ని అందజేశారు. సౌడాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయాలని ఆ సంఘ సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం నర్సింగరావు, జై ఎన్. వెంకట్‌లను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పుండ్ర శ్రీనివాస్‌రెడ్డి, అంతడుపుల నర్సయ్య, నల్ల బాపురెడ్డి, గురిజల రాజారెడ్డి, నల్ల రాజన్న, సుంకేట మల్లయ్య, ముత్యాల చంద్రశేఖర్, క్యాతం వెంకట్‌రెడ్డి, నూతిపెల్లి రాజం, డాక్టర్ రాకేష్, సరికేల మహిపాల్ పాల్గొన్నారు.

# మహిళా శక్తి యూనిట్ సందర్శించిన ఐకేపీ ఏపీడీ

**నవతెలంగాణ-జగిత్యాలటౌన్**




పరిశీలిస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్ మండలం హైదర్‌పల్లి గ్రామానికి చెందిన స్వశక్తి సభ్యురాలు జిల్లా కేంద్రంలో టి స్టాల్, మిల్క్ కేంద్రాన్ని నిర్వహిస్తుంది. జిల్లా ఐకేపీ ఏపీడీ చరణ్ దాస్ శుక్రవారం సందర్శించారు. మహిళా సంఘాల సభ్యులకు జీవనో పాధి కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళా శక్తి కార్యక్రమాల ద్వారా వివిధ రకాల యూనిట్లను నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి పర్యవేక్షణతో వివిధ బ్యాంకుల ద్వారా బ్యాంక్ లింకేజీ, వ్యక్తిగత రుణాలు, పీఎంఎఫ్‌ఎంఈ స్త్రీనిధి తదితర రుణాల ద్వారా సభ్యులకు రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. అంతకు ముందు లక్ష్మీపూర్, మోతె, దరూర్, హస్నాబాద్ తదితర గ్రామాల్లో మహిళా శక్తి ద్వారా పాడి గేదెల పెంపకం, నాటు కోళ్ల పెంపకం, క్యాంటీన్‌ల ఏర్పాట్లపై సభ్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్రాంచి మేనేజర్ మహ్మద్ మొయిజ్ పాషా, జిల్లా డీపీఎం వెంకటేష్, ఎంపీఎం .గంగాధర్, సీసీలు శ్రీనివాస్, గంగారాం, మరియా, మండల సమాఖ్య అధ్యక్షురాలు సత్తవ్వ, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు నగరాణి, స్త్రీనిధి సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

**జగిత్యాల డీఎస్పీ డి.రఘుచందర్**

**నవతెలంగాణ-రాయికల్**



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పి

వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని జగిత్యాల డీఎస్పీ డి.రఘు చందర్ అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మండలంలోని వివిధ యువజన సంఘాల సభ్యులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని, నిమజ్జనంలో డీజేలు వినియోగించవద్దని, మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యువత ఏర్పాటు చేసిన తమ మండపం వివరాలను పోలీసు అధికారులకు సమర్పించాలని అన్నారు. పోలీసులతో యువత సహకరించి వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రూరల్ సీఐ వై. కృష్ణారెడ్డి, ఎస్సై టి. అశోక్ యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

## ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం

**నవతెలంగాణ-మల్లాపూర్**

గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణాకు నివారణ పటిష్ట చర్యలు ప్రభుత్వం చేపడుతున్నట్టు మల్లాపూర్ తహసీల్దార్ వీర్ సింగ్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. కమర్షియల్ ట్రాక్టర్స్ మాత్రమే అనుమతి పొందిన తర్వాత ఇసుకు రవాణా చేయాలన్నారు. ఇసుక రవాణా సమయంలో రెండు ఫ్లెక్సీలు ట్రాక్టర్‌కు పెట్టుకొని, ప్రభుత్వ అనుమతి పొందిన వే బిల్స్‌తో ఇసుక రవాణా చేయాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా జరిగితే మొదటి సారి ట్రాక్టర్‌కు రూ. 25,000/ జరిమానా, లారీ/ టిప్పర్ లకు రూ. 1,00,000 జరిమానా విధిస్తామని తెలిపారు. రెండవసారి ఏ వెహికిల్ ఐనా ఇసుక అక్రమ రవాణా చేస్తే వాటిపై పోలీసు కేసు నమోదు చేయించి, కోర్టుకు పంపుతామని తెలి పారు. ఈ సమావేశంలో ఎస్సై కిరణ్ ట్రాక్టర్ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని కలిసిన జిల్లా అధికారులు

**నవతెలంగాణ-జగిత్యాలటౌన్**

జగిత్యాల జిల్లా సివిల్ సప్లై అధికారిగా నూతనంగా నియామకం అయిన జితేంద్రప్రసాద్, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారిగా నియామకం అయిన జితేందర్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.



## మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా బోర్గం రాజు

**నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం**



ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కోమటి కొండాపూర్ గ్రామానికి చెందిన బోర్గంరాజు పట్టుబట్టి సాధించుకున్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉండి ఇబ్రహీంపట్నం మార్కెట్ చైర్మన్ పదవి కోసం ఎదురు చూసిన బోర్గం రాజుకు నిరాశే మిగిలింది. అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వకుండా నిరాశ పరచడంతో శాసనసభ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి రాజు వచ్చారు. కాగా ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న జువ్వాడి నర్సింగరావుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి నాకు ఇవ్వాలని నర్సింగరావును రాజు కోరారు. దీంతో ఆయన కోరిన మేరకు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో ఇచ్చిన మాట కట్టుబడి జువ్వాడి నర్సింగరావు రాజుకు చైర్మన్ పదవిని కట్టబెట్టాడు.

## జిల్లాలో భారీ వర్షం



**నవతెలంగాణ-జగిత్యాలటౌన్**

జగిత్యాలలో తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ప్రజలు బయటకు వెళ్లలేక ఇళ్లకే పరిమితమయ్యారు. భారీగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. జగిత్యాల-నిజామాబాద్ జాతీయ రహదారిపై చెరువును తలపించింది. పోచమ్మవాడ, టవర్ సర్కిల్, మహాలక్ష్మీనగర్, తులసినగర్ ప్రాంతాల్లో భారీ వరద ఉప్పొంగి జనజీవనం స్తంభించింది. పట్టణంలో గోవిందుపల్లె వాగు ఉప్పొంగి ప్రవ హిస్తోంది. వాగు అవతలి వైపు ఉన్న వెంకటాద్రినగర్‌కు సంబంధాలు తెగిపోయాయి. అత్య వసరం ఉన్న వారిని జేసీబీ సాయంతో వాగు దాటిస్తున్నారు. 500 కుటుంబాలు వాగు అవతలి వైపు నివసిస్తుండగా భారీ వర్షం పడినప్పుడల్లా ఇదే పరిస్థితి నెలకొందని, ఇప్పటికైనా వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

**మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్**

**నవతెలంగాణ-మల్లాపూర్**

గ్రామాల్లో ఓటర్ నమోదు ఇంటింటా సర్వేను బిఎల్‌ఓలు వేగవంతంగా చేయాలని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాఘవపేట నడికుడ మొగిలిపేట గ్రామాలలో ఓటర్ నమోదు ఇంటింటా సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జనవరి నెలలో 2007 సంవత్సరంలో జన్మించిన యువతి, యువకులకు ఫామ్ 6 ద్వారా ఓటు హక్కు నమోదు చేయించాలని అన్నారు. గ్రామాలలో మృతి చెందిన వారిని ఓటర్ లిస్టులో నుంచి ఫామ్ సెవెన్ ద్వారా తొలగించాలని సూచించారు. 18 ఏండ్లు నిండిన యువతీయువకులు ఓటు హక్కును నమోదు చేయించుకోవాలన్నారు. ఈయన వెంట తహసీల్దార్ వీర్‌సింగ్, ఆర్ఐ సురేష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ముందుంటుంది

**నవతెలంగాణ-మల్లాపూర్**

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీఈయ ముందుంటుందని సంఘం మండల అధ్యక్షుడు ఎనగందుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాతారం, రేగుంట, వీవీరావుపేట, పాత దాంరాజ్ పల్లి, కొత్త దాంరాజ్ పల్లి,వాల్గొండ, ఓబులాపూర్ , సంగెం శ్రీరాంపూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల లోని ఉపాధ్యాయులను సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జొడి రాజిరెడ్డి, లక్కడి శ్రీనివాస్, కుంబాల శ్రీనివాస్,గంగాధరి రవి, నాగుల నరహరి, సతీష్, రాజేష్, నర్సింగరావు, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

## టీఎస్ పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

**నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం**



అశోక్



వెంకటేశ్వర్లు

మండల టీఎస్ పీఆర్టీయూ నూతన కార్యవర్గన్ని శుక్రవారం ఎన్ను కున్నారు. జగిత్యాల జిల్లా పీఆర్టీ ఈయూ అధ్యక్షుడు యాల్ల అమర్ నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయినపెల్లి ఆనంద్‌రావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జె.అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఉలిసే వేంకటేశ్వర రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా దాసరి నవీన్ కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలుగా ఇప్పత్ యాస్మిన్ కార్యదర్శిగా పి.లింగయ్య, మహిళా కార్యదర్శిగా బి.గంగా మణి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు చిన్నయ్య, జిల్లా బాధ్యులు ఈ.శ్రీధర్ మద్దిరాల గణేష్, రాజ్‌కుమార్,అశోక్ విశాల్, జనార్దన్, త్రినాథ్ పాల్గొన్నారు.

## మండల వ్యవసాయ అధికారికి సన్మానం

**నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం**



మండల వ్యవసాయ అధికారి ఆకు రాజ్ కుమార్‌ను డబ్బా మాజీ సర్పంచ్ లింగంపల్లి గంగాధర్ సాల్వాతో ఘనంగా సత్కరించారు. నూతనంగా వచ్చిన ఏవోను మర్యాదపూర్వకంగా సన్మానించినట్లు మాజీ సర్పంచ్ తెలిపారు. ఆయనతోపాటు వ్యవసాయ విస్తీర్ణ అధికారి వినోద్, రైతులు పురుషోత్తం, సాదాల గంగ మల్లయ్య కనుక గంగన్న, మేకల గంగాధర్, తదితరులు పాల్గొన్నారు

## శ్రీరామ మందిరంలో ఎమ్మెల్యే భూమి పూజ

**నవతెలంగాణ-జగిత్యాలటౌన్**

జగిత్యాల పట్టణ బ్రాహ్మణవాడ శ్రీరామ మందిరంలో టీటీడీ ద్వారా మంజూరైన రూ. 10లక్షల నిధులతో ధ్యాన మందిరం నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భూమి పూజ చేశారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధి, సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు టీటీడీ నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ జయశ్రీ, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు టివి సూర్యం, సభాపతి తీగుళ్ళ సూర్యనారాయణ శర్మ, బ్రాహ్మణ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన జగిత్యాల సీడీపీవో

**నవతెలంగా- జగిత్యాలటౌన్**



జగిత్యాల జిల్లా చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (పూర్తి అదనపు బాధ్యతలు)గా నియామకమైన ఏ. మమత జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను ఎమ్మెల్యే క్వార్టర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాన్ని అందజేశారు.

## శ్రీ లోకమాత పోచమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ



**నవతెలంగాణ-జగిత్యాలటౌన్**

జగిత్యాల పట్టణంలోని పురాణిపేట శ్రీ లోకమాత పోచమ్మ తల్లి అమ్మవారిని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి దర్శించుకున్నారు. శ్రీ లోకమాత పోచమ్మ తల్లి ఆలయ 62 వ వార్షిక ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ములస్తపు లలిత, మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## జ్ఞానమే ఆడపిల్లలకు నిజమైన ఆభరణం

**భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్**



విద్యార్థి చేతిపై మంటలు లేపుతున్న నరేష్

**నవతెలంగాణ-మల్యాల**

జ్ఞానమే ఆడపిల్లలకు నిజమైన ఆభరణం అని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. శుక్రవారం మల్యాల మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నీరజ అధ్యక్షతన మహిళల రక్షణ-మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పులేటి నరేష్ మాట్లాడుతూ.. సమాజంలోని మూఢనమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలన్నారు. అనంతరం మాంత్రికులు, భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలను వివరించారు.

## మండపాలకు అనుమతి తప్పనిసరి

**మల్యాల ఎస్ఐ ఏ.నరేష్ కుమార్**

**నవతెలంగాణ-మల్యాల**

వినాయక మండపాలను ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో అనుమతి పొందాలని మల్యాల ఎస్ఐ ఏ.నరేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా మండపాల నిర్వాహకులు పోలీసు వారి సూచనలను పాటించాలన్నారు. కేంద్రాల నిర్వహకులు మొదటి నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అల్లర్లు లేకుండా భక్తి, శ్రద్ధలతో ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. విగ్రహాల నిమజ్జనం వరకు పూర్తి బాధ్యత నిర్వాహకులు వహించాల్సి ఉంటుందని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
రాజన్న సిరిసిల్ల
శనివారం | ఆగస్టు 31, 2024 | www.navatelangana.com

# జాతీయ పురస్కారానికి సంపత్ సార్ ఎంపిక

- ఉత్తమ ఉపాధ్యాయుడికి కలెక్టర్ అభినందన
- విద్యార్థులను ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దిన దమ్మన్నపేట భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు తాడూరి సంపత్ కుమార్
- మిషన్- 100 పేరిట ప్రత్యేక కార్యక్రమం
- జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్వీకరించనున్న అవార్డు
- రాష్ట్రం నుంచి ఇద్దరు ఎంపిక కాగా, వారిలో ఒకరు జిల్లా ఉపాధ్యాయులు



నవతెలంగాణ - సిరిసిల్ల

విద్యార్థులే సొంతంగా వివిధ ఆవిష్కరణలు రూపొందించేలా తీర్చిదిద్దుతున్న జిల్లా ఉపాధ్యాయుడికి అత్యున్నత పురస్కారం దక్కనుంది. మిషన్ 100అనే కార్యక్రమాన్ని చేపట్టి ఎందరో విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందేలా సిద్ధం చేసిన దమ్మన్నపేట భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు తాడూరి సంపత్ కుమార్ ప్రతిష్టాత్మక రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యారు. ఆయనను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేకంగా అభినందించారు. ఈ అవార్డుకు రాష్ట్రం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపిక కాగా వారిలో ఒకరు సంపత్ కుమార్. ఆయన ఎంపిక అవడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థుల్లో సజనాత్మక ఆలోచనలు వెలికి తీసి, వారు ఆవిష్కరణలు చేసేలా ప్రోత్సహించి ప్రధానమంత్రి, రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకోవడంలో అవిశ్రాంతంగా కృషి చేస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైన గంభీరావుపేట మండలం జిల్లా పరిషత్ దమ్మన్నపేట ప్రభుత్వ పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు తాడూరి సంపత్ కుమార్ ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం తన ఛాంబర్లో అభినందించారు. ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాల సమయంలోనే కాకుండా అదనపు సమయంలో కూడా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ పిల్లల్లో భాష, గణిత నైపుణ్యాలను పెంపొందించేలా కృషి చేయాలని, ప్రభుత్వం కేటాయించిన సెలవులను వీలైనంత తక్కువగా వినియోగించుకొని విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి అకింతభావంతో పనిచేయాలని పిలుపు ఇచ్చారు.

**మిషన్-100 అనే కార్యక్రమాన్ని మొదలుపెట్టి..**

కనీసం 100 మంది గ్రామీణ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆవిష్కర్తలుగా చేయాలనే సదుద్దేశంతో మిషన్-100అనే కార్యక్రమాన్ని సంపత్ కుమార్ కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు 53మంది విద్యార్థులను ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దారు. ఇందులో 8మంది విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి, 16మంది జాతీయస్థాయి బహుమతులు గెలుచుకున్నారు.

**ఇవీ ఆవిష్కరణలు..**

సంపత్ కుమార్ సర్ సారథ్యంలో విద్యార్థులు గైడ్ వెల్డర్లకు ఉపయోగపడే హెల్మెట్ అనే ఆవిష్కరణ, జపాన్ దేశంలో నిర్వహించిన అంతర్జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనందున రాష్ట్రపతి, ప్రధానమంత్రి వీరిని అభినందించారు. ఇద్దరు విద్యార్థులు చేసిన ఆవిష్కరణలు 2021, 2023 నందు హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాయి. అలాగే వీరి గైడ్ చేసిన ఆవిష్కరణలు వరుసగా నాలుగు సార్లు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ కు ఎంపికయ్యాయి. వీరి మార్గదర్శనం లో విద్యార్థులు చేసిన ఆవిష్కరణలు ఇండియా లో నిర్వహించే అన్ని వైజ్ఞానిక ప్రదర్శనల్లో జాతీయ స్థాయికి ఎంపికవడము విశేషం. విద్యార్థుల కొరకు అవిశ్రాంతంగా శ్రమిస్తున్న వీరి సేవలను గుర్తించి భారత ప్రభుత్వం వీరికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని రాష్ట్రపతి చేతులమీదుగా సెప్టెంబర్ 5వ తేదీన అందజేయనున్నారు. కలెక్టర్ ను కలిసిన వారిలో జిల్లా విద్యాధికారి ఎ. రమేష్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ రావు, జిల్లా సైన్స్ అధికారి దేవయ్య పాల్గొన్నారు.

# జోరుగా డైలీ ఫైనాన్స్ దందా

- పేదల అవసరాలే ఆసరాగా వడ్డీ వసూళ్లు
- ఖాళీ చెక్కులు, నోట్లు రాయించుకుని వేధింపులు
- తనఖా పేరుతో ఆస్తులు సేల్ డీడ్ రాయించుకుని బెదిరింపులు
- ఆస్తులు అమ్ముకుంటున్న బాధితులు
- ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా అక్రమ వ్యాపారం..



నవతెలంగాణ - సిరిసిల్ల

వడ్డీ జలగలు సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారు. 100రూపాయలకు ఐదు నుంచి పది రూపాయల వరకు వడ్డీ వసూలు చేస్తూ దోచుకుంటున్నారు. అవసరాల కోసం కొందరు, ఆపద అత్యవసర సమయాల్లో మరి కొందరు అధిక వడ్డీ అయినప్పటికీ అప్పులు తీసుకుంటూ తిరిగి చెల్లించలేక ఆస్తులను తెగనమ్ముకుంటున్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజల బలహీనతను అక్రమ వడ్డీ వ్యాపారులు నగదుగా మార్చుకుంటున్నారు. రెట్టింపు వడ్డీతో అధికంగా చిరువ్యాపారులే నిలువు దోపిడీకి గురవుతున్నారు. అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చి సెక్యూరిటీగా వాహనాలు, విలువైన సెల్ ఫోన్లు, ఇతర ఆస్తుల తాకట్టు పెట్టుకుంటున్నారు. ఈ వడ్డీ జలగలు కొందరు ప్రాణాలను బలి తీసుకుంటుండగా మరికొందరు కోట్ల ఆస్తులను కోల్పోతూ రోడ్డున పడుతున్నారు. వడ్డీ చెల్లించలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కొంతకాలం కిందట ఇదేవిధంగా ఒక ప్రైవేటు విద్యాసంస్థ డైరెక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలన సృష్టించింది. మూడేండ్ల కిందట రాజన్న సిరిసిల్ల జిల్లాలో అక్రమ ఫైనాన్స్ వ్యాపారులపై దాడులు చేయగా అనేకమంది పోలీసుల వలలో చిక్కారు. లక్షల రూపాయలను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. అలాగే అనేక డాక్యుమెంట్లను వడ్డీ వ్యాపారుల నుంచి అధికారులు బయటకు తీశారు. వారిపై కేసులు కూడా నమోదయ్యాయి. రోజు కష్టపడే కూరగాయలు, పండ్ల, ఫుట్పాత్ వ్యాపారులు రోజువారీగా తీసుకున్న అప్పుకు వడ్డీ చెల్లించడానికి వారి సంపాదన సరిపోకపోవడంతో బతుకులు వడ్డీలతో చితికి పోతున్నాయి

**వడ్డీ అక్రమ వ్యాపారంలో ప్రభుత్వ ఉద్యోగులు**

ఉమ్మడి జిల్లాలోని ఎలాంటి అనుమతి లేకుండా నడుపుతున్న ఈ అక్రమ వడ్డీ వ్యాపారంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తున్నది. రోజువారీ వడ్డీ వ్యాపారంలో పదివేల రూపాయలు అప్పుగా తీసుకుంటే ఇందులో ముందుగానే 1500నుంచి 2000వరకు తగ్గించి ఎనిమిది వేల నుంచి 8500 మాత్రమే అప్పు ఇస్తుంటారు. ఇలా ఇచ్చిన ఎనిమిది వేల రూపాయలు అప్పుకు 100రోజుల్లో రోజుకు 100రూపాయల వంతున 10000 వసూలు చేస్తున్నారు. కూరగాయల వ్యాపారులు పండ్ల వ్యాపారులకు ఉదయం 900అప్పు ఇచ్చి సాయంత్రం 1000రూపాయలు వసూలు చేస్తున్నారు. రోజువారి అప్పు 100రోజుల అప్పులకు ఒక గ్యారెంటీతో ప్రామిసరీ నోటుపై సంతకాలు తీసుకుంటున్నారు.

**అప్పు తీసుకున్నవారినుంచే డాక్యుమెంట్ ఖర్చులు**

లక్ష ఆపై అప్పులకు సెక్యూరిటీగా ఇండ్లు భూముల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు తీసుకోవడం ఆస్తులను మార్ట్ గేజ్ జీపీఏ లేదా రిజిస్ట్రేషన్ చేయించుకోవటం విలువైన వస్తువులను సెక్యూరిటీగా పెట్టుకుంటున్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు అప్పులు తీసుకున్న సందర్భంలో వారు ఏటీఎం కార్డులను ఈ వడ్డీ వ్యాపారులు వారి వద్దనే ఉంచుకొని వేతనాలు బ్యాంకు ఖాతాలో జమ కాగానే డ్రా చేసుకుంటున్నారు. వడ్డీ వసూలుకు సంబంధించిన ఖర్చులు కూడా అప్పు తీసుకున్న వారే భరించాల్సి ఉంటుంది. వాయిదా ప్రకారం వడ్డీ అప్పులు చెల్లించని వారి ఇంటికి మనుషులను పంపిస్తూ వారి ఖర్చులను కూడా అప్పు తీసుకున్న వారి ఖాతాలో జమ చేస్తున్నారు. ఒకసారి లోన్ రికవరీ కోసం వెళ్తే రూ.1000 ఖర్చు కింద వసూలు చేస్తున్నారు. అప్పులు వసూలుకు వడ్డీ వ్యాపారులు కొందరు ఏజెంట్లుగా నియమించుకొని వారిని అప్పు తీసుకున్న వారింటికి ఉదయమే పంపించి ఇంటి వద్దనే మకాం వేసి అవసరం అయితే బెదిరింపులకు పాల్పడుతూ బలవంతంగా వసూలు చేస్తున్నారు. అప్పులు తీర్చలేని సమయంలో వడ్డీ వ్యాపారుల వద్ద సెక్యూరిటీగా ఉన్న గ్యారెంటర్‌పై ఒత్తిడి తీసుకురావడం అది సాధ్యం కాని సందర్భంలో ఇండ్లు భూములను ఆక్రమించడం చేస్తున్నారు. అప్పుల ముసుగులో ఇంత దోపిడీ జరుగుతున్న బాధితులు చెప్పుకోలేని పరిస్థితి ఉంది ఈ విషయం ఎవరికైనా చెబితే మళ్లీ అప్పులు ఇచ్చే వారు ఉండరని భయపడుతున్నారు. కరీంనగర్ రాజన్న సిరిసిల్ల జగిత్యాల పెద్దపెల్లి జిల్లాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం జరుగుతున్న ఈ దోపిడీని అరికట్టాల్సిన చిట్ రిజిస్టర్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదాయపన్ను శాఖ పోలీసులు ఈ అక్రమ దందాపై దృష్టి సారించి సామాన్యుల నడ్డి విరుస్తున్న వడ్డీ దందాకు పులిస్టాప్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## డైలీ ఫైనాన్స్ పోలీసుల కొరడా



తనిఖీలు చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ - సిరిసిల్ల

జిల్లాలో అనుమతులు లేకుండా డైలీ ఫైనాన్స్ నిర్వహిస్తూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న డైలీ ఫైనాన్స్ వ్యాపారస్తులపై శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు టీంలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డైలీ ఫైనాన్స్ పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారి నుండి అధిక వడ్డీ వసూలు చేస్తున్నారని, ఆ వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, చట్ట విరుద్ధంగా,అధిక వడ్డీ రేట్లతో సామాన్యులపై దౌర్జన్యం చేస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన పద్దతులలో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే నమ్మాలన్నారు. అక్రమ ఫైనాన్సు వ్యాపారం నడిపేవారి వివరాలు జిల్లా పోలీస్ కార్యాలయంలోగానీ డయల్ 100కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచడంతోపాటు సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడం లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని ఆయన తెలిపారు.

## హోంగార్డ్‌కు ఆత్మీయ వీడ్కోలు

నవతెలంగాణ - సిరిసిల్ల



జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డ్‌గా 34ఏండ్లపాటు సేవలందించిన పి.మల్లయ్య ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ పూలమాల వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందాడని ఎస్పీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, పౌర్ణమి పాల్గొన్నారు.

## రోడ్డుపై చెత్త.. దుకాణదారులకు జరిమానా

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్



జరిమానా విధిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సిరిసిల్ల పట్టణంలోని మార్కెట్ ఏరియాలో రోడ్డుపై చెత్త వేసిన దుకాణదారులకు మున్సిపల్ పారిశుధ్య విభాగ అధికారులు శుక్రవారం జరిమానా విధించారు. చెత్తను మున్సిపల్ బండికి ఇవ్వకుండా రోడ్డుపై వేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఇద్దరు దుకాణదారుల్లో ఒకరికి రూ. 1000 మరొకరికి రూ.500 జరిమానా వేశారు. ఇలాంటివి పునరావతమైతే భారీ జరిమానాలు విధించడం జరుగుతుందని హెచ్చరించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఉమర్, వార్డ్ ఆఫీసర్ శేఖర్ , దేవయ్య, రాజు ఉన్నారు.

## అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



భోజన నాణ్యతను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ - ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా అడిషనల్ కలెక్టర్ కిమ్యా నాయక్ శుక్రవారం ముస్తాబాద్ మండలంలోని కస్తూరిబా పాఠశాల తహసిల్దార్ కార్యాలయం రైస్ మిల్స్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు చదువు బాగా చెబుతున్నారా వారు చెప్పే పాఠాలు అందరికీ అర్థమవుతున్నాయా భోజనం ఎలా ఉంది చికెన్ మటన్ పెడుతున్నారా కస్తూరిబా పాఠశాల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తహసిల్దార్ కార్యాలయంలో రిజిస్టర్ లను పరిశీలించారు. రిజిస్ట్రేషన్లు ఆదాయకుల ధ్రువీకరణ పత్రాలు వెంట వెంటనే ఇస్తున్నారా డీల చేయవద్దని అన్నారు. అనంతరం నూతనంగా నిర్వహించిన రైస్ మిల్ లను పరిశీలించారు.

## బీసీలకు రేషన్ దుకాణాలను కేటాయించాలి

**బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు శీలం స్వామి**

నవతెలంగాణ - ముస్తాబాద్ :



మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలలో రేషన్ దుకాణాలను బీసీలకు కేటాయించాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు శీలం స్వామి అడిషనల్ కలెక్టర్ కిమ్యా నాయక్ వినతి పత్రం అందజేశారు. జనాభా ప్రాతిపదికన కూడా బీసీలు మండలంలో 60శాతం కన్నా ఎక్కువగా ఉన్నారని బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ నాయకులు మెంగని మనోహర్, మండల బీసీ నాయకులు కోడె శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి రాజన్న ఆలయ అర్చకుల ఆశీర్వాదం



నవతెలంగాణ - వేములవాడ

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అధికారులు, అర్చకులు శుక్రవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కలిసి స్వామివారి లడ్డు ప్రసాదాన్ని అందజేసి వేదయుక్త ఆశీర్వచనం గావించారు. ఆలయ ఈవో వినోద్ రెడ్డి స్వామివారి శేష వస్త్రానికి కప్పి సత్కరించారు. దేవాలయ విస్తరణకు, బడ్జెట్లో రూ.50కోట్లు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ విస్తరణకు సంబంధించిన డిజైన్స్, నమూనాలను శృంగేరి పీఠాధిపతుల అనుమతి తీసుకోవలసి ఉందని సీఎంకు ప్రభుత్వ విప్ ఆలయ ఈవో తెలియజేశారు. వెంటనే శృంగేరి పీఠాధిపతుల అనుమతి తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విప్‌కు, ఆలయ అధికారులను ఆదేశించారు. సీఎంను కలిసిన వారిలో స్థపతి వల్లినాయగం, ఈఈ రాజేష్, డీఈఈ రఘునందన్, ఆలయ ప్రధాన అర్చకులు ఉమేష్ శర్మ, అర్చక బృందంతోపాటు తదితరులు ఉన్నారు.

# ముగ్గురికి జరిమానా, ఒకరిపై వారెంట్ జారీ

**సిరిసిల్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణ**

నవతెలంగాణ - సిరిసిల్ల

సిరిసిల్ల పట్టణానికి చెందిన లింగంపల్లి అనిల్ మానేరువాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేయగా సిరిసిల్ల ఎమ్మార్వో ఎదుట బైండోవర్ చేసినప్పటికీ మారకుండా బైండోవర్ అతిక్రమించి మళ్లీ ఇసుకను అక్రమ రవాణా చేయడంతో అతనిపై సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎమ్మార్వో రూ.15వేల జరిమానా విధించారు. సిరిసిల్లకు చెందిన బల్వీర్ సింగ్, చంద్రంపేటకు చెందిన సంపంగి మల్లవ్వ ఎలాంటి అనుమతులు లేకుండా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారని ఎమ్మార్వో ఎదుట బైండోవర్ చేసినప్పటికీ మారకపోవడంతో తహసీల్దార్.. బల్వీర్ సింగ్ రూ.20వేలు, సంపంగి మల్లవ్వకు రూ.20వేలు జరిమానా విధించారు. సంజీవయ్య నగర్‌కు చెందిన తుమ్మల శివ కుమార్ శాంతి భద్రత లకు విఘాతం కలిగించగా బైండోవర్ చేసినా మారకపోవడంతో అతడిపై ఎమ్మార్వో వారెంట్ జారీ చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కె కృష్ణ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను ముందస్తు గా బైండోవర్ చేస్తామన్నారు. నేరాలకు పాల్పడకుండా ఏదైనా చట్ట పరమైన సమస్య ఉంటే పోలీసులను సంప్రదించాలని సీఐ సూచించారు.

# అనుమతులు లేకుండా డీజేలు నడిపిస్తే కఠిన చర్యలు

- సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి
- పోలీస్ విధులకు ఆటంకం కలిగిస్తూ ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన ముగ్గురిపై కేసు

నవతెలంగాణ - సిరిసిల్ల

అనుమతులు లేకుండా డీజేలు నడిపించినా, శాంతి భద్రతలకు ఆటంకం కలించినా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ చంద్రశేఖరరెడ్డి అన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ.. సిరిసిల్ల పరిధిలోని పెద్దూర్‌లోని డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద నిబంధనలకు విరుద్ధంగా డీజేను రోడ్డుకు అడ్డంగా పెట్టుకొని ప్రజలకు ఇబ్బందులు కలుగచేస్తున్నారని డయల్100కు కాల్ రాగానే అక్కడికి వెళ్లిన బ్లూ కోల్ట్ సిబ్బంది డీజే ఆపమని చెప్పినా వినకుండా దొంతరవేణి నవీన్, దొంతర వేణి మల్లేష్, దొంతరవేణి రంజితలు పోలీస్ విధులకు ఆటంకం కలిగిస్తూ డయల్100 ట్యాబ్ ధ్వంసం చేశారు. బ్లూ కోల్ట్ సిబ్బంది ఫిర్యాదు మేరకు డీజే సీజ్ చేసి నవీన్, మల్లేష్, రంజిత్‌లపై కేసు నమోదు చేసి శుక్రవారం వారిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు నిర్వహించినా, ఉత్సవాల్లో డీజేలను పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగించినా నిర్వాహకులు, యజమానులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. గతంలో బైండోవర్ అయిన వ్యక్తులు మళ్లీ డీజేలు నడుపుతూ రోడ్లపై అనవసరంగా న్యూసెన్స్ చేస్తే తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

## మహిళలు, ప్రజల భద్రతకు ప్రాధాన్యం

నవతెలంగాణ - వీర్నపల్లి



మహిళల భద్రత ప్రజల రక్షణ కోసం పోలిసులు ఉన్నారని ఎస్ ఐ ఎల్లయ్య గౌడ్ అన్నారు. వీర్నపల్లి మండలం ఎంపీపీఎస్ పాఠశాలలో శుక్రవారం బాలికల లైంగిక వేధింపుల నివారణపై (పోక్సో) చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ఈ సందర్భంగా ఎస్ ఐ పోలీస్ శాఖ మహిళా భద్రత, రక్షణ కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. మహిళలు, విద్యార్థుల్లో భరోసా కల్పించడం కోసం షీ టీం ఏర్పాటు చేశారని తెలిపారు. విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపులు ఉమెన్ సేఫ్టీ, షీ టీమ్స్ ఇంపార్టెంట్స్‌ను వివరించారు. తాత్కాలిక ఆనందాల కోసం ప్రలోభాలకు, ఆకర్షణలకు గురై భవిష్యత్తు జీవితం నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు ఉద్బోధించారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యం, పట్టుదలతో కష్టపడి చదవాలన్నారు. సంకల్పంతో చదివితే ఉద్యోగాలు తప్పకుండా వరిస్తాయన్నారు. చదువు వల్లనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం, కానిస్టేబుల్ మల్ల గౌడ్, పోలిసు సిబ్బంది ఉన్నారు.

## పౌరహక్కులను వినియోగించుకోవాలి

నవతెలంగాణ - వీర్నపల్లి



రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆర్ఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అర్ ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అంటరానితనాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఎక్కడైనా పౌరహక్కులకు భంగం వాటిల్లితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివక్ష లేకుండా ప్రజలందరూ కలిసిమెలిసి జీవించాలని కోరారు. జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

## వ్యాధులు ప్రబలకుండా పిల్లల పట్ల జాగ్రత్త వహించాలి

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



నవతెలంగాణ - చందుర్తి : వ్యాదులు ప్రబలకుండా పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.శుక్రవారం ఉదయం స్థానిక ఎస్సి వసతి గృహాన్ని తనిఖీ చేశారు. సమయానికి భోజనం అందిస్తున్నారా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. దుప్పట్లు ఉన్నాయా అని పిల్లలను అడిగారు. వంట గది, స్టోర్ రూమ్ పరిశీలించారు. టాయిలెట్స్ సదుపాయం ఉన్నదా అని అడిగారు. ఎంత మంది వసతి గృహంలో విద్యార్థులు ఉన్నారని వార్డెన్ రవీందర్ స్వామిని అడిగారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. తదనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఆయన వెంట జిల్లా విద్యాధికారి రమేష్, డీఎస్, సీడీఓ విజయ ఉన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ**

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : జిల్లాలోని మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల వేములవాడ మున్సిపాలిటీలలో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పద్ధతిలో శానిటేషన్, ఇతర విభాగాలలో అనేక మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని, కానీ మున్సిపల్ పాలకవర్గం, అధికారులు కార్మికుల సమస్యలను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. కార్మికులకు రావాల్సిన పిఆర్సి ఏరియర్స్ బకాయిలను వెంటనే చెల్లించాలని , పిఎఫ్, ఈఎస్ఐ హెల్త్ కార్డులు,బీమా సౌకర్యం, పనిముట్లు , సేఫ్టీ కిట్స్ , రక్షణ సామాగ్రిని అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గ సభ్యులైన కౌన్సిల్ సమావేశాలలో సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## మున్సిపల్ సిబ్బందితో రోడ్డుపై మురుగునీరు తొలగింపు..

నవతెలంగాణ - వేములవాడ



మురుగును శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పట్టణంలోని తన వార్డులో సమస్య రాగానే స్పందించి దగ్గరుండి మరి మున్సిపల్ సిబ్బందితో మురుగు నీటిని తొలగించి బాధ్యతను నిర్వర్తించారు 27వ వార్డు కౌన్సిలర్ గోలి మహేష్. గురువారం రాత్రి కురిసిన వర్షానికి వరద నీరు మురుగు కాలువలోకి చేరడంతో రోడు పైకి మురుగునీరు భారీగా చేరి అక్కడున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడడంతో శుక్రవారం వెంటనే స్పందించిన కౌన్సిలర్ గోలి మహేష్ మున్సిపల్ జవాన్ ఐతం మహేష్, మున్సిపల్ సిబ్బంది సహాయంతో వెంటనే మురుగునీరు తొలగించారు. విషయం తెలుసుకున్న కాలనీవాసులు, వేములవాడ పట్టణ ప్రజలు కౌన్సిలర్ మహేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## లైంగిక వేధింపుల నివారణపై అవగాహన



నవతెలంగాణ - రుద్రంగి : జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల లైంగిక వేధింపుల నివారణ కోసం రుద్రంగి మండలంలోని మానాల జెడ్పీ హెచ్ఎస్, రుద్రంగి కృష్ణవేణి టాలెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, కేజీబీవీ బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రుద్రంగి పోలీస్ పోలీసు స్టేషన్ ఎస్ఐ అశోక్ హాజరై మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలల హక్కులు, పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. జరిగింది.అదేవిధంగా ఎవరైనా అమ్మాయిలను వేధింపులకు గురి చేస్తే 100 లేదా1098 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, ఐసిపి ఎస్.విజయ్ కుమార్, ఐసిపిఎస్ సంపత్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.


## మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు చెల్లించాలి

**జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్**



నవతెలంగాణ - బోయినిపల్లి : తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి తెలుపాలని మధ్యాహ్న భోజన కార్మికులు మండల విద్యాధికారి శ్రీనివాస దీక్షితులుకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మిడ్ డే మీల్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ యాదవ్ హాజరై కార్మికుల ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే భోజన కార్మికులకు ప్రతి నెలా రూ.10వేలు వేతనం ఇస్తామన్న హామీని నెరవేర్చాలని కోరారు. భోజన కార్మికులకు ప్రతినెలా 5లోపు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు, నడిబొట్టు లక్ష్మి, నరసయ్య, బి కొమురయ్య, లావణ్య,ఐలవ్వ, కొమరవ్వ, నరసవ్వ, రాజవ్వ, భారతవ్వ పాల్గొన్నారు.

# ఎల్వోసీ చెక్కు అందజేత



నవతెలంగాణ- జూలపల్లి /ఎలిగేడు
ఎలిగేడు మండలం, నర్సాపూర్ గ్రామానికి చెందిన మల్లయ్య అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్లో చేరగా మల్లయ్యకి అనారోగ్య ఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయక నిధి ద్వారా 2,25,000 (లక్షల ఇరవై ఐదు వేల రూపాయల) ఎల్వోసీ చెక్కును శుక్రవారం రోజున హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో (సెక్రటేరియట్) వారి కుటుంబ సభ్యులకు పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు అందజేశారు. ఆపదలో ఉన్నవారికి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని తెలిపారు.

## పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న టూటౌన్ ఎస్ఐ ఫరీద్

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ
పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని గోదావరిఖని టూ టౌన్ ఎస్ ఐ ఎస్‌కే ఫరీద్ అన్నారు. శుక్రవారం గోదావరిఖని టూ టౌన్ పరిధిలోని సుందిళ్ళ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని రెవెన్యూ అధికారులు,ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘంతో సంయుక్తంగా కలిసి ఎస్ఐ ఎస్‌కే ఫరీద్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హక్కులకు ఎలాంటి భంగం కలిగినా ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు చేపట్టి హక్కుల సాధనకు కృషి చేస్తామన్నారు.కులపరంగా దుషించినా చట్ట పరచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి మహేష్,హెచ్ డబ్ల్యూ సంతోష్,సంఘం నాయకులు బూడిద సమ్మయ్య,మేకల సురేష్, పాల్గొన్నారు.

## ఆర్ఎంపీ, పీఎంపీల బైక్ ర్యాలీ



నవతెలంగాణ-పెద్దపల్లిటౌన్
రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఎంపీ, పీఎంపీలను వైద్యం చేయవద్దని ఇచ్చిన పిలుపుమేరకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు వ్యవసాయ మార్కెట్ నుండి కలెక్టరేట్ ఆఫీస్ వరకు బైకు ర్యాలీ నిర్వహించి ఆఫీస్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టీజీఎంసీ డీఎంహెచ్‌వోఅధికారులు దాడులు నిర్వహించి మా కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్నారని మేము ప్రథమ చికిత్స మాత్రమే చేస్తున్నామని ఐఎంఏ మాపై కక్షగట్టి దాడులు నిర్వహిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ రాష్ట్ర అధ్యక్షులు రాజమౌళి పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ ఆర్ఎంపీ వైద్యులు పాల్గొన్నారు

## లక్కారం పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశం



నవతెలంగాణ-ముత్తారం:
రెండు నెలలకు ఒకసారి నిర్వహించే ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం ముత్తారం మండలంలోని లక్కారం జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపరుచుటకు, సబ్జెక్టు మీద అవగాహన పెంపొందించుటకు, పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రుణమాఫీ చేయండి మహాప్రభో...

- అధికారుల తప్పిదంతో రుణ మాఫీకి నోచుకోని రైతు
- పీఎసీఎస్ సీఈవో ముందు గోడు వెల్లబోసుకున్న రైతు



.సీఈవోను వేడుకుంటున్న రైతు అల్లాడి రవీందర్ రావు

నవతెలంగాణ-ముత్తారం:
అర్హుడినైన తనకు రుణ మాఫీ చేయండి మహాప్రభో అంటూ ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన అల్లాడి రవీందర్ రావు వేడుకున్నారు. ఓడేడుకు చెందిన అల్లాడి రవీందర్ ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ద్వారా 1.65లక్షల పైచిలుకు రుణాన్ని వ్యవసాయం కోసం గతంలో పొందాడు. అయితే అదే గ్రామానికి చెందిన మరో అల్లాడి రవీందర్ రావు కూడా ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ద్వారా 50వేల పైచిలుకు రుణాన్ని వ్యవసాయం కోసం గతంలో పొందాడు. అయితేఅధికారులు 50వేల రుణం తీసుకున్న అల్లాడి రవీందర్ రావు ఆధార్ నెంబర్‌ను 1.65లక్షల రుణం తీసుకున్న అల్లాడి రవీందర్ రావు రుణాన్ని ఆటాచ్ చేస్తూ కంప్యూటర్‌లో నమోదు చేయగా, అల్లాడి రవీందర్ రావు పేరిట 2.15లక్షల పైచిలుకు రుణం అయినట్లు చూపించడంతో ఇద్దరికీ రుణ మాఫీ జరగలేదని, 1.65లక్షల రుణం తీసుకున్న అల్లాడి రవీందర్ రావు తన గోడును పీఎసీఎస్ సీఈవో ముందు వెల్లబుచ్చుకున్నాడు. తాను పేద కుటుంబానికి చెందిన రైతునని, ప్రభుత్వం అందించే సహాయంతోనే తాను వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని వెల్లదీస్తున్నానని, అధికారులు చేసిన తప్పిదం మూలంగా తనకు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సవరణ చేసి, తనకు రుణ మాఫీ మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీనిపై సీఈవోను వివరణ కోరగా, కంప్యూటర్‌లో నమోదు చేసే సమయంలో తప్పిదం జరిగిన విషయం వాస్తవమేనని, దీనిపై ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకు పోయి బాధితునికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి

- డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఎన్నికల హామీలపై ఖచ్చితమైనా సమాధానం చెప్పాలి
- రామగుండం నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తా
- తొలి సీఎం కేసీఆర్ పాలనలోనే నియోజకవర్గానికి నిధులు • రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ-కోల్‌సిటీ:
కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకి చ్చిన హామీలను నేరవేర్చాలాని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీల అమలుపై రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం గోదావరిఖని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖ రులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 8 నెలలు కాలం గడుస్తున్న ప్రజలకిచ్చిన హామిల ను అమలు పర్చలేదన్నారు. రైతులకు 2 లక్షల రుణమాఫీ అమలుకాలేదని, వృద్ధులకు 4 వేల ఫింఛన్ మహిళలకు నెలకు 2500 విద్యార్థులకు స్కూటీలు రైతు భరోసా పెంపు లాంటి హామీల అమలు కోసం ప్రజలందరు ఎదురుచూస్తున్నా రని అన్నారు. ఈ ప్రాంతానికి మొట్టమొదటి సారిగా వస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖచ్చితమేనా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రామగుండం అభివృద్ధి కోసం తొలి సీఎం కేసీఆర్ కోట్లాది రూపాయలు వెచ్చించడం జరిగిందన్నారు. రామగుండం అభివృద్ధి కోసం నవ నిర్మాణ సభ ఏర్పాటు చేసి అప్పటి రాష్ట్ర మంత్రి కేటీఆర్ ద్వారా 30 ఐటీపార్క్ అంత ర్గాం మండల కేంద్రంలో వంద ఎకరాల్లో ఇండస్ట్రీయల్ పార్క్ లకు శంకుస్థాపన చేయిం చామన్నారు. గతంలో మాంజూరైన అభివృద్ధి కొనసాగించాలన్నారు. రామగుండం ప్రాంతం లో విద్యుత్‌ప్లాంట్ ఏర్పాటు కోసం సన్నాహాలు చేయడం సంతోషకరమైన విషయమని, జేన్‌కో పని చేస్తున్న ఉద్యోగుల కోరుకునే విధంగా జేన్‌కో ద్వారా విద్యుత్ ప్లాంట్ నిర్మాణం చేప ట్టాల న్నారు. జేన్‌కో ప్లాంట్ నిర్మాణం చేపడితే స్థానికంగా యువతకు విద్యుత్ ప్లాంట్ ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉందన్నారు. స్థానిక తిలక్ నగర్లో నిరుపయోగంగా ఉన్న స్కూల్ భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురా వాలని డిమాండ్ 2019లో సింగరేణి సంస్థ డిమాండ్ చేయడం జరిగిందన్నారు. రామ గుండం నియోజకవర్గానికి వస్తున్న డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క రామగుండం నియోజ కవర్గం అభివృద్ధి కోసం నిధులు వెచ్చించాలని కోరారు. మాజీ జడ్పీటీసి అముల నారాయణ, కార్పొరేటర్ గాధం విజయ, బోడ్డు రవీందర్, పిల్లి రమేష్ చల్ల గురుగుల మెగిలి, నూతి తిరుపతి, తోకల రమేష్, సట్టు శ్రీనివాస్, గుంపుల లక్ష్మి, కోడి రామకృష్ణ, కిరణ్‌జీ, పాలమడుగుల కనకరాజ్, అవునూరి వెంకటేష్, రామరాజు, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ • హెలిప్యాడ్, శంకుస్థాపన, మీటింగ్ ప్రాంతాల పరిశీలన



నవతెలంగాణ-గోదావరిఖని:
డిప్యూటీ సీఎం పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. నేడు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క పెద్దపల్లి జిల్లాలోని రామగుం డం, గోదావరిఖనిలలో కార్యక్రమాల్లో పాల్గొ నున్న నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిష నర్ ఎం.శ్రీనివాస్ భద్రత, బందోబస్తు ఏర్పాట్ల ను పెద్దపల్లి డీసీపీ చేతనతో కలిసి శుక్రవారం పరిశీలించారు. కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ గ్రౌండ్, రామగుండం, గోదావరిఖని పలు శంకుస్థాపన చేసే స్థలాలు, సభ వేదికను సందర్శించి భద్రత పరమైన ఏర్పాట్లను పరిశీలించారు. సభ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, సభకు వచ్చే మార్గాలపై అధికారులతో పోలీస్ కమిషనర్ చర్చించి డిప్యూటీ సీఎం పర్యటించే ప్రాంతాలలో పూర్తిస్థాయిలో నిఘా, పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లకు అవసరమైన చర్యలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా భద్రత చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపారు. పలు ప్రాంతాల నుండి బహిరంగ సభకు వాహనాలకు, ప్రజలకు ట్రాఫిక్ సమస్య లు తలెత్తకుండా, పర్యటన సజావుగా సాగేలా కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు చేపడుతునట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన, అడిషనల్ డీసీపీ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, గోదావరిఖని ఏసీపీ రమేష్, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సురేంద్ర, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐ పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా మరింత వృద్ధి చెందాలి



నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ
మహిళలు ఆర్థికంగా మరింత వృద్ధి చెందాలని ఆర్జీ-2 జీఎంఎల్‌వీ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం కమ్యూనిటీ హాల్ నందు ఆర్జీ-2 ఏరియా సింగరేణి యాజమాన్యం ఆద్వర్యంలో ఉచిత టైలరింగ్, ఫాషన్ డిజైనింగ్,కంప్యూటర్ కోర్సుల శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ మన సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఐఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యోగుల, వారి కుటుంబ సభ్యుల, పరిసర ప్రాంతాల అభున్నతి కోసం ఎన్నో నిధులు వెచ్చించి ఖర్చు చేస్తుందని, సింగరేణి వ్యాప్తంగా నిరుద్యోగ యువత కోసం ప్రత్యేకంగా స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ తరగతులను నిర్వహి స్తుందని అన్నారు. ఈ శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ జిగురు రవీందర్, డీజీఎం పర్సనల్, అధికార ప్రతినిధి జి.రాజేంద్ర ప్రసాద్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షరీఫ్ మహమ్మద్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వేణుగోపాల్, స్పోర్ట్స్ సూపర్వైజర్ నరేందర్ రెడ్డి, సేవా కోఆడినేటర్ బి.దేవరెడ్డి, 8 ఇంక్లైన్ కాలనీ, పోతన కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణికి రావాల్సిన బకాయిలు ఇప్పించాలి

- ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నాయకులు మడ్డి ఎల్లా గౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం



నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన 29 వేల కోట్ల రూపాయల బకాయిలను ఇప్పించాలని, సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటా 35 శాతం చెల్లించేందుకు ప్రకటన చేసి శుభవార్త అందించాలని, అదేవిధంగా సింగరేణి లో కొత్త గనులు ప్రారంభించి సంస్థ ను రక్షించా లని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం కోరారు. శు క్రవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ శనివారం గోదావరిఖని పర్యటనకు వస్తున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సింగరేణిలో కార్మికుల సమస్యలపై పరిష్కారం కోసం ప్రకటన చేయాలని వారు కోరారు. ముఖ్యంగా దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేని విధంగా సింగరేణి కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కు ఐనటువంటి లాభాల్లో వాటాను ఏఐటీయూసీ యూనియన్ మాజీ అధ్యక్షులు అమరజీవి కేఎల్.మహేంద్ర అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి సాధించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. 2000 సంవత్సరం నుండి 2023 వరకు పది శాతం నుంచి 32 శాతం వరకు లాభాల్లో వాటా తీసుకోవడం జరిగిందని వారు తెలిపారు. ఇప్పటికి సింగరేణి లో 2023-2024 ఆర్థిక సంవత్సరం గడిచి ఐదు నెలలు గడిచినా కార్మికులు లాభాల్లో వాటా కోసం ఎదురు చూస్తున్నారని, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ 35 శాతం వాటా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వంకు, యాజమాన్యంకు లేఖ రాయడం జరిగిందని, లాభాలు ప్రకటించి 35 శాతం వాటా దసరా పండుగలోపు చెల్లించే విధంగా బట్టి విక్రమార్క ప్రకటన చేసి కార్మికులకు శుభవార్త అందించాలని కోరారు.

## ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై 14వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి కొంరయ్య ఆధ్వర్యంలో శు క్రవారం నిర్వహించారు. మండలం లోని 14 గ్రామ పంచాయతీ 01.03.2023 నుంచి 31.03.2024 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు ఈ నెల 22 నుంచి 29 వరకు తనిఖీలు నిర్వహించి, గ్రామాలలో గ్రామ సభలు పూర్తి చేసిన అనంతరం ఈ ప్రజావేదికను చేపట్టారు. మండలంలో మొత్తం 5 కోట్ల 90లక్షల పనులు చేపట్టగా, పూర్తి స్థాయిలో చెల్లింపులు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ పనులపై తనిఖీ నిర్వహించిన ఉపాధి హామీ అధికారులు సిబ్బంది పని ప్రదేశంలో కూలీ మస్టర్లపై సంబంధిత అధికారులు రోల్ కాల్ చేయకపోవడం, కొలతల తేడా, మస్టర్ల కూలీల సంతకాలు హాజరు లేకుండా వేతనాల చెల్లింపులు, మస్టర్ల హాజరు గణన లెక్కింపుల తప్పిదాలు, పని ప్రదేశాల్లో తేడా వంటి తప్పిదాలపై మండలంలోని 14 గ్రామ పంచాయతీలకుగాను 77,500 రూపాయలు రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ కె.సత్యనారా యణ, అసిస్టెంట్ మెనేజర్ గణేష్, అబుడ్స్‌మెన్ టి.శరత్ కుమార్, ఎంపీడీవో ఎం.సురేష్, ఎంపీవో నరేష్, ఏపీవో దయామణి, పీఆర్ఎఈ వరలక్ష్మి, టీఎలు, ఫీల్డ్అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



# విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి



నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
డ్రైడే కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ఉదయం పట్టణంలోని 14వ వార్డు 22వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమత రెడ్డి కౌన్సిలర్లతో కలిసి వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రతిరోజు మీ ఇంట్లో వెళ్లే తడిపొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందచేయాలని విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మీ ఇంటి చుట్టుపక్కల వర్షపు నీరు పిచ్చిమొక్కలు ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు షాహీధ సబీర్ ఖాన్, ఉప్పు స్వరూప రాజు, వార్డు ఆఫీసర్లు దీలిప్, శ్రీనివాస్, సానిటరీ ఇన్స్పెక్టర్లు రామ్మోహన్ రెడ్డి, పులిపాక రాజు, జవాన్లు శ్రావణ్, చిన్న,కరుణాకర్, వేణులు పాల్గొన్నారు.

## రుణమాఫీ కానీ రైతులు యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి : ఏవో



నవతెలంగాణ-ఓదెల
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు పంటరుణ మాఫీ పథకంలో భాగంగా రేషన్ కార్డు లేని లబ్ధిదారుల వివరాలను ఓదెల మండల కేంద్రంలోని రైతువేదిక లో రైతు రుణమాఫీ యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.భాస్కర్ తెలిపారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ మండలం లో 998 మంది రైతులు రేషన్‌కార్డు లేని వారీగా గుర్తించామన్నారు. రైతుల వివరాలు గ్రామాల వారీగా షెడ్యూల్ చేసి ప్రత్యేక యాప్ లో నమోదు చేస్తున్నామన్నారు. రేషన్ కార్డు లేని రైతులు తమ వివరాలను వెంటనే నమోదు చేసుకుంటే వెంటనే వారి వివరాలు ప్రభుత్వానికి పంపిస్తామన్నారు.

## నేడు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

నవతెలంగాణ- కోల్‌సిటీ :
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10.20 గంటలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు డి.శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్ రావు రామగుండం నగరానికి రానున్నారు. ఈ సందర్భంగా టీయుఎఫ్‌డీసీ నిధులు రూ.57.50 కోట్లతో వివిధ వార్డుల్లో మంచినీటి సరఫరా లైన్లు, మురుగు నీటి కాలువలు, సెంట్రల్ లైటింగ్,సెంట్రల్ మీడియన్, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులతో పాటు 33.50 ఎల్ఎండీ సామర్థ్యంతో 35 కి.మీ మేర భూగర్భ మురుగునీటి కాలువ నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేయనున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన ఎన్‌హెచ్ఆర్‌సీ, జేఎం సభ్యులు



నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖని పవర్ హౌస్ కాలనీలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఎన్‌హెచ్ఆర్‌సీ జేఎం సభ్యులు శుక్రవారం సందర్శించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణం, పిల్లలకు ఇస్తున్న పౌష్టిక ఆహారాల్లో ఉన్న లోపాలను గుర్తించి కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడారు. కేంద్రాల్లో పరిస్థితి ఇలాగే కొనసాగితే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఆర్‌సీ జేఎం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ మహేందర్, పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగుల కనకయ్య, జిల్లా కన్వీనర్ కడమండ శ్రీహరి, జిల్లా ఉపాధ్యక్షుడు కర్రావుల రామరాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బైరిమల్ల దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపీ, పీఎంపీల నిరసన



నవతెలంగాణ-ముత్తారం:
గత కొన్ని రోజులుగా ఐఎంఎ, టీఎంసీ అధికారులు చేస్తున్న దాడులకు నిరసనగా ముత్తారం మండలంలోని పలు గ్రామాల్లో ఆర్ఎంపీలు, పీఎంపీలు బంద్ పాటించి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. నేటి నుంచి వారం రోజుల పాటు గ్రామాల్లో బంద్ కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కార్యాచరణ చేపట్టాలని, ప్రభుత్వం చేపట్టే కక్ష సాధింపు ధోరణి విడనాడాలని, గ్రామీణ వైద్య వత్తిని ప్రోత్సాహించి ఆర్ఎంపీ, పీఎంపీలపై నిర్బంధాన్ని తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ఆర్ఎంపీలు చారి, సదానందం, స్వామి, సంపత్, లింగచారి తదితరులున్నారు.

## రైతులకు ఏఈవో సేవలు ప్రశంసనీయం

మాజీ ఎంపీటీసీ ఎడెల్లి శంకర్



నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
క్లస్టర్ పరిధిలోని గ్రామాలకు ఏఈవో శ్వేత అందించిన సేవలు ప్రశంసనీ యం అని పెద్దపల్లి మండలం కనగర్తి మాజీ ఎంపీటీసీ ఎడెల్లి శంకర్ అన్నారు. బ్రాహ్మణపల్లి వ్యవసాయ క్లస్టర్ ఏఈవోగా పని చేసి బదిలీపై వెళ్లిన శ్వేతను శుక్రవారం కనగర్తిలో ఘనంగా సన్మానించారు. విధుల పట్ల అంకితభావంతో శ్వేత పనిచేసిందని పలువురు కొనియాడారు. కార్యక్రమాల్లో అప్పన్నపేట సింగిల్ విండో డైరెక్టర్ యెల్లంకి స్వామి, ఎలుకపల్లి సతీష్, యెల్లంకి రాయమల్లు, మడుపు నరసింహారెడ్డి, కండె లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నషా ముక్త్ భారత్ అభియాన్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ -భగత్‌నగర్



వ్యసనాల కారణాలు ,దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించడం కోసం నషా ముక్త్ భారత్ అభియాన్‌ను ఈ నెల 31 శనివారం ఉదయం 10.30 గంటలకుకిమ్స్ కళాశాల, కలెక్టరేట్ వెనుక నిర్వహిస్తున్నట్టు బీ.కే విజయ తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌లోని ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. వ్యసనాలను నివారించి వాటిని అధిగమించే పద్ధతులను సూచించడం కోసం కరీంనగర్, పెద్దపల్లి, ఆసిఫాబాద్, సిరిసిల్ల, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో కుంభకర్ణ మూవింగ్ మోడల్తో ప్రచార వాహనం నిర్వహించనున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, కరీంనగర్ డీఎంహెచ్ఓ సుజాత, ఎక్సైజ్ సూపరిండెంట్, మహిళా శిశు సంక్షేమ అధికారి హాజరు కానున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో బ్రహ్మ కుమారీస్, కరీంనగర్ సంచాలకులు టి మనీషా,బి కే విజయ పాల్గొన్నారు.

9

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

కరీంనగర్

శనివారం | ఆగస్టు 31, 2024 | www.navatelangana.com

## రుణమాఫీ కాని రైతుల వివరాలు ఎంట్రీ

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మండలంలోని సైదాబాద్ గ్రామంలో రేషన్ కార్డు లేకుండా రుణమాఫీ కాని రైతుల వివరాలు ఆన్లైన్‌లో శుక్రవారం ఎంట్రీ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మీ పరిశీలించారు. త్వరగా సర్వే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్, ఏఈఓలు పాల్గొన్నారు.

## వావిలాలలో వైద్య శిబిరం



ఆయుష్ యునాని వైద్య శిబిరంలో వైద్యులు

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మండలం వావిలాలలో ప్రభుత్వ యునాని వైద్యశాల ఆధ్వర్యంలో వృద్ధులకు వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు, నడుమునొప్పి, అర్శ మొలలు మొదలగు వాటికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి జి.ప్రవీణ్ కుమార్, డాక్టర్ షబానా అజీజ్, ఫార్మాసిస్ట్ పావని, హెచ్ఈ మోహన్‌రెడ్డి, హెచ్ఎస్ సదానందం, ఎస్ఎన్ఓ సంపత్, ఏఎన్ఎం రమ, స్పెషల్ ఆఫీసర్ నవీన్, వావిలాల ఖాదీ సూపర్డెంట్ శ్రీనివాస్, మేనేజర్స్ సతీష్, సంతోష్ పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శని, ఆదివారాలు మార్కెట్‌కు సాధారణ సెలవులు కాగా సోమవారం అమావాస్య సందర్భంగా సెలవు ప్రకటించినట్లు తెలిపారు. తిరిగి సెప్టెంబర్ 3న మార్కెట్ పునః ప్రారంభం అవుతుందని తెలిపారు. కాబట్టి రైతులు ఇట్టి విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. శుక్రవారం మార్కెట్‌కు విడి పత్తి 79 క్వింటాళ్లు ఎనిమిది వాహనాలలో రైతులు విక్రయానికి తీసుకురాగా గరిష్ట ధర రూ.7,550, మోడల్ ధర 7450, కనిష్ఠ ధర 7350 పలికిందని మార్కెట్ సెక్రటరీ తెలిపారు.

## గ్రామాల్లో వైద్య శిబిరాలు




పేషెంట్‌ను పరీక్షిస్తున్న డాక్టర్

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మండలంలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అబాది జమ్మికుంటలో డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో, మడిపల్లిలో డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు శుక్రవారం నిర్వహించారు. జ్వర పీడితులను గుర్తించి, వారి రక్త నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కి పంపించినట్లు తెలిపారు. గండ్రపల్లి సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో బాలికలకు డాక్టర్ మహెూన్నత పటేల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 194మంది బాలికలకు వైద్య పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు. డాక్టర్స్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమాలలో సూపర్‌వైజర్స్ సదానందం, అరుణ, కుసుమకుమారి, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎంలు సరళ, మణెమ్మ వనజ, సంధ్య ఆశా కార్యకర్తలు, హాస్టల్ ప్రిన్సిపాల్ ఇందిరామని పాల్గొన్నారు.

## క్రీడల అభివృద్ధికి రూ.25 లక్షల విడుదల

నవతెలంగాణ-కరీంనగర్

కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ కింద 25 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 5 పనులను రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిపాదించారు. అందులో కరీంనగర్ రీజినల్ స్పోర్ట్స్ స్కూల్‌లో స్విమ్మింగ్ పూల్ రిపేర్ పనులు 5 లక్షలు, కరీంనగర్ రీజినల్ స్పోర్ట్స్ స్కూల్‌కు జిమ్ పరికరాలను అడించేజేయడం 5 లక్షలు, కరీంనగర్ రీజినల్ స్పోర్ట్స్ స్కూల్‌కి హాస్టల్ బిల్డింగ్ 5 లక్షలు, కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలకు తరగతి గదులకు ఫర్నిచర్ అందించడం 5 లక్షలు, కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలకు హాస్టల్ వసతి గృహాలకు ఫర్నిచర్ అందించడం 5 లక్షలతో ఈ పనులను కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి, నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆమోదించారు. కాగా కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి రూ.25లక్షలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఎమర్జెన్సీ సినిమాను వెంటనే బ్యాన్ చేయాలి

### సిటీ కాంగ్రెస్ అధికార ప్రతినిధి సర్దార్ దన్నసింగ్




ఫిర్యాదు చేస్తున్న సర్దార్ దన్నసింగ్

నవతెలంగాణ-కరీంనగర్

ఎంపీ కంగనా రనౌత్ దర్శకత్వం వహించి నిర్మించిన ఎమర్జెన్సీ సినిమా సిక్కుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉందని సిటీ కాంగ్రెస్ అధికార ప్రతినిధి సర్దార్ దన్నసింగ్ ఆధ్వర్యంలో ఏసీపీ నరేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దన్నసింగ్ మాట్లాడుతూ..ఈ సినిమాలో సిక్కుల చరిత్రను తప్పుగా చూపించడమే కాకుండా సిక్కులను తీవ్రవాదులుగా, విభజన వాదులుగా చూపించారన్నారు. అనేక సిక్కు వ్యతిరేక దృశ్యాలు ఉన్నాయని, వెంటనే ఈ సినిమా బ్యాన్ చేయాల్సిందిగా ఏసీపీని కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రెహమాన్, కిషన్ సింగ్, ఆమేర్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య వన భోజనాల కార్యక్రమం

నవతెలంగాణ - జమ్మికుంట

శ్రావణమాసం సందర్భంగా జమ్మికుంట పట్టణంలో సెప్టెంబర్ ఒకటవ తేదీన కాటన్ మార్కెట్ ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే వన భోజనాల కార్యక్రమానికి ప్రతి ఒక్క ఆర్యవైశ్యులు హాజరై విజయవంతం చేయాలని జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కెఆర్‌వి నరసయ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. జమ్మికుంట ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా ఎలిమిళ్ళ రాజేంద్రప్రసాద్ ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యాద సతీష్, వెనిశెట్టి ప్రకాష్, సూదం సత్యం పాల్గొన్నారు.

# పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- ప్రధానోపాధ్యాయుల సమావేశం

నవతెలంగాణ-కరీంనగర్




మాట్లాడుతున్న కలెక్టర్

ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రధానోపాధ్యాయుల సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం కోసం ప్రధానోపాధ్యాయులు ముందు నుంచే ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. సమయానికి ముందే సిలబస్ పూర్తి చేసి రివిజన్ చేయించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు ఆహ్లాదకరమైన, స్నేహపూర్వకమైన వాతావరణంలో విద్యను బోధించాలని అన్నారు. కొన్ని పాఠశాలల్లో డైనింగ్ టేబుల్‌లను ఉపయోగించడం లేదన్నారు. లైబ్రరీని స్టోర్ రూమ్‌గా మార్చారని తెలిపారు. వీటిని వెంటనే వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. జిల్లాలో 23,316 మంది విద్యార్థులకు బూట్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి ఎల్పీజి ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొంతమంది విద్యార్థులు తెలుగు సబ్జెక్టు లోను ఫెయిల్ అవుతున్నారని, మాతృభాషలో ఫెయిల్ కాకుండా చూడాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ..జిల్లా యంత్రాంగం పాఠశాలలకు ఇచ్చిన వివిధ రకాల సౌకర్యాలను తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. కనీస సౌకర్యాల సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఈఓ జనార్ధన్, ఎగ్జామినేషన్ బాధ్యులు స్వామి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పెన్షన్ విద్రోహక దినం సందర్భంగా నిరసన కార్యక్రమాలు

-టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-కరీంనగర్

పెన్షన్ విద్రోహక దినం సందర్భంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరినీ ఎంప్లాయిస్ జేఏసీ తరపున టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మెన్ దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసి సెప్టెంబర్ 1న జరిగే నిరసన కార్యక్రమాలకు తప్పకుండా ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహక దినోత్సవం సందర్భంగా నల్ల బ్యాడ్జులతో భారీ నిరసన కార్యక్రమం స్థానిక కలెక్టరేట్ ఆవరణంలో ఆదివారం ఉదయం 9:30 గంటలకు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమానికి టీఎన్జీవోల జిల్లా సంఘం నాయకులు, తాలుకా అధ్యక్ష కార్యదర్శులు, పెన్షన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, తెలంగాణ టీచర్స్ అసోసియేషన్‌కు సంబంధించిన వివిధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ సీపీఎస్ సంఘాలకు సంబంధించిన నాయకులు, సీపీఎస్ ఉద్యోగులు, జేఏసీలో భాగస్వాములైన ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సంఘాలు తప్పకుండా కార్యక్రమానికి తమ వంతు బాధ్యతగా, స్వచ్ఛందంగా హాజరుకావాలని కోరారు. ప్రభుత్వానికి తమ గోడును విన్నవించుకునే విధంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం మాజీ కార్యదర్శి ఎంఏ హమీద్, అర్బన్ అధ్యక్షులు సర్దార్ హర్మీందర్ సింగ్, రూరల్ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అంజయ్య లింగయ్య, కిషన్, రవీందర్‌రెడ్డి, రాజేశ్వరరావు, అరసవెల్లి రాజేశ్వర రావు, కరుణాకర్, జలాలుద్దీన్, వెంకటేష్, రేవంత్, జీవన్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని కాపాడాలని రిలే దీక్ష

నవతెలంగాణ - జమ్మికుంట



జమ్మికుంట పట్టణంలోని పెసర బండ 467 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సీనియర్ సామాజికవేత్త మహేందర్ నాథ్‌గౌడ్, కాంగ్రెస్ నేత అక్బర్ పాషా రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మాజీ జెడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యామ్, కాంగ్రెస్ నేత మైస మహేందర్ మద్దతు తెలిపారు. జమ్మికుంట పట్టణ నడిబొడ్డున సుమారు 10 కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతుంటే రెవెన్యూ అధికారులు కాపాడాల్సింది పోయి ప్రయివేటు వ్యక్తికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూమిని కాపాడే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

**మళ్లీ సర్వే చేయిస్తాం : ఆర్డీవో రమేష్ బాబు**

జమ్మికుంట పట్టణంలో చర్చనీయాంశంగా మారిన పెసరుబండ స్థలం ప్రభుత్వానిదే అయితే మళ్లీ సర్వే చేయిస్తామని, ఒక్క గజం ప్రభుత్వ భూమిని కూడా ప్రయివేటు వ్యక్తులకు చెందకుండా చూస్తామని అవసరమైతే మళ్లీ సర్వే చేయడానికి ఆదేశాలు జారీ చేస్తానని ఆర్డీఓ రమేష్‌బాబు తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎలాంటి ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా సీఐ వరగంటి రవి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# డెంగ్యూ పాజిటివ్ కేసుల గృహాల సందర్శన

నవతెలంగాణ-కరీంనగర్



నగరంలోని స్థానిక బుట్టి రాజారామ్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని డెంగ్యూ పాజిటివ్ కేసుల గృహాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత శుక్రవారం సందర్శించారు. డెంగ్యూ కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న ఫీవర్ కేసుల గురించి వైద్య సిబ్బంది చేయుచున్న గృహ సందర్శనలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..డ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళవారం, శుక్రవారం నీటి డ్రమ్ములు, గోళాలు పూర్తిగా ఖాళీ చేసి ఎండగట్టిన తర్వాత నీళు నింపుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిలువకుండా చూసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఉమా శ్రీరెడ్డి, సబ్ యూనిట్ అధికారి మల్లయ్య, డీపీఓ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.



అభినందిస్తున్న విద్యోదయ పాఠశాల యాజమాన్యం

## కబడ్డీ పోటీల్లో విద్యోదయ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట పట్టణంలో జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా జెడ్పిహెచ్ బాలుర పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన అండర్ 14 మండల స్థాయి కబడ్డీ పోటీల్లో పట్టణంలోని విద్యోదయ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించి, జిల్లా స్థాయికి ఎంపికయినట్టు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు టి.సాత్విక్, కె.సాత్విక్, ఎం.హేమంత్, కె.కౌశిక్, బి.లక్ష్మణ్, జె.శివకుమార్, జె.సుక్రిత్, టి.జోగిందర్, స్నేహిత్, బి.రాము, ఎం.సాకేత్‌ను విద్యోదయ హైస్కూల్ కరస్పాండెంట్ యేబూసి రామస్వామి, డైరెక్టర్‌లు యేబూసి జ్యోతి, ఆర్యన్ ఏబూసి, అకాడమిక్ డైరెక్టర్ మహాలక్ష్మి అభినందించారు.

## ఇంటింటి సర్వేలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

### బీఎల్ఓల సమావేశంలో ఆర్డీఓ రమేష్ బాబు



మాట్లాడుతున్న ఆర్డీవో రమేష్ బాబు

నవతెలంగాణ - జమ్మికుంట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేస్తున్న ఇంటింటి ఓటర్ సర్వేను బీఎల్వోలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని హుజురాబాద్ ఆర్డీఓ రమేష్ బాబు తెలిపారు. శుక్రవారం జమ్మికుంట తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓల సమావేశం ఆయన తహసీల్దార్ రమేష్ బాబుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం దగ్గర పడుతుందన్నారు. సమయం తక్కువగా ఉన్నందున ప్రతి ఇంటికి వెళ్లి పకడ్బందీగా సర్వే చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శంకర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.




ఆహారం పంపిణీ చేస్తున్న సభ్యులు

## చెర్మాల వెంకటేశ్వర్లు పుట్టిన రోజు వేడుకలు

నవతెలంగాణ - కరీంనగర్

చెర్మాల వెంకటేశ్వర్లు పుట్టినరోజు సందర్భంగా 137ఏ డిస్ట్రిక్ట్ గవర్నర్, అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఉజ్వల పార్క్ సమీపంలోని మానవికాస ప్రత్యేక పాఠశాలలో మానసిక వికలాంగులకు ప్రత్యేకంగా ఆహారం, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ చెర్మాల వెంకటేశ్వర్లు పుట్టినరోజును ఇలాంటి అర్థవంతమైన విధంగా జరపడం ఎంతో సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, ఇంజనీర్ కోలా అన్నారెడ్డి, కుమారస్వామి, గాలిపల్లి నాగేశ్వర్, చెర్మాల పల్లవి, చీకోటి శ్రీనివాస్ గాంధీ, కొంజర్ల మహేష్, పులాల శ్యామ్, ఎస్ఎల్ఎస్‌వీఎం ప్రసాద్, పండుగ నగరాజు, బొద్ల లక్ష్మీనారాయణ, సోమరపు వెంకన్న, సీపీ విజయ్, ఈడ రాజేశ్వరి, అనురాధ, వసంత, కట్‌కూరి సుధాకర్, వాసుదేవ హాస్పిటల్ సిబ్బంది, అచీవర్స్ యాక్టివ్ హైస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాణినికేతన్‌లో బాలికలకు అవగాహనా కార్యక్రమం



మాట్లాడుతున్న షీ టీమ్ సభ్యులు

నవతెలంగాణ - కరీంనగర్

నగరంలోని వాణినికేతన్ పాఠశాలలో బాలికలకు రక్షణపై షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సభ్యులు మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాలు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లను వీలైనంత వరకు ఉపయోగించకూడదన్నారు. ఉపయోగిస్తే వాటిలో ఫొటోలు పంపించకూడదని, అపరిచిత వ్యక్తుల సందేశాలకు స్పందించకూడదని సూచించారు. అలాగే బ్యాడ్‌టచ్, గుడ్ టచ్‌లను తెలిపారు. ఏ సమస్యనైనా ముందుగా తల్లిదండ్రులకు తెలపాలని, ఆ తర్వాత షీటీమ్‌కు తెలియజేయాలని సూచించారు. బాలికల వెంటే షీ-టీమ్ ఉంటుందని, ధైర్యంగా బాలికలు ముందడుగు వేయాలన్నారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, చదువుపై శ్రద్ధ వహిస్తే ఉన్నత దశకు చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, ఏఎస్ఐ విజయ, షీ టీమ్ సభ్యులు, డైరెక్టర్ రేణుక, ప్రిన్సిపాల్ కోట లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువత నైపుణ్యానికి కృషి అభినందనీయం..

### ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.సత్యనారాయణ




మాట్లాడుతున్న డాక్టర్ రావు

నవతెలంగాణ - కరీంనగర్

యువతలో నైపుణ్యానికి స్థానిక బీఎస్.రావు ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.సత్యనారాయణ కొనియాడారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాలలో గ్రంథాలయానికి రూ.25వేల విలువ చేసే వివిధ పోటీ పరీక్షల పుస్తకాలను డాక్టర్ బీఎస్.రావు కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రావు మాట్లాడుతూ.. ప్రయివేట్ రంగంలో కోట్లాది ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని, అందుకు కారణం యువతలో నైపుణ్యాలు కొరవడటమే నన్నారు. ఇంటర్ స్థాయి నుంచే అప్రెంటిస్ విధానాన్ని ప్రవేశ పెట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రాజయ్య, డాక్టర్ అలీం, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బి.శ్రీనివాస్, ఎస్సారార్ కళాశాల గ్రంథపాలకుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## సెయింట్ జార్జ్ (సీబీఎస్ఈ) విద్యార్థుల ప్రతిభ




విద్యార్థులను అభినందిస్తున్న చైర్మెన్

నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్‌లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల (సీబీఎస్ఈ)కు చెందిన ఏడుగురు విద్యార్థులు నేషనల్ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రతిభ కనబర్చినట్టు పాఠశాల చైర్మన్ పి.ఫాతిమారెడ్డి తెలిపారు. మహిమాన్విత్ (10వ తరగతి), ధృవ సునీల్ (8వ తరగతి), సాత్విక్‌రెడ్డి (10వ తరగతి), హర్షవర్ధన్ (9వ తరగతి), పార్థు కార్తికేయ (9వ తరగతి), శ్రీనాథ్, రితీష్ (8వ తరగతి) లు ఏ సైడ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రిజిస్టర్ అండర్ సొసైటీ రిజిస్ట్రేషన్ యాక్ట్ 1860 వారిచే ఢిల్లీలో డిసెంబర్ 22 నుంచి 26 వరకు నిర్వహించబడిన 2వ నేషనల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ 2024లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రికెట్ కోచ్ సాయినాథ్, విద్యార్థులను, ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు.

## చీకటి కుట్రలు చేస్తున్నాయి

- న్యాయమే అంతిమంగా గెలుస్తుంది..!
- కేసీఆర్ అంటే తెలంగాణ ఆత్మ..!
- మంత్రి కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ-కరీంనగర్



బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అంటూ కాంగ్రెస్, కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం అంటూ బీజేపీ..ఈ రెండు పార్టీలు చీకటి కుట్రలు చేస్తున్నాయని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. కేసీఆర్ దేశంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కొరకరాని కొయ్యలా ఉన్నాడని, ఈ అడ్డును తొలగించుకోవడానికి కుట్రలో భాగమే కవిత అరెస్ట్ అని, దానికి రంగులు అద్దిన కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఈడీ, సీబీఐ లేని కేసును ఉన్నట్టుగా సృష్టించి కేసీఆర్‌ని ఏమి చేయలేక కేసీఆర్‌ని ఏ విధంగానైనా అదుపులోకి తీసుకోవాలి అణగదొక్కాలని, బీఆర్ఎస్‌ని అంతం చేయాలనే ఉద్దేశ్యంతో అనేక రకరకాల ప్రయత్నం చేస్తున్న భాగమే కవిత అరెస్ట్ అని ఆరోపించారు. కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన 10 నిమిషాల్లో దీనిపై వాదనలు చేస్తున్నారని, బీఆర్ఎస్‌ని ఈ కాంగ్రెస్, బీజేపీ లు కలిపి ఏ విధంగా లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతున్నారో ఈ విషయాలను చూస్తే అర్థం అవుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఒక బలమైన శక్తి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీ 10 సంవత్సరాల అధికారంలో ఉండి అన్ని వర్గాలను ఆదుకున్న, అనేక సంక్షేమ కార్యక్రమాలను అందించి దేశానికి ఒక దిక్సూచిగా నిలిచిన పార్టీ అన్నారు. కేసీఆర్ అంటే తెలంగాణ ఆత్మ, తెలంగాణ అస్తిత్వానికి నిలువుటద్దం కేసీఆర్ అని అన్నారు. కాంగ్రెస్ నాయకులకు కవితకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, న్యాయమూర్తులు చేసిన వాక్యాలు, కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలకు చెంపపెట్టుగా భావించవచ్చని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దుయ్యబట్టారు.

## సచివాలయంలో సీఎం బిజీ బిజీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డి పలు సమీక్షలు, కార్యక్రమాలతో శుక్రవారం బిజీ బిజీగా గడిపారు. హైదరాబాద్‌లోని సచివాలయం లో ఆయన స్కిల్ యూనివర్సిటీకి సంబంధించిన ప్రాథమిక డిజైన్లను పరిశీలించారు. ఆ డిజైన్లకు ఆర్కిటెక్ట్‌లకు పలు సూచనలు చేశారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ డిజైన్ల విషయంలోనూ సీఎం పలు సూచనలు చేశారు. సూచించిన మార్పులతో వీలైనంత త్వరగా పూర్తిస్థాయి డిజైన్స్ నమూనాను రూపొందించాలని ఆదేశించారు. స్పీడ్‌పై వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. ప్రతిష్టాత్మక వరల్డ్ ఫుడ్ ఫౌండేషన్ టాప్-2024 అవార్డు గ్రహీత డాక్టర్ సమరేందు మొహంతి, ప్రొఫెసర్ జానయ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మతి భానుమూర్తి రచించిన "జయ సేనాపతి" నవలను సచివాలయంలో సీఎం ఆవిష్కరించారు. వీటితో పాటు జానపద కళాకారుడు కుమారస్వామి రచించిన 5 వేల చరణాలతో కూడిన ప్రపంచంలోనే అతిపెద్ద జానపద గీతాన్ని ముఖ్యమంత్రి పుస్తకరూపంలో విడుదల చేశారు.

**ఆలయ విస్తరణకు శృంగేరి పీఠం అనుమతి తీసుకోండి**

వేములవాడ ఆలయ విస్తరణకు పనులు ప్రారంభించాలనీ, దానికి సంబంధించి శృంగేరి పీఠం అనుమతి తీసుకోవాలని అర్చకులకు సీఎం ఎ. రేవంత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎంను వేములవాడ అర్చకులు కలిశారు. ఆయన్ను ఆశీర్వదించారు. ఆలయ విస్తరణకు రూ.50 కోట్లు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో వినోద్, స్థపతి వల్లినాయగం, ఈఈ రాజేష్, డీఈఈ రఘునందన్, ఆలయ ప్రధాన అర్చకులు ఉమేష్ శర్మ, తదితరులున్నారు. ఆలయ విస్తరణకు సంబంధించిన డిజైన్స్, నమూనాకు శృంగేరి పీఠం అనుమతి తీసుకోవాల్సి ఉందని సీఎం దృష్టికి వారు తీసుకెళ్లారు. వెంటనే ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాలని సీఎం ఆలయ అర్చకులకు సూచించారు.

**అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తాం**

అగ్రిగోల్డ్ అంశంపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి హామి ఇవ్వడం పట్ల తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ బాలమల్లేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎన్ సునీత హర్షం వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ సంస్థ ఎక్కువ లాభాలు ఇస్తామని ప్రజలను నమ్మించి డిపాజిట్లను సేకరించి మోసం చేసిందని తెలిపారు. వారికి న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి బాధితుల సంఘం ప్రతినిధుల బృందం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితులు ఐదు లక్షల మంది ఉన్నారనీ, వారి నుంచి ఆ సంస్థ రూ.500 కోట్లను సేకరించిందనీ, తిరిగి చెల్లించే సమయంలో ఆ సంస్థ చేతులెత్తేసిందని సీఎంకు బాలమల్లేష్ వివరించారు. రాష్ట్రంలో ఆ సంస్థకు దాదాపు రూ.1000 కోట్లకుపైగా ఆస్తులున్నాయనీ, వాటిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని వేలం వేసి మోసపోయిన బాధితులకు డబ్బులు చెల్లించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులతో హైపవర్ కమిటీ ఏర్పాటు చేయాలనీ, అగ్రిగోల్డ్ కంపెనీ వ్యవస్థాపక డైరెక్టర్లు, వారి కుటుంబ సభ్యుల బినామీ పేర్ల మీద ఉన్న అన్ని ఆస్తులను తక్షణమే అటాచ్ చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామని హామి ఇచ్చారని తెలిపారు.

## కరెంటు పోల్స్‌పై కేబుల్, నెట్ వైర్లు తొలగించండి



- లేకుంటే చర్యలు తప్పవ్...

:ఆపరేటర్లకు టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ హెచ్చరిక

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్లు విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేసుకున్న అనవసర కేబుల్స్, ఇతర వస్తువుల్ని తొలగించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎమ్‌డీ ముషారఫ్ ఫరూఖీ విజ్ఞప్తి చేశారు. లేకుంటే సంస్థ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలపై అడ్డదిడ్డంగా సాధారణ ప్రజలకు ప్రాణాంతకంగా మారిన కేబుల్స్‌ను తొలగించాలని జులై 27, ఆగస్టు 7, 28 తేదీల్లో సమావేశాలు నిర్వహించి కేబుల్ సంస్థలు, ఇంటర్నెట్ ప్రొవైడర్ల యాజమాన్యాలకు తెలిపామన్నారు. ఆగస్టు 7 న జరిగిన సమావేశంలో ప్రధాన రహదారుల్లో వారం లోగా, ఇతర ప్రధాన రహదారుల్లో రెండు వారాల్లోగా నిబంధనల ప్రకారం కేబుల్స్ అమర్చేలా చర్యలు తీసుకోవాలని ఆపరేటర్లకు చెప్పామన్నారు. సమావేశాల్లో అంగీకరించిన విధంగా కొంత మంది కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు కేబుల్స్‌ను తొలగిచట్లేదని శుక్రవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కరెంటు పోల్స్ మీద కెపాసిటీకి మించి కేబుల్స్, కేబుల్ బండిల్స్, వివిధ ఆకారాల్లో వున్న టెలికాం పరికరాలు వేలాడదీయడం వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి ఫలితంగా షార్ట్ సర్క్యూట్‌లు జరిగి, విద్యుత్ ప్రమాదాలు సైతం జరిగాయని వివరించారు. కరెంటు పోల్స్‌పై అదనపు భారం పడి పోల్స్ వంగిపోతున్నాయనీ, కేబుల్స్ చిందరవందరగా ఫుట్‌పాత్‌లపై పడి బాటసారులకు ఇబ్బందికరంగా, ప్రమాదంగా ఉంటున్నాయని తెలిపారు. పోల్ మొత్తం కేబుల్స్‌తో చుట్టి ఉండటంతో విద్యుత్ సిబ్బంది పోల్స్ మీద మరమ్మతులు చేపట్టడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కేబుల్, ఇంటర్నెట్ వినియోగదారులకు ఇబ్బందులు కలగొద్దనే ఉద్దేశ్యంతో ఆయా సంస్థలకు తగినంత సమయం ఇచ్చామనీ, ఇక ప్రత్యక్ష కార్యాచరణకు తామే దిగి, కేబుల్స్ తొలగిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో ప్రమాదకరంగా కరెంటు స్థంభాలకు కట్టిఉన్న కేబుల్స్‌ను విద్యుత్‌శాఖ సిబ్బంది తొలగించారు.

## జనంపై భారం లేకుండా ఆదాయం పెంచండి

### కొత్త ఆలోచనలు చేయండి

- ప్రభుత్వ శాఖల సమీక్షలో ఆర్థికశాఖ మంత్రి భట్టి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రజలపై భారం లేకుండా రాష్ట్ర ఖజానా ఆదాయం పెంచేలా కొత్త ఆలోచనలు చేయాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారుల్ని ఆదేశించారు. శుక్రవారంనాడిక్కడి బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ప్రతి నెల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆదాయం పెంపుపై జరిగే సమావేశానికి నూతన ఆలోచనలతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకొని రావాలని చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజా ప్రభుత్వంలో అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామన్నారు. ఆయా శాఖల్లో స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకొని ఫలితాలు సాధించాలన్నారు. అందరికీ ఇసుక అందుబాటులోకి తెచ్చేందుకు ప్రధాన పట్టణాలకు సమీపంలో సబ్ యార్డులు, అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మార్కెట్ యార్డుల్లో ఇసుక నిల్వలు అందుబాటులో ఉంచాలని మైనింగ్ శాఖ అధికారులకు సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ పథకంలో వేగం పెంచాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు, ఇప్పటివరకు సమకూరిన ఆదాయం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ఏ మేరకు ఆదాయం అంచనా వేయవచ్చు అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో ల్యాండ్ పూలింగ్ ప్రణాళికలు, అసైన్డ్ భూములు, కోర్టు వివాదాలను సమీక్షించారు. ల్యాండ్ పూలింగ్ విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కావొద్దన్నారు. జీఎస్టీలో లీకేజీలను అరికట్టి ఆదాయం పెంచేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, కమర్షియల్ టాక్స్ అండ్ రెవెన్యూ కమిషనర్ ఎస్ఎమ్ఏ రిజ్వీ, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్, రవాణా శాఖ కమిషనర్ బుద్ధప్రకాష్, హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి గౌతమ్, మైనింగ్ శాఖ సెక్రెటరీ సురేంద్రమోహన్, డైరెక్టర్ సుశీల్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మరింత బలోపేతంగా 'హైడ్రా'

### మరో 15రోజుల్లో పూర్తిస్థాయి సిబ్బంది

- ప్రత్యేక పోలీస్‌స్టేషన్..

రూ.200 కోట్ల నిధులు



**అక్కడ స్థలాలు కొనుగోలు చేయవద్దు**

కబ్జాలు లేని హైదరాబాద్‌ను తీర్చి దిద్దడమే లక్ష్యంగా హైడ్రా పని చేస్తోందని, చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఎవరూ స్థలాలు కొనుగోలు చేయొద్దని హైడ్రా కమిషనర్, ఐజీ రంగనాథ్ తెలిపారు. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తే హైడ్రా చర్యలు తప్పవని హెచ్చరించారు. జీహెచ్ఎంసీ పరిధిలో చెరువులు, కుంటలు అన్నీ కలిపి 400కుపైగా ఉండేవన్నరు. వాటిని కబ్జాదారులు ఆక్రమణకు గురి చేశారన్నారు. ప్లాట్లు, ఫ్లాట్లు కొనుగోలు చేసే ముందు ప్రజలు అన్ని రకాల అనుమతులను పరిశీలించి కొనుగోలు చేయాలని సూచించారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా గురించే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా జంట జలాశయాల పరిరక్షణ లక్ష్యంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చేపడుతున్న ఆపరేషన్ అక్రమార్కుల గుండెల్లో గుబులు రేపుతోంది. ఎవరేమనుకున్నా.. ఎవరు ఏ ఒత్తిడి చేసినా పట్టించుకోకుండా.. చర్యలు తీసుకోవడంతో హైడ్రాకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. ముఖ్యంగా 'ఎన్'కన్వెన్షన్ కూల్చివేత హైడ్రాకు కావల్సినంత మద్దతును కూడగట్టింది. అన్ని వర్గాల ప్రజలు దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే హైడ్రాకు మరిన్ని అధికారాలను, సిబ్బందిని ప్రభుత్వం కేటాయించనుంది. దాంతోపాటు నిధులు కేటాయించనుంది.

**ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం**

హైదరాబాద్‌లో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రాకు మరిన్ని అధికారాలను, సిబ్బందిని కేటాయించనున్నారు. ఓ.ఆర్.ఆర్ పరిధిలోని అన్ని చెరువులు, పార్కులు, నాలాలతోపాటు అన్ని ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతలను పూర్తి స్థాయిలో హైడ్రాకు అప్పగించేందుకు ప్రభుత్వం విధి విధానాలు రూపొందిస్తోంది. ఇప్పటి వరకు చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపుపై ప్రస్తుతం నీటిపారుదల శాఖ, జీహెచ్ఎంసీ, పురపాలక శాఖ, పంచాయతీరాజ్, వాల్టా తదితర విభాగాలు వేర్వేరుగా నోటీసులు జారీ చేస్తున్నాయి. ఈ క్రమం లో పలు శాఖల మధ్య సమన్వయం లోపిస్తోంది. ఈ లోపాలను నివారించేం దుకు.. ఓఆర్ఆర్ పరిధిలో అన్ని రకాల ఆక్రమణల తొలగింపులు, నోటీసుల జారీ హైడ్రా ద్వారానే చేప ట్టేందుకు విధి విధానాలు ఖరారు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. హైడ్రాకు కావాల్సిన అదనపు అధికారులు, సిబ్బందిని మరో 15రోజుల్లో ప్రభుత్వం నియమించనున్నట్టు తెలిసింది. హైడ్రా ఆధ్వర్యంలో మొత్తం 72 బృందాలు ఏర్పాటు చేశారు. అయితే, దాదాపు 3800 మంది సిబ్బంది అవసరమని హైడ్రా కమిషనర్ ఐజీ రంగనాథ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో హైడ్రాకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయడంతోపాటు, ఏసీపీ స్థాయి అధికారి, ప్రతి ఏటా హైడ్రాకు రూ.200కోట్ల మేర నిధులు కేటాయించ నుంది.

**పొలిటికల్ నుంచి సామాన్యుల వరకు**

పొలిటికల్‌గా, సామాన్యుల నుంచి హైడ్రాకు పెద్దఎత్తున మద్దతు వస్తోంది. నాలాలు, చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. హైడ్రా లాంటి వ్యవస్థను రాష్ట్ర మంతటా విస్తరించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. కొందరు నాయకులు మాత్రం హైడ్రాను కట్టడి చేయాలని, కూల్చివేతలపై అభ్యంతరాలు తెలుపుతు న్నారు. మరికొందరు ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా వ్యతిరేకిస్తున్నారు. ఆగస్టు 13న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఎంఐఎం కార్పొరేటర్లు హైడ్రా తీరుపై మేయర్, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. హైడ్రాను రద్దు చేయాలని కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని మజ్లిస్ కార్పొరేటర్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి కాటను కలిసి వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. హైడ్రా కమిషనర్ ఐజీ ఏవీ రంగనాథ్ మాత్రం ఎక్కడా 'ఒత్తిళ్లకు తలొగ్గకుండా' ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తుండటం ప్రస్తుతం సంచలనంగా మారింది.

**హైడ్రా ఆపరేషన్లలో వెలుగులోకి అక్రమాలు**

హైడ్రా ఆపరేషన్‌తో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. కొన్ని చోట్ల భవన నిర్మాణం పూర్తి కాకముందే ఓసీ సర్టిఫికెట్లను జారీ చేయడం, బఫర్ జోన్‌లో ఇరిగేషన్ ఎన్‌వోసీ లేకుం డానే అనుమతులు ఇవ్వడం లాంటివి వెలుగు చూస్తున్నా యి. ఆక్రమణలకు పాల్పడిన వారితోపాటు అధికారులకు సైతం హైడ్రా నోటీసులు జారీ చేయడం, సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నారు. ఆరుగురు అధికారులపై క్రిమినల్ కేసులు చేయాలని సైబరాబాద్ కమిషనర్‌కు హైడ్రా సిఫారసు చేసింది.

# అనుమానాస్పద స్థితిలో నర్సు మృతి

### సెవెన్‌హిల్స్ ఆస్పత్రి, పోలీస్‌స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన

- ఆస్పత్రి యాజమాని అదుపులోకి..

మరో వ్యక్తిపై కుటుంబీకుల ఫిర్యాదు



నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

ప్రయివేటు ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న నర్సు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో శుక్రవారం జరిగింది. కాగా నర్సు మృతిపట్ల కుటుంబీకులు, బంధువులు సదరు ప్రయివేటు ఆస్పత్రి ఎదుట, పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. దాంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. బీర్కూర్ మండలం బరంగెడ్గి గ్రామానికి చెందిన మమత (23) బాన్సువాడ పట్టణంలోని చైతన్య కాలనీలో అద్దెకుంటూ బాన్సువాడ సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తుంది. శుక్రవారం సాయంత్రం ఆమె అద్దె ఇంటికి ఎవరో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమెను భుజంపై వేసుకొని ప్రభుత్వ ఆస్పత్రిలో వదిలేసి వెళ్లిపోయాడు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేయగా అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మమతను ఎవరో హత్య చేసి ఆస్పత్రిలో పడేశారంటూ హత్య చేసిన వారిని వెంటనే అదుపులోకి తీసుకోవాలని బరంగెడ్గి గ్రామస్తులు భారీ ఎత్తున పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చి రాత్రి 8 గంటల వరకు ఆందోళన చేపట్టారు. నర్సు హత్య వెనుక సెవెన్ హిల్స్ ఆస్పత్రి యాజమాన్యమే బాధ్యత వహించాలంటూ వీరి కనుసైగల్లోనే హత్య జరిగిందని, ఆస్పత్రిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎల్లారెడ్డి బోధన్ వెళ్లే రహదారిపై గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. అదే విధంగా సెవెన్ హిల్స్ ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. విషయం తెలుసుకొని రాష్ట్ర ఆగ్రో సంస్థ చైర్మెన్ కాసుల బాలరాజు బాన్సువాడ పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చి ఆరా తీశారు. పోలీసు ఉన్నత అధికారులతో పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తానంటూ హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని బాన్సువాడ టౌన్ సీఐ కృష్ణ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, ఆస్పత్రి యజమాని ప్రవీణ్‌రెడ్డిని ముందస్తు చర్యగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే ప్రశాంత్ అనే యువకునిపై కుటుంబ సభ్యులు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు.

# బాలికపై లైంగికదాడి కేసులో.. నిందితుడికి జీవిత ఖైదు

- బాధిత కుటుంబానికి రూ.5లక్షల పరిహారం ఇవ్వాలని

ప్రభుత్వానికి ఆదేశం : రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు



(ఫైల్)

నవతెలంగాణ-కందుకూరు


ఓ బాలికను ప్రేమ పేరుతో వంచించి, ఆమెపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ.25వేల జరిమానాను రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. బాధితురాలికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల పరిహారం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. కందుకూరు సీఐ సీతారం తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కొన్నాయిపల్లి రెవెన్యూ పరిధిలో కొత్తకోట గ్రామానికి చెందిన నిందితుడు ఇరగదిండ్ల శివాజీ.. కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్ గ్రామ పరిధిలో కూలి పని చేస్తుండేవాడు. బాలిక కుటుంబం సైతం అక్కడే గుడిసెలు వేసుకొని పనిచేస్తుండేవారు. ఈ క్రమంలో బాలికతో పరిచయం పెంచుకున్న నిందితుడు.. ప్రేమ పేరుతో మభ్యపెట్టి దగ్గరయ్యాడు. 2017 ఫిబ్రవరి 12వ తేదీ రాత్రి బాలికను పెండ్లి పేరుతో మాయమాటలు చెప్పి సికింద్రాబాద్‌కు తీసుకువెళ్లి ఆమెపై రెండు రోజులపాటు లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో నిందితుడిపై కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో యూ/ఎస్ 363, 366, 417, 376, 493 ఐపీసీ, సెక్షన్ 3(1)(డబ్ల్యూ), ఎస్సీ, ఎస్టీ చట్టం, సెక్షన్ 4 ఆఫ్ పోక్సో చట్టం, ఎస్సీ 399/2018 లైంగికదాడి, పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. సాక్ష్యాదారాలను పరిశీలించిన రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ. 25వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు సీఐ తెలిపారు.

# బీజేపీకి జేడీయూ షాక్

### కులగణన నిర్వహించాల్సిందేనంటూ పట్టు

- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో

ప్రతిపక్షానికి జేడీయూ మద్దతు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కుల గణనపై కేంద్రంలోని అధికార బీజేపీకి ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షం జేడీయూ షాక్ ఇచ్చింది. కుల గణన నిర్వహించాల్సిందేనని పట్టు బట్టింది. పార్ల మెంటరీ కమిటీ తొలి సమావేశంలో కుల గణనపై చర్చ జరగాలన్న ప్రతిపక్ష సభ్యుల డిమాండ్‌కు జేడీయూ మద్దతు పలికింది. జనాభా గణనలో కుల గణనపై చర్చ జరగాలన్న డిమాండ్‌ను మొదట డీఎంకే ఎంపీఆర్ బాలు లేవనెత్తారని, ఆ తరువాత కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్, జేడీయూ ఎంపీ గిరిధారి యాదవ్ డిమాండ్ చేశారు. ఓబీసీ సంక్షేమానికి సంబంధించిన పార్ల మెంటరీ కమిటీ తన మొదటి సమావేశంలో రాబోయే సంవత్సరపు ఎజెండాను నిర్ణయించడంపై చర్చించింది. జేడీయూ ఎంపీ గిరిధారి యాదవ్ మద్దతు పొందిన అనేక మంది ప్రతిపక్ష సభ్యుల నుంచి డిమాండ్ చేసిన తరువాత, కమిటీ చర్చించబోయే సబ్జెక్ట్‌లలో ఒకటిగా "కుల గణన"ను ఎంచుకుంది. సమావేశంలో 30 సబ్జెక్టుల జాబితాను ప్యానెల్ ముందుంచారు. డీఎంకే ఎంపీ టీ.ఆర్ బాలు కుల గణనపై చర్చ అవసరమని లేవనెత్తారు. ఆయనకు కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ మద్దతు పలికారు. దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న జనాభా గణనకు సన్నాహకాల పరిస్థితిపై హెూం మంత్రిత్వ శాఖ నుంచి కమిటీ తప్పనిసరిగా వివరణ కోరాలని ఠాగూర్ అన్నారు. ఆయనకు టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ మద్దతు పలికారు. విజయవంతమైన గణనను నిర్వహించి, ఫలితాలను ప్రచురించిన బీహార్‌ను ఉదాహరణగా చెబుతూ, దేశవ్యాప్తంగా ఈ కసరత్తు చేయాల్సిన అవసరం ఉందని జేడీయూ ఎంపీ గిరిధారి యాదవ్ అన్నారు. సమస్యను లోతుగా మూల్యాంకనం చేయాలని ప్యానెల్‌కు ఆయన తెలిపారు.

జనాభా గణనతో పాటు కుల గణన కూడా చేయాలా వద్దా అనే అంశంపై చర్చ జరగాలని కోరారు. జనాభా గణనను చర్చించే అంశాల జాబితాలో చేర్చడానికి కమిటీ అధ్యక్షుడైన గణేష్ సింగ్ అంగీకరించినట్లు తెలిసింది. పార్లమెంటరీ కమిటీ సమావేశంలో కూడా ప్రతిపక్ష సభ్యులు ఓబీసీల కోసం జాతీయ కమిషన్‌ను కూడా చర్చా జాబితాలో సబ్జెక్ట్‌గా చేయాలని డిమాండ్ చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ నెల ప్రారంభంలో పునర్నిర్మించిన ఈ కమిటీలో 30 మంది ఎంపీలు ఉన్నారు. బీజేపీ ఎంపీ గణేష్ సింగ్ నేతృత్వంలో 2024-25 మధ్యకాలంలో చర్చించే సబ్జెక్టుల ఎంపికపై చర్చించేందుకు మొదటి సమావేశాన్ని నిర్వహించారు. నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ) ప్రభుత్వంలో బీజేపీకి జేడీయూ కీలక మిత్రపక్షం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 240 సీట్లు గెలుచుకోవడంతో సొంతంగా మెజారిటీకి దూరమైన తరువాత ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీ తన మిత్రపక్షాలపై ఆధారపడింది. బీజేపీకి 12 మంది ఎంపీలతో జేడీయూ, 16 మంది ఎంపీలతో టీడీపీ కీలక కూటమి పార్టీలుగా ఉన్నాయి. 2021లో జరగాల్సిన దశాబ్ద జనాభా గణన ఆలస్యమైంది. ఎప్పుడు నిర్వహించాలనే దానిపై కేంద్ర ప్రభుత్వం ఇంకా ఒక స్పష్టతకు రాలేదు. కుల కాలమ్‌ను చేర్చడానికి డేటా సేకరణను విస్తరించడానికి చురుకైన చర్చలు జరుగుతున్నాయి. బీహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్‌తో పొత్తులో ఉన్న జేడీయూ రాష్ట్రంలో కులాల సర్వే నిర్వహించింది. ఎన్‌డీఏలో తిరిగి చేరినప్పటికీ సామాజిక న్యాయం అంశమైన దేశవ్యాప్త కుల గణన డిమాండ్ నుంచి వెనక్కి తగ్గబోమని జేడీయూ పునరుద్ఘాటించింది. తొలి నుంచి కుల గణనను ప్రతిపక్ష ఇండియా బ్లాక్ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కూడా లేవనెత్తాయి. గత నెలలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన ప్రసంగంలో డిమాండ్‌ను పునరుద్ఘాటించారు.



## శ్రీపతి ల్యాబ్ ఫార్మా కంపెనీలో గ్యాస్ లీకేజీ

- పెద్దఎత్తున మంటలు

నవతెలంగాణ-చిట్యాల

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో గల శ్రీపతి ల్యాబ్ ఫార్మా కంపెనీలో శుక్రవారం ఉదయం రియాక్టర్ నుంచి గ్యాస్ లీకేజీ జరిగి పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. వెంటనే అక్కడ పనిచేస్తున్న కార్మికులు బయటకు పరుగులు తీయడంతో ప్రాణనష్టం తప్పింది. ఘటనపై సకాలంలో స్పందించిన చిట్యాల పోలీసులు ప్రమాద తీవ్రత పెరగకుండా చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చింది. గతంలో కూడా ఈ కంపెనీలో ప్రమాదాలు జరిగాయని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కంపెనీ నుంచి వెలువడే కాలుష్యం వల్ల పంట పొలాలకు నష్టం వాటిల్లుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ లీకేజీతో వచ్చిన మంటలతో దట్టమైన పొగ కమ్ముకోవడంతో తాము భయాందోళన చెందామన్నారు. కంపెనీపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. సంఘటనా స్థలాన్ని నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు, చిట్యాల ఎస్ఐ ఎన్.ధర్మ, నార్కట్‌పల్లి ఎస్ఐ శివ పరిశీలించారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు.. 'ఎయిర్ బస్ బెలుగా' విమానం





నవతెలంగాణ-శంషాబాద్

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం భారీ విమానం దిగింది. మస్కట్ అంతర్జాతీయ విమానాశ్రయం ఎయిర్ బస్ ఎ 300-608 ఎస్‌టీడీ వేల్ ఆఫ్ స్కై (ఆకాశయాన తిమింగలం) థాయిలాండ్‌లో గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు బయలుదేరి మధ్యరాత్రి 12.17 గంటలకు శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండయింది. హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు ఇంత పెద్ద భారీ విమానం రావడం ఇది మూడోసారి. డిసెంబర్ 2022, ఆగస్టు 2023లో హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చింది. మళ్లీ ఇప్పుడు మరో విమానం వచ్చింది. 56.16 మీటర్ల పొడవు, ఎత్తు 17.25 మీటర్లు, రెక్కల పొడవు 44.84 మీటర్లు, వెడల్పు 7.7 మీటర్లు, బరువు 40 టన్నులు, 1650 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయగలదని యాజమాన్యం తెలిపింది.

## జూరాల 42 గేట్లు ఎత్తివేత

- కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి
- పెరుగుతున్న వరద ప్రవాహం



నవతెలంగాణ -ధరూరు

ప్రియదర్శని జూరాల ప్రాజెక్టుకు అల్మట్టి, నారాయణ పూర్ డ్యాంల భారీగా వరద వస్తోంది. జూరాలకు ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో 3లక్షల 20 వేల క్యూసెక్కు లు వస్తుండటంతో ప్రాజెక్టు 42 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. 3లక్షల 10 వేల 453 క్యూసెక్కుల నీటిని జలాశయంలోనికి వదులుతున్నట్టు పీజేపీ అధికారులు తెలిపారు. జల విద్యుత్ కేంద్రం ద్వారా 5 యూనిట్ల నుంచి 19వేల 580 క్యూసెక్కులను వదులుతున్నారు. నెట్టెంపాడుకు 750, కోయిలసాగర్ 613, బీమా2 లిఫ్టు 750, లెఫ్ట్ కెనాల్‌కు 820, కుడి కెనాల్‌కు 620 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు.

## రెడ్కో బాధ్యతలు స్వీకరించిన వీ అనీల



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రెనెవెబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీరెడ్కో) వైస్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా (వీసీఎమ్‌డీ)గా వావిళ్ల అనీల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లోని ప్రధాన కార్యాలయంలో పూర్వ వీసీఎమ్‌డీ కే జానయ్య ఆమెకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించగానే ఆమె మర్యాదపూర్వకంగా తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎమ్‌డీ ముషారఫ్ ఫరూఖీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన అనీలకు శుభాకాంక్షలు తెలిపారు. తన బాధ్యతల నిర్వహణకు డిస్కం నుంచి సహాయ సహకారాలు కావాలని ఈ సందర్భంగా ఆమె సీఎమ్‌డీని కోరారు. దానికాయన సానుకూలంగా స్పందించారు.

## మిక్సీని ఇలా వాడుదాం...

ఉదయం చట్నీ చేయటం మొదలు... గ్రేవీ మసాలా వరకూ ప్రతి ఒక్క అవసరానికి మిక్సీని వాడతాం. మిక్సీ లేనిదే పని అవ్వదనే పరిస్థితి వచ్చింది. మరి అలాంటి వస్తువుని జాగ్రత్తగా వాడాలంటే ఏమేం టిప్స్ పాలో అవ్వాలో చూద్దాం.

**మెల్లిగా..**

మిక్సీ వాడేటప్పుడు ఒకేసారి దాని స్పీడ్ పెంచొద్దు. ఫస్ట్ మోడ్‌లో పెట్టి కాసేపయ్యాక సెకండ్ మోడ్‌లోకి వెళ్ళాలి. మరీ అవసరం అనుకుంటే లాస్ట్ మోడ్ వరకూ వెళ్ళండి.

**రెగ్యులర్‌గా క్లీనింగ్..**

రెండు వారాలకొకసారైనా సబ్బునీటితో క్లీన్ చేయాలి. టూత్ బ్రష్‌తో కింద భాగంలోనూ శుభ్రం చేసుకోవాలి. క్లీన్ చేసేటప్పుడు తడి లేకుండా చూసుకోండి.

**జార్స్ పెట్టేటప్పుడు..**

అదే విధంగా జార్స్ ఎలా పడితే అలా పెట్టి మిక్సీ ఆన్ చేయొద్దు..




జార్ పూర్తిగా సెట్ అయ్యాకనే మిక్సీ ఆన్ చేయాలి. అదే విధంగా, ఏవైనా మిక్సీ పట్టాక అందులో వాటర్ వేసి మిక్సీ చేయండి. పొడులని మిక్సీ చేసేటప్పుడు దాన్ని ఆపి ఆపి పొడి చేసుకోవటం మంచిది.

**సగం పరిమాణంలో..**

జార్‌ను పూర్తిగా నింపేయొద్దు. దీని వల్ల మిక్సీ త్వరగా పాడవుతుంది. పదార్థాలు కూడా మెత్తగా అవ్వవు. అందుకే, ఓవర్‌లోడ్ వద్దు. దీంతో పాటు మిక్సీ రన్ అవుతుండగా మూత తీసి చూడడం వంటివి చేయొద్దు. ■

# నిజం దాచిపెట్టి....

**పెండ్లి అంటే రెండు శరీరాలు ఒకే ప్రాణంగా మారడం. పెండ్లి తర్వాత భార్యా, భర్తలు అన్యోన్యంగా కలిసి జీవించాలని కోరుకుంటారు. ఎంత ప్రేమగా ఉన్నా చిన్నచిన్న గొడవలు, మనస్పర్థలు సహజం. ఇలాంటివి ఎన్ని వచ్చినా ఒకరినొకరు అర్థం చేసుకొని కలిసి జీవించేలా చేసేదే పెండ్లి. అయితే కొంత మంది చిన్న విషయాలకే విడిపోవాలని చూస్తుంటారు. ఇంకొందరు ఎంత పెద్ద సమస్య వచ్చినా విడిపోకుండా అలా భరిస్తూ ఉంటున్నారు. ఆ బంధం నుండి బయటకు రావడానికి ఇష్టపడరు. అలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్...**



ఐద్వా అదాలత్
సెల్: 9490098024

పవిత్రకు 26 ఏండ్లు, రఘుకు 28 ఏండ్లు. ఇద్దరికీ పెండ్లి జరిగి ఆరు నెలలు అవుతుంది. రఘు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. పవిత్ర కూడా ఇక్కడ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. ఇద్దరి జోడీ బాగుంటుందని పెద్దలు మాట్లాడుకొని సంబంధం కుదిర్చారు. పెండ్లికి ముందు ఆరు నెలల వరకు ఇద్దరూ ఫోన్లో మాట్లాడుకున్నారు. ఒకరి గురించి ఒకరు తెలుసుకున్నారు. పెద్దల సమక్షంలో పెండ్లి చేసుకున్నారు. రఘుకు కట్నంగా 25 లక్షల రూపాయలు, 32 తులాల బంగారం, రెండు కిలోల వెండి ఇచ్చారు. పెండ్లి తర్వాత ఇరు కుటుంబ సభ్యులు కలిసి తీర్థయాత్రలు కూడా చేశారు. అయితే రఘు, పవిత్రకు జరగాల్సిన మొదటి రాత్రిని మాత్రం మూహుర్తాలు బాగోలేదని నెల రోజులు గడిపేశారు.

> **పెండ్లికి ముందు ఆరు నెలల వరకు ఇద్దరూ ఫోన్లో మాట్లాడుకున్నారు. ఒకరి గురించి ఒకరు తెలుసుకున్నారు. పెద్దల సమక్షంలో పెండ్లి చేసుకున్నారు. రఘుకు కట్నంగా 25 లక్షల రూపాయలు, 32 తులాల బంగారం, రెండు కిలోల వెండి ఇచ్చారు. పెండ్లి తర్వాత ఇరు కుటుంబ సభ్యులు కలిసి తీర్థయాత్రలు కూడా చేశారు. అయితే రఘు, పవిత్రకు జరగాల్సిన మొదటి రాత్రిని మాత్రం మూహుర్తాలు బాగోలేదని నెల రోజులు గడిపేశారు.**

చివరకు పవిత్ర ఇంట్లో వాళ్లే ముహూర్తం చూసి కార్యక్రమం జరపడానికి ఏర్పాట్లు చేశారు. కానీ రఘు ఇష్టపడలేదు. కొత్త కదా కంగారు పడుతున్నాడని కాస్త సమయం ఇద్దామనుకున్నారు. ఈలోపు పవిత్రకు వీసా రెడీ అయ్యింది. ఇద్దరూ కలిసి అమెరికా వెళ్ళిపోయారు. అక్కడ కూడా రఘు, పవిత్రను దూరం పెట్టేవాడు. దాంతో పవిత్రకు అనుమానం వచ్చింది. 'మీరు నన్నెందుకు దూరం పెడుతున్నారు. నేనంటే ఇష్టం లేకపోతే చెప్పొచ్చు కదా! లేదా ఇంకేదైనా సమస్య ఉన్నా చెప్పండి, డాక్టర్ సలహా తీసుకుందాం' అని ప్రేమగా అడిగింది.

దానికి అతను 'నువ్వంటే నాకు చాలా ఇష్టం. కానీ ఎందుకో చాలా భయంగా ఉంది. అందుకే ఏడాది నుండి మందులు వాడుతున్నాను' అన్నాడు. 'మనం వేరే డాక్టర్ దగ్గరకు వెళదాం. మీకు ఏదైనా సమస్య ఉంటే డాక్టర్ మందులతో పాటు కౌన్సెలింగ్ కూడా ఇస్తారు' అని చెప్పి రఘును డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాలనుకుంది. కానీ అతను రాలేదు. ఇద్దరూ అక్కడ ఉన్న తమ స్నేహితుల ఇండ్లకు వెళ్లేవారు. పవిత్ర ఫ్రెండ్ ఒకరు ఇద్దరూ దూరంగా ఉండటం గమనించి అనుమానంగా అడిగింది. పవిత్ర ఆమెకు విషయం చెప్పింది. ఆమె కూడా తనకు తెలిసిన డాక్టర్ గురించి చెప్పి వెళ్ళి కలవమని సలహా ఇచ్చింది. కానీ పవిత్ర ఈ విషయం గురించి రఘుతో మాట్లాడలేదు. కానీ ఇంటికి తిరిగి వచ్చినప్పటి నుండి రఘు ప్రవర్తనలో మార్పు వచ్చింది.

ప్రతి చిన్న విషయానికి విసుక్కోవడం, గొడవ చేయడం మొదలుపెట్టాడు. కొన్ని రోజులకు పవిత్రపై చేయిచేసుకునే వరకు వెళ్లాడు. ఇండియా నుండి రఘు కుటుంబ సభ్యులు ఫోన్ చేసి పవిత్రను తిట్టేవారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో ఆమెకు అర్థం కాలేదు. జాబ్‌పైన కూడా సరిగ్గా దృష్టి పెట్టలేకపోయింది.

తిరిగి ఇండియా వచ్చేద్దామంటే పెండ్లి తర్వాత ఇలా భర్త నుండి విడిపోవడం ఎందుకని ఆలోచించింది. చివరకు రెండు కుటుంబాల మధ్య కూడా గొడవలు మొదలయ్యాయి. దాంతో పవిత్రను ఆమె తల్లిదండ్రులు అమెరికాలో ఉండే వాళ్ల బంధువుల ఇంటికి పంపించారు. చివరకు అసలు సమస్య ఏంటని తెలుసుకుంటే రఘు సంసార జీవితానికి పనికి రాడని తెలిసింది. డాక్టర్‌కు చూపించినా ఉపయోగం లేదు. పెండ్లికి ఏడాది ముందు నుండే అతను మందులు వాడుతున్నాడు. తనలోని సమస్యలను దాచడం కోసం పవిత్రను హింసించడం మొదలుపెట్టాడు.

ఈ విషయాలన్నీ పవిత్రకు తెలియడంతో 'నేను పెండ్లి చేసుకోనంటే మా ఇంట్లో వాళ్లు బలవంతంగా చేశారు. ఈ విషయం బయట ఎవరికైనా చెబితే చంపేస్తాను' అని పవిత్రను బెదిరించాడు. ఇక విషయం తెలుసుకున్న పవిత్ర బంధువులు ఆమెను ఇండియా పంపించేశారు. ఆమె ఇండియాకు వచ్చి రెండు నెలలైనా రఘు నుండి కానీ, వారి కుటుంబం నుండి కానీ ఆమెకు ఎవ్వరూ ఫోన్ చేయలేదు. వీళ్లు వెళ్లినా రానీయడం లేదు. 'అమెరికాలో మా కొడుకును బాగా ఇబ్బంది పెట్టావు, ఏ మోహం పెట్టుకొని మా ఇంటికి వచ్చావు' అని గొడవ చేశారు. రఘుకు ఫోన్ చేసినా తియ్యడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో అర్థం కాక ఆమె ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది.

> **ప్రతి చిన్న విషయానికి విసుక్కోవడం, గొడవ చేయడం మొదలుపెట్టాడు. కొన్ని రోజులకు పవిత్రపై చేయిచేసుకునే వరకు వెళ్లాడు. ఇండియా నుండి రఘు కుటుంబ సభ్యులు ఫోన్ చేసి పవిత్రను తిట్టేవారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో ఆమెకు అర్థం కాలేదు. జాబ్‌పైన కూడా సరిగ్గా దృష్టి పెట్టలేకపోయింది.**

మేము రఘు కుటుంబ సభ్యులకు లెటర్ పంపించినా రాలేదు. పైగా అడ్వకేట్‌తో మాకు సమాధానం పంపించారు. ఫోన్ చేస్తే 'మా అబ్బాయి తప్పేం లేదు. పవిత్రకే ఏ పనీ చేయడం రాదు. వాళ్ల అమ్మానాన్న ఆమెకు ఏమీ నేర్పలేదు. ఎప్పుడూ ఆమెను బయట తిప్పాలంటది. మేము మా అబ్బాయితో మాట్లాడినా ఒప్పుకోదు. గొడవ పెట్టుకుంటది. భరించలేకే రఘు ఆమెను ఇండియా పంపించేశాడు. ఇక ఆమెతో మాకు ఎలాంటి సబంధం లేదు. ఐదు లక్షలు ఇస్తాము. రఘును వదిలి వెళ్లిపొమ్మనండి' అంది వాళ్ల అమ్మ.

దానికి మేము 'పెండ్లి జరిగి ఆరు నెలలే అవుతుంది. అప్పుడే విడాకులేంటి. ముందు ఆఫీసుకు రండి కూర్చొని మాట్లాడుకుందాం' అన్నాం. దానికి ఆమె 'మేము రాము. ఐదు లక్షలు ఇస్తామంటున్నాము కదా తీసుకొని వెళ్లమనండి' అంది. దాంతో మేము రఘుకు ఫోన్ చేస్తే తప్పంతా పవిత్రదే అన్నట్టు చెప్పాడు. అతనిలో ఉన్న లోపం గురించి మాట్లాడితే 'అందుకే కదా ఐదు లక్షలు ఇస్తామంటున్నాము' అని తల్లీలాగే కొడుకూ మాట్లాడాడు.

కానీ పవిత్రకు రఘును వదులుకోవడం ఇష్టం లేదు. 'పెండ్లిలో రఘుకు 25 లక్షల కట్నం, బంగారం, వెండి ఇచ్చాం. ఇందులో పది తులాల బంగారం, రెండు కిలోల వెండి వారి దగ్గరే ఉంది. పెండ్లి ఖర్చు దాదాపు 11 లక్షలు అయ్యింది. మాతో ఇంత ఖర్చు పెట్టించారు. ఇప్పుడు ఐదు లక్షలు ఇచ్చి పొమ్మంటున్నారు. అతన్ని ఇండియాకు పిలిపించి డాక్టర్‌తో ట్రీట్‌మెంట్ చేయిస్తే బాగుంటుంది. అంతే కానీ నేను విడాకులు ఇవ్వను' అంది.

'ఎన్ని మందులు వాడినా అతను సంసారానికి పనికి రాడని డాక్టర్లు చెప్పారు. పైగా అతనేమైనా నిజాయితీ పరుడా అంటే అదీ లేదు. తన తప్పు కప్పిపుచ్చుకోడానికి నిన్ను హింసించాడు. అలాంటి వ్యక్తితో జీవితాంతం నువ్వు ఎలా ఉంటావు' అని అడిగాము. దానికి ఆమె ఇప్పుడు నన్నేం చేయమంటారో మీరే చెప్పండి' అంది.

'రఘు అమెరికాలో డాక్టర్ల దగ్గర చూపించుకొని చికిత్స తీసుకుంటున్నట్టు ఏమైనా ఆధారాలు ఉన్నాయా' అని అడిగాము. ఆమె దగ్గర ఉన్న ఆధారాలు చూపించింది. వాటితో రఘుపైన, వారి కుటుంబ సభ్యులపై కేసు పెట్టించాము. ఇప్పుడు వాళ్లు కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. లాయర్ సహాయంతో కోర్టు ద్వారా పవిత్రకు రావల్సిన కట్నం డబ్బు, బంగారం, వెండితో పాటు నష్టపరిహారం కూడా ఇప్పించే ప్రయత్నం చేస్తున్నాం. పవిత్రకు మళ్లీ కొత్త జీవితం మొదలపెట్టమని కౌన్సిలింగ్ ఇస్తున్నాము.

**- వై వరలక్ష్మి**
9948794051

---

## సింగరేణిలో 2364 మంది
# బదిలీ వర్కర్ల క్రమబద్ధీకరణ



**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న 2,364 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తున్నట్టు ఆ సంస్థ సీఎమ్‌డీ ఎన్ బలరామ్ తెలిపారు. వీరిలో 243 మంది మహిళలు కూడా ఉన్నారు. సంస్థలో చేరినప్పటి నుంచి క్యాలెండర్ ఏడాదిలో భూగర్భ గనుల్లో 190 రోజులు, ఉపరితల గనులు, విభాగాల్లో 240 రోజులు విధులు నిర్వహించిన వారి సర్వీసును క్రమబద్ధీకరిస్తున్నట్టు తెలిపారు. దీనిపై త్వరలో ఉత్తర్వులు జారీ చేయాలని శుక్రవారం డైరెక్టర్(పర్సనల్)కు ఆదేశాలు జారీ చేశారు. 2024 సెప్టెంబరు ఒకటి నుంచి వీరిని జనరల్ మజ్దూర్లుగా గుర్తించబోతున్నామని చెప్పారు. సింగరేణిలో కారుణ్య, డిపెండెంట్ ఉద్యోగ నియామక ప్రక్రియలో భాగంగా సంస్థలో చేరిన వారిని తొలుత బదిలీ వర్కర్లుగా నియమిస్తారు. ఏడాది కాలం పనిచేసిన తర్వాత కనీస మస్టర్లు పూర్తి చేస్తే, జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరించి, శాశ్వత ఉద్యోగులుగా గురిస్తారు. ఉన్నత విద్యార్హతలు కలిగిన వారు కంపెనీలో ఇంటర్నల్ ఉద్యోగాల ద్వారా పదోన్నతులు పొందడానికి అర్హత లభిస్తుంది. అలాగే క్వార్టర్ల కేటాయింపులో ప్రాధాన్యత ఉంటుంది. కొత్తగా రెగ్యులర్ అయిన ఉద్యోగులు క్రమశిక్షణతో పనిచేయాలని సీఎమ్‌డీ బలరామ్ కోరారు. డ్యూటీలకు గైర్హాజరు కావొద్దని, సమయ పాలన పాటిస్తూ విధులు నిర్వర్తించాలని చెప్పారు. ఈ ఏడాదిలో వెయ్యికి పైగా ఇంటర్నల్ ఉద్యోగాలను భర్తీ చేయబోతున్నామనీ, అర్హులైన వారు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి అన్ని అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు.

**క్రమబద్ధీకరణ ఇలా...**

కంపెనీ వ్యాప్తంగా కార్పొరేట్ ఏరియాలో 25 మంది, కొత్తగూడెంలో 17, ఇల్లందులో తొమ్మిది, మణుగూరులో 21, భూపాలపల్లిలో 476, రామగుండం-1 ఏరియాలో 563, రామగుండం-2 ఏరియాలో 50, రామగుండం-3, ఆండ్రియాల ప్రాజెక్టు ఏరియాలో 240, శ్రీరాంపూర్ ఏరియాలో 655 మంది, మందమర్రి ఏరియాలో 299, బెల్లంపల్లిలో తొమ్మిది మందిని రెగ్యులర్ చేస్తున్నారు.

# జీడీపీ మందగమనమే

(మొదటిపేజీ తరువాయి)

కలిగిస్తోంది.జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ 7.1 శాతం పెరగొచ్చని ఇటీవలే ఆర్‌బీఐ అంచనా వేసింది. 2024-25లో స్థూలంగా 7.2 శాతంగా ఉండొచ్చని తెలిపింది. దీనికి భిన్నంగా కేంద్ర గణంకాల మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీసు (ఎన్ఎస్ఓ) ఫలితాలను వెల్లడించడం విశేషం. ఒక ఏడాదిలో దేశంలో ఉత్పత్తి అయిన సరకులు, సేవల మొత్తం విలువను జీడీపీగా పేర్కొంటారు. ఇది ఆర్థిక వ్యవస్థ పనితీరును తెలుపుతోంది. జీడీపీ పడిపోతుందంటే దేశంలో ఆర్థిక కార్యకలాపాలు సన్నగిల్లుతున్నాయని అర్థం.

ఎన్ఎస్ఓ గణంకాల ప్రకారం.. గడిచిన క్యూ1లో వ్యవసాయ రంగం వృద్ధి ఏకంగా 2 శాతానికి పడిపోవడం చాలా ఆందోళకర అంశం. ఈ రంగం 2023-24 ఇదే త్రైమాసికంలో 3.7 శాతం వృద్ధిని కనబర్చింది. ఇదే సమయంలో ఆర్థిక సేవలు, రియల్ ఎస్టేట్, ప్రొఫెషనరల్ సర్వీసెస్ రంగాలు 12.6 శాతం వృద్ధిని కనబర్చగా.. గడిచిన క్యూ1లో 7.1 శాతానికి మందగించాయి. తయారీ రంగంలో మాత్రం 7 శాతం పెరుగుదల ఉంది. విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సర్వీసెస్ రంగాలు 10.4 శాతం పెరిగాయి. ఈ రంగాలు గతేడాది ఇదే జూన్ త్రైమాసికంలో 3.2 శాతం మాత్రమే వృద్ధిని కలిగి ఉన్నాయి. వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్స్ అండ్ సర్వీసెస్ విభాగాల వృద్ధి ఏకంగా 5.7 శాతానికి మందగించింది. ఈ రంగం గతేడాది ఏకంగా 9.7 శాతం వృద్ధిని నమోదు చేసింది.

# 'శిఖం'..ఖతం

(మొదటిపేజీ తరువాయి)

ఐదుగురు ఆక్రమించిన విషయాన్ని రిపోర్టులో చూపారు. కానీ బల్లేపల్లి రాయని చెరువు, ధంసలాపురం పెద్దచెరువు, మల్లెమడుగు ఊర చెరువులో ఆక్రమణలు లేనట్టు పేర్కొనటం ఆశ్చర్యం గొల్పుతోంది. కొన్ని చెరువుల ఆక్రమణ విషయంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగం సహకారం తీసుకోవడం, పోలీసుల సహాయంతో కబ్జాలపై విచారణ సాగుతున్నా కొన్నింటి విషయంలో రిపోర్టులో స్పష్టత కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి.

**విచ్చలవిడి ఆక్రమణలు.. అడ్డగోలు ఎన్‌వోసీలు**

చెరువు శిఖాలు విచ్చలవిడి ఆక్రమణలకు గురవుతున్నా చర్యలు లేకపోగా.. డబ్బులు తీసుకొని ఇరిగేషన్ డిపార్టుమెంట్ నుంచి నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్లు (ఎన్‌వోసీ) ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డీటీసీపీ లేఅవుట్లు వచ్చాక అడ్డగోలు ఎన్‌వోసీలు కొంత మేర తగ్గినా.. ఇప్పటికీ కొందరు నీటిపారుదలశాఖ అధికారులకు ఇదో ప్రధాన ఆదాయ వనరుగా ఉందనే చర్చ సాగుతోంది. కొందరు నీటిపారుదలశాఖ ఇంజినీర్లు నిజాయితీగా వ్యవహరిస్తున్నా రాజకీయ, ఇతరత్రా ఒత్తిడులకు తలొగ్గి కబ్జా భూములకు సైతం ఎన్‌వోసీ ఇవ్వాల్సి వస్తోంది. కొన్నిచోట్ల ఇరిగేషన్ ఇంజినీర్ల సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ ఎన్‌వోసీలు సృష్టిస్తున్న ఉదంతాలు ఉన్నాయి.

**ఆక్రమిత భూములకూ పాస్‌పుస్తకాలు..**

ఆక్రమిత భూములకూ పాస్‌పుస్తకాలు వస్తున్నాయి. దీనికి ఏక్ ఫసల్ పట్టా దోహదపడుతోంది. దీన్ని ఆధారం చేసుకొని పలుచోట్ల శిఖాలను ఖతం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. రాష్ట్రంలో వివిధ రకాల నీటి వనరులు 46వేల వరకు ఉండగా వాటిలో 43,412 చెరువులు, కుంటల కింద 21 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. రైతులకు రుణసౌకర్యం కల్పించేందుకు ఏక్ ఫసల్ పట్టాలను రెవెన్యూశాఖ జారీ చేసింది. కొన్నిచోట్ల వీటిని కొందరు శాశ్వత పట్టాలుగా మలుచుకున్నారు. ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో ఏక్ ఫసల్ పట్టాలు కాస్త శాశ్వత పట్టాగా మారాయి.

**హైదరాబాద్‌లో 25 చెరువుల దత్తత**

హైదరాబాద్‌లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్ఆర్) కింద 25 చెరువులను అభివృద్ధి చేసే క్రమంలో బడా కంపెనీలకు గత ప్రభుత్వం దత్తత ఇచ్చింది. దానివల్ల చెరువుల అభివృద్ధి జరగలేదని తెలుస్తోంది. జీహెచ్ఎంసీకీ ఆదాయం లేదు. ఆ కంపెనీలు మాత్రం కోట్లకు పడగనెత్తాయని ప్రభుత్వం దృష్టికి వచ్చినట్టు తెలుస్తోంది.

**ధరణి నిషేధిత జాబితాతోనే పరిష్కారం..**

శిఖం భూమికి పట్టా జారీ అయ్యాక ధరణి పోర్టల్‌లోనూ నమోదు చేస్తున్నారు. దీనివల్ల ఆ భూముల క్రయవిక్రయాలకు అవకాశం ఏర్పడుతోంది. చెరువులకు సంబంధించిన సర్వే నంబర్లు, ఉప సర్వే నంబర్లు నిషేధిత జాబితా (22ఏ)లో చేర్చడమే దీనికి పరిష్కారమని నిపుణులు సూచిస్తున్నారు. ఇరిగేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ద్వారా ఆదేశాలు రావడంతో శిఖం భూముల వివరాలను తేల్చే పనిలో ఆ శాఖ ఇంజినీర్లు తలమునకలయ్యారు. కానీ రెవెన్యూశాఖ సహాయం ఉంటేనే కార్యాచరణ పూర్తవుతుందనే అభిప్రాయం వెలువడుతోంది.

# అసమానతలు లేని రాజ్యం కోసం పోరాడాలి

(మొదటిపేజీ తరువాయి)



పిలాయిపల్లి గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు కళ్లెం వీరారెడ్డి స్మారక భవనం సీపీఐ(ఎం) కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో తమ్మినేని ప్రసంగిస్తూ.. అధికారంలో ఉన్నా లేకున్నా పేదల కోసం నిరంతరం పోరాటం చేసేదే కమ్యూనిస్టులని స్పష్టం చేశారు. వీరారెడ్డి ఆనాడు పీడితవర్గ ప్రజల కోసం నిరంతరం పోరాడారని చెప్పారు. పాలకులు ప్రజలకు విద్య, వైద్యం సరిగా అందివ్వకపోవడంతో అనేక మంది పేదలు కార్పొరేట్ విద్య, వైద్యం పొందలేకపోతున్నారని అన్నారు. అటు విద్యకు దూరమవుతూ.. ఇటు వైద్యం అందక ప్రాణం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రజెండా నీడన పరిపాలన జరుగుతున్న దేశాల్లో విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యాన్ని ప్రజలకు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేట్‌పరం చేస్తూ.. లాభాలు వచ్చే రంగాలను కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా అప్పజెప్పు నిరుద్యోగుల పొట్టలు కొడుతోందని అన్నారు. ప్రజల బతుకుల్లో కులం, మతం పేరుతో చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. గత ప్రభుత్వం పేదలకు, దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేస్తామని చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆక్రమణకు గురైన భూములను హైడ్రా పేరుతో తిరిగి తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇక్కడితోనే ఆగకుండా ఎక్కడ ప్రభుత్వ భూములు ఉన్నా వాటిని సంరక్షించి భూమిలేని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అనుసరించే విధానాల్లో లోపాలుంటే ఎత్తిచూపుతామన్నారు.

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. కళ్లెం వీరారెడ్డి స్ఫూర్తిని ఈనాటి యువతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. గ్రామంలో భూమిలేని పేదలందరికీ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆనాడు 250 ఎకరాలకు పైగా భూములను పంపిణీ చేశారని గుర్తు చేశారు. పార్టీ యాదాద్రిభువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు గూడూరు బుచ్చిరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు జంగారెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి పాండు, మేక అశోకొరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, గడ్డం వెంకటేష్, బొడ్డుపల్లి వెంకటేష్, వనం ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నైట్ షిఫ్టా..వామ్మో..

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. వీరిలో 17.05 శాతం మంది 'చాలా అభద్రతగా', 27.4 శాతం మంది 'అభద్రత'గా (మొత్తంగా 44.5 శాతం మంది) ఉన్నట్టు చెప్పారు. అయితే, ప్రయివేటు వైద్యులు, సిబ్బంది విషయంలో ఇది భిన్నంగా ఉన్నది. వారిలో అభద్రతా భావన తక్కువగా ఉన్నది. కేవలం 5.52 శాతం మంది మాత్రమే అభద్రతగా భావిస్తున్నామని చెప్పగా.. చాలా అభద్రతగా ఉన్నామని 12.2 శాతం మంది (మొత్తంగా 17.5 శాతం మంది) చెప్పారు.ప్రయివేటు వైద్య సిబ్బందిలో 28.04 మంది భద్రతగా ఉన్నామని భావిస్తున్నారు. ఇది ప్రభుత్వాస్పత్రుల్లో 8.71 శాతంగానే ఉండటం గమనార్హం. 10.22 శాతం మంది ప్రయివేటు వైద్య సిబ్బంది మరింత భద్రతను కలిగి ఉన్నామని చెప్పగా.. ప్రభుత్వ వైద్య సిబ్బంది విషయంలో ఇది 1.89 శాతంగానే ఉండటం గమనార్హం. మొత్తంగా, 38.3 శాతం మంది ప్రయివేటు సెక్టార్ వైద్య సిబ్బంది భద్రతగా ఉన్నామని చెప్పగా.. ప్రభుత్వ సెక్టార్ వైద్య సిబ్బంది విషయంలో ఇది 10.6 శాతంగానే ఉండటం గమనార్హం.ఆస్పత్రుల్లో భద్రతపై ఆందోళన కలుగుతున్నది. ముఖ్యంగా, ప్రయివేటు ఆస్పత్రుల విషయంలో ఇది మరింత ఎక్కువగా ఉన్నది. అయితే, ఆస్పత్రుల పరిసర ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది సరిపడా లేదని చాలా మంది వైద్యులు తెలిపారు. అంతేకాకుండా, వ్యయభారంపై దృష్టిపెట్టిన ఆస్పత్రులు తక్కువ వేతనాలకు వచ్చే భద్రతా సిబ్బందిని నియమిస్తున్నాయని చెప్పారు. భద్రత సిబ్బందిని నియమించే విషయంలో ఎక్స్‌సర్వీస్‌మెన్‌కు, శారీరకంగా బలంగా ఉండేవారిని నియమించాలని వైద్యులు సూచిస్తున్నారు.

# రాంనగర్‌లో 'హైడ్రా' కూల్చివేతలు

**నవతెలంగాణ-ముషీరాబాద్**

ముషీరాబాద్ నియోజకవర్గంలోని రాంనగర్ డివిజన్ మణెమ్మ గల్లీలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలకు ఉపక్రమించింది. పోలీసు బందోబస్తు మధ్య శుక్రవారం జీహెచ్ఎంసీ అధికారులు నిర్మాణాలను కూల్చేశారు. రోడ్లను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారని స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ రెండ్రోజుల కిందట రాంనగర్ మణెమ్మ గల్లీలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. దీనిపై నివేదిక సమర్పించాలని జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి అక్రమ నిర్మాణాలు అని నిర్ధారించి నివేదిక సమర్పించారు. 24 గంటల వ్యవధిలోనే జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ శుక్రవారం అక్రమ కట్టడాలను జేసీబీల సహాయంతో కూల్చేశారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో నాలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నియోజకవర్గ వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఉమ్మడి నల్లగొండ సస్యశ్యామలమే నా ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)

చమత్కరించారు. గతంలోనే సీఎం పదవి ఒక్కసారి మిస్సయిందన్నారు. భవిష్యత్‌లో సీఎం కావడం ఖాయమన్నారు. తన నాలుకపై మచ్చలున్నాయని.. తాను అన్నది నిజమవుతుందని, ఉత్తమ్ సీఎం కావడం ఖాయమన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలలో ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా పనిచేశారని, ఉత్తమ్ ఇరిగేషన్ శాఖ మంత్రి ఉండటం ఈ ప్రాంత అదృష్టమన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. గజ్వేల్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.హరిరామ్, హైదరాబాద్ ఇంజినీరింగ్ చీఫ్ మురళీధర్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనుల వివరాలను వివరించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేల్, మల్‌రెడ్డి రంగారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, డీసీసీబీ చైర్మెన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఇంజినీర్లు, గజ్వేల్, సూర్యాపేట, నల్లగొండ, భువనగిరి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

# న్యాయవ్యవస్థపై అత్యంత విశ్వాసం

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

భారత న్యాయ వ్యవస్థపై తనకు అత్యంత విశ్వాసముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మంజూరైన బెయిల్‌కు సంబంధించి ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన రేవంత్. 'నా వ్యాఖ్యలు న్యాయవ్యవస్థను ప్రశ్నిస్తున్నట్టుగా కొంత మంది విలేకర్లు వక్రీకరించారు. నేను అనని మాటలను అన్నట్టుగా రిపోర్టు చేశారు. పత్రికల్లో వచ్చిన వార్తలపై బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నా. న్యాయ వ్యవస్థ, దాని స్వతంత్రత పట్ల తనకు అపార గౌరవం, విశ్వాసం ఉన్నాయి. రాజ్యాంగం, దాని విలువలను విశ్వసించే నేను.. ఎన్నటికీ న్యాయవ్యవస్థను అత్యున్నతమైనదిగా భావిస్తూనే ఉంటా' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఆధారాలు చూశాకే కూల్చివేత చర్యలు

**హైదరాబాద్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కొర్రాముల (వెంకటాపూర్)లోని నాదం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, అనురాగ్ యూనివర్సిటీలకు చెందిన నిర్మాణాల కూల్చివేత చర్యలు చట్ట నిబంధనలకు లోబడే ఉండాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని వివరాల ఆధారాలను పిటిషనర్లకు అందజేయాలని, ఆపై వాళ్ల నుంచి వివరణ తీసుకోవాలని, ఆ తర్వాతే చర్యలు చట్ట ప్రకారం ఉండాలని ఆదేశించింది. తమ విద్యా సంస్థల కూల్చివేయకుండా ఆదేశాలివ్వాలంటూ దాఖలైన పిటిషన్లను శుక్రవారం జస్టిస్ వినోద్‌కుమార్ విచారించి పైవిధంగా హైడ్రా, ప్రభుత్వాలను ఆదేశించారు. చర్యలు చట్ట ప్రకారమే ఉంటాయన్న ప్రభుత్వ హామీకి అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేశారు. చట్టప్రకారం చర్యలు చేపడతామన్న ప్రభుత్వ హామీని రికార్డు చేసి పిటిషన్‌పై విచారణను మూసేశారు.

# ఓపీఎస్‌ను అమలు చేయాల్సిందే

## ఎన్‌పీఎస్, యూపీఎస్ రెండింటితో ఉద్యోగులకు ఒరిగేదేమీ లేదు

- ఓపీఎస్ ఉద్యోగుల హక్కు.. దాని కోసం పోరాటం కొనసాగుతోంది
- సెంట్రల్ సెక్రెటేరియట్ ఉద్యోగుల సంఘం స్పష్టం
- ఓపీఎస్ అమలు చేసే వరకు ఉద్యమాన్ని ఆపం : మంజీత్ సింగ్

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్), ఇటీవల కేంద్ర మంత్రి వర్గం ఆమోదించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) రెండింటితో ఉద్యోగుల ప్రయోజనాలకు ఒరిగేదేమీ లేదని సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ (సీఎస్ఎస్) అధికారుల సంఘం స్పష్టం చేసింది. పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)ను తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేసింది. అదొక్కటే మార్గమని స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం ప్రకటన విడుదల చేసింది. పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) ఉద్యోగుల హక్కు అని, దాని కోసం పోరాడుతూనే ఉంటామని సీఎస్ఎస్ ఫోరం తెలిపింది.

సీఎస్ఎస్ ఫోరం ఏకైక డిమాండ్ ఓపీఎస్ అని, తాము తమ చివరి శ్వాస వరకు ఓపీఎస్ కోసం పోరాడుతామని స్పష్టం చేసింది. ఓపీఎస్ ఉద్యోగుల హక్కు అని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పీఎస్, యూపీఎస్ రెండూ మంచివి కావని, ఎన్‌పీఎస్‌లో పెన్షన్ హామీ నిబంధన లేదని, యూపీఎస్ 30 నుంచి 35 ఏండ్ల వరకు సర్వీస్ చేసిన తరువాత కూడా ఎటువంటి సహేతుకమైన కార్పస్ నిబంధన లేదని తెలిపింది. సీఎస్ఎస్ ఫోరమ్ ప్రధాన కార్యదర్శి అశుతోష్ మిశ్రా మాట్లాడుతూ ఓపీఎస్‌కు ఎన్‌పీఎస్, యూపీఎస్ సరితూగవని అన్నారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించాల్సిందేనని డిమాండ్ చేశారు.

**ఓపీఎస్ అమలు చేసే వరకు ఉద్యమాన్ని ఆపం :మంజీత్ సింగ్**

ఆలిండియా ఎన్‌పీఎస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు మంజీత్ సింగ్ పటేల్ మాట్లాడుతూ ఓపీఎస్‌ల వల్ల అనేక ప్రయోజనాలు యూపీఎస్, ఎన్‌పీఎస్‌లకు లేవని అన్నారు. ఓపీఎస్ కింద, ఉద్యోగులు తమ చివరిగా డ్రా చేసిన బేసిక్ పే, డియర్‌నెస్ అలవెన్స్‌లో 50 శాతం పెన్షన్‌గా పొందారని ఆయన అన్నారు. "ఓపీఎస్‌ని తిరిగి తీసుకురావాలని లేదా దాని నిబంధనలను పూర్తిగా యూపీఎస్, ఎన్‌పీఎస్ లేదా ఏదైనా ఇతర పథకంలో చేర్చాలి. అప్పటి వరకు మేము మా ఉద్యమాన్ని ఆపము" అని స్పష్టం చేశారు. నేషనల్ మిషన్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ భారత్ పేరుతో దేశవ్యాప్త ఉద్యమాన్ని నడుపుతున్నారు.

2003 డిసెంబర్ 22 నాటి ఎన్‌డీఏ ప్రభుత్వంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఎన్‌పీఎస్ ప్రవేశపెట్టారు.

2004 జనవరి 1 నుంచి (సాయుధ బలగాలు మినహా) కేంద్ర ప్రభుత్వ సర్వీసులో కొత్తగా రిక్రూట్ అయ్యే వారందరికీ ఎన్‌పిఎస్ తప్పనిసరి చేసినట్లు 2024 ఆగస్టు 7న లోక్‌సభలో కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఇచ్చిన రాతపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. కోర్టు తీర్పులను అనుసరించి, పెన్షన్, పెన్షనర్ల సంక్షేమ శాఖ 2023 మార్చి 3న ఆదేశాలు జారీ చేసింది. ఎన్‌పీఎస్ నోటిఫికేషన్‌కి ముందు అంటే డిసెంబర్ 22న రిక్రూట్‌మెంట్/ అపాయింట్‌మెంటైన వారికి ఎన్‌పీఎస్‌లో వన్ టైమ్ ఆప్షన్ ఇచ్చింది. అయితే ఈ ఎన్‌పీఎస్‌కు వ్యతిరేకంగా ఉద్యోగులు రెండు దశాబ్దాలుగా ఉద్యమాలను కొనసాగిస్తోన్నారు. అయితే ఇటీవలి కేంద్ర మంత్రి వర్గం ఎన్‌పీఎస్ స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపీఎస్)ను



ప్రకటించింది. అయితే దీన్ని కూడా ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. తమకు ఒపీఎస్‌నే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఆగస్ట్ పెన్షన్ ఆలస్యం

**- రిటైర్డ్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆగ్రహం**

రిటైర్డ్ సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగులకు ఆగస్ట్ నెలలో పెన్షన్లు ఆలస్యంగా అందాయి. వాస్తవానికి వారికి ప్రతి నెలా 26న పెన్షన్లు అందుతాయి. అయితే, అది ఈ సారి ఆలస్యమై 29న వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. పెన్షన్ల జాప్యంపై కేంద్ర ప్రభుత్వ మాజీ ఉద్యోగులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది సోషల్ మీడియా వేదికగా తమ ఆందోళనలను వెల్లడిస్తున్నారు. పెన్షన్ల ఆలస్యంపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖను సంప్రదించగా.. పెన్షన్లను తాము ట్రాన్స్‌ఫర్ చేశామన్న ప్రభుత్వం, ఆలస్యానికి గల కారణాలను మాత్రం వెల్లడించలేదు.

# పారాలో పతక మోత

నవతెలంగాణ-పారిస్ : పారా అథ్లెట్లు ప్రపంచ క్రీడా వేదికపై భారత్‌కు గోల్డెన్ స్టాండర్డ్స్ నెలకొల్పారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగం (ఎస్‌హెచ్1) విభాగంలో భారత్ ఏకంగా రెండు పతకాలు సాధించింది. గతంలో భారత్ ఎన్నడూ మెడల్ పోడియంపై ఇలా రెండు పతకాలు ఒకే విభాగంలో సాధించలేదు. పారిస్ పారాలింపిక్స్‌లో అవని లేఖర, మోన అగర్వాల్ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించారు. టోక్యో పారాలింపిక్స్ గోల్డ్ మెడలిస్ట్ అవని లేఖర పారిస్‌లో పసిడి నిలబెట్టుకోగా.. తొలి ప్రయత్నంలోనే మోన అగర్వాల్ ప్రతిష్టాత్మక పారా విశ్వ క్రీడల్లో పతకం సాధించింది. పారాలింపిక్స్ 2024 రెండో రోజు పోటీల్లో భారత్ మరో రెండు పతకాలు సహా నాలుగు మెడల్స్ ఖాతాలో వేసుకుంది.

మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ (ఎస్‌హెచ్1) విభాగంలో భారత్ డబుల్ ధమాకా చూపించింది. డిఫెండింగ్ చాంపియన్ , 22 ఏండ్ల అవని లేఖర పసిడి పతకం నిలుపుకోగా.. కొత్త కెరటం మోన అగర్వాల్ సైతం పతక వేటలో మెప్పించింది. ఫైనల్లో అనుభవాన్ని అంతా ఉపయోగించిన అవని లేఖర సూపర్ గురితో 249.7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. పసిడి పతకం సొంతం చేసుకుంది. 36 ఏండ్ల మోన అగర్వాల్ తొలి ప్రయత్నంలోనే పతకం సాధించింది. ఆరంభంలో నెమ్మదించినా ఆఖరు రౌండ్ల సిరీస్‌లలో మోన మెప్పించింది. 228.7 పాయింట్లతో కాంస్య పతకం అందుకుంది. దక్షిణ కొరియా షుటర్ లీ 246.8 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ అందుకుంది. ఫైనల్ సిరీస్‌లో అవని లేఖర 9.9తో ఒత్తిడిలో పడగా.. అదే సిరీస్‌లో దక్షిణ కొరియా షుటర్ 6.8 పాయింట్లే సాధించింది. దీంతో అవని లేఖర సులువుగా బంగారు పతకం ఎగరేసుకుపోయింది. అవని లేఖర, మోన అగర్వాల్ పారిస్ పారాలింపిక్స్‌లో మరో మెడల్‌పై సైతం కన్నేశారు.



Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.